అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

గురువారం 23-3-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 81 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50


పోరాడినా..

- ఆస్ట్రేలియాకే దక్కిన సిరీస్
- మూడో వన్డేలో 21 పరుగుల తేడాతో భారత్ పరాజయం



వివరాలు 10లో..

మోడీ మాటలకు అర్థాలే వేరులే!



మహిళా ప్రాతినిధ్యంపైమాయ మాటలు

- కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య 11శాతం లోపే..
- 2011లో జరిగిన సర్వేనే ఆధారం..తాజాగా సర్వే చేపట్టని కేంద్రం
- 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును అటకెక్కించిన మోడీ సర్కార్
- వారి ప్రాతినిథ్యం లోక్‌సభలో 15శాతం..రాజ్యసభలో 13.6శాతం

వివిధ కేంద్ర మంత్రిత్వశాఖలు, వాటి విభాగాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య 10.9శాతం మాత్రమే ఉందని తాజాగా గణాంకాలు విడుదలయ్యాయి. ప్రస్తుతం లోక్‌సభలో మహిళా ఎంపీల సంఖ్య 82 (15శాతం), మార్చి 16నాటికి రాజ్యసభలో మహిళా ఎంపీల సంఖ్య 33 (13.6శాతం). లోక్‌సభలో ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్రమంత్రి స్మృతీ ఇరానీ పార్లమెంట్‌లో ఈ వివరాలు విడుదల చేశారు. అలాగే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్నీ తన సమాధానంలో ప్రస్తావించారు. ఆమె చెప్పినదాన్నిబట్టి ఈ బిల్లు ఇప్పట్లో అమోదం పొందే పరిస్థితి లేదని అర్థమవుతోంది.

న్యూఢిల్లీ : మహిళా సాధికారతపై పెద్ద పెద్ద ప్రసంగాలు చేసే మన పాలకులు..తీరా అధికారంలోకి వచ్చాక ఆ మాటే ఎత్తరు. బేటి బచావో, బేటి పడావో, చట్టసభల్లో 33శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు..మొదలైనవాటిపై అధికార బీజేపీ ఎన్నో వాగ్దానాలు చేసింది. మోడీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ సర్కార్ ఏర్పడి దాదాపు 9ఏండ్లు అవుతోంది. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేయటం మోడీ సర్కార్‌కు క్షణాల్లో పని. అయినప్పటికీ ఎన్నడూ ఈ బిల్లు గురించి అధికార బీజేపీ మాటమాత్రంగా కూడా మాట్లాడటం లేదు. దీంతో మహిళా రిజర్వేషన్ బిల్లు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నచందంగా మారింది.

చట్టసభల్లో 33శాతం మహిళా రిజర్వేషన్లు అమలుజేయాలని వివిధ రాజకీయ పార్టీలు ఎన్నో ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. దేవగౌడ ప్రధానిగా ఉన్న సమయంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం మొదటిసారిగా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. 1998, 1999, 2008, 2014లోనూ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. 2014లో మోడీ సర్కార్ వచ్చాక, ఈ బిల్లును పూర్తిగా మూలనపడేసింది.

30లక్షల్లో 3లక్షలు

కేంద్ర మంత్రిత్వశాఖలు, వాటి పరిధిలోని వివిధ విభాగాల్లో మహిళా ఉద్యోగుల వివరాలు సదరు ఎంపీ కోరగా, స్మృతీ ఇరానీ ఎప్పుడో 2011నాటి కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ చేపట్టిన సర్వేను ప్రస్తావించారు. డైరెక్టరేట్ జనరల్ (ఉపాధి, శిక్షణ) విడుదల చేసిన వివరాల్ని వెల్లడించారు. ఈ లెక్కల ప్రకారం వివిధ కేంద్రమంత్రిత్వ శాఖలు, వాటి విభాగాల్లో మొత్తం 30,87,278మంది ఉద్యోగులున్నారు. ఇందులో 3,37,439మంది మహిళలు పనిచేస్తున్నారు. దీనిని బట్టి మహిళల ప్రాతినిథ్యం 10.9శాతంగా ఉండొచ్చని స్మృతీ ఇరానీ అన్నారు. ఈ 9ఏండ్లలో మోడీ సర్కార్ ...5లో

పంచాయతీరాజ్‌లో 50శాతం రిజర్వేషన్

పంచాయతీరాజ్ సంస్థలు..భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 234డి కిందకు వస్తాయి. ఈ ఆర్టికల్ ప్రకారం పంచాయతీరాజ్ కిందకు వచ్చే అన్ని రకాల విభాగాల్లో కనీసం మూడోవంతు స్థానాలు మహిళలకు కేటాయించాలి. కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా 21 రాష్ట్రాలు మహిళలకు 50శాతం రిజర్వేషన్లు అమలుజేస్తూ, తమ తమ రాష్ట్రాల్లో పంచాయతీరాజ్ చట్టాల్ని చేశాయి. అయితే పంచాయతీరాజ్ సంస్థల్లో ఎంతమంది మహిళలున్నారు? వారి ప్రాతినిథ్యం ఏమేరకు పెరిగిందన్న వివరాల్ని పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడించలేదు.

పేపర్ లీకేజీలో కదులుతున్న డొంక

42 మందికి సిట్ నోటీసులు

- టీఎస్‌పీఎస్‌సీ ఓ జీరాక్స్ సెంటర్ అంటూ పోస్టర్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ కేసులో సిట్ వివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తోంది. మంగళ వారం నిందితులను మూడు వేర్వేరు చోట్ల అధికారులు విచారించి స్టేట్‌మెంట్స్‌ను రికార్డు చేసిన విషయం తెలిసిందే. అయితే గురువారంతో నిందితుల కస్టడీ ముగుస్తుండటంతో సిట్ అధికారులు మరింత దూకుడు పెంచారు. దాంతో డొంక కదులుతోంది. ఇప్పటికే బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసిన సిట్.. ఐదోరోజు బుధవారం దాదాపు 42 మందికి నోటీసులు జారీ చేసింది. వీరిలో గ్రూప్1 పరీక్ష రాసిన పలువురితోపాటు టీఎస్‌పీఎస్సీలో పనిచేస్తున్న వారు కూడా ఉన్నారు. కాన్ఫిడెన్షియల్ రూం అధికారిణి శంకర్ లక్ష్మిని రెండుసార్లు ప్రశ్నించిన ...5లో

కర్మాగారంలో ఊపిరాడక ఇద్దరు కూలీల మృతి

మరొకరి పరిస్థితి విషమం

- భద్రాద్రి జిల్లా లక్ష్మీపురంలో ఘటన

నవతెలంగాణ - బూర్గంపాడు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలోని ఓ ప్రయివేటు కర్మాగారంలో ఇరువురు వలస కూలీలు ఊపిరాడక మృతిచెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి జరిగింది. మరో కార్మికుడి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపురం గ్రామంలోని కోడిగుడ్డు ట్రే తయారీ ఫ్యాక్టరీలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు పనులు చేస్తున్నారు. బుధవారం కర్మాగారంలోని ముడిసరుకు నిల్వ ఉంచే బావిని శుభ్రం చేస్తున్నట్టు తెలిసింది.

ఈ క్రమంలో వారికి ఊపిరి అందక అపస్మారక స్థితికి చేరుకున్నారు. గమనించిన తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఇద్దరు కార్మికులు మృతిచెందారు. ఈ ప్రమాదంలో అదే గ్రామానికి మరో కార్మికుడి పరిస్థితి విషమంగా ఉండటంతో భద్రాచలం తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. బూర్గంపాడు ఎస్ఐ పి.సంతోష్ వివరాలు సేకరిస్తున్నారు.



అభివాదం చేస్తున్న తమ్మినేని..

అగ్రవర్ణాల రాజ్యమే బీజేపీ లక్ష్యం

ఒకే దేశం.. ఒకే మతం అంటున్న మోడీషా

- ఒకే కులం ఎందుకు అనట్లేదు?
- రాజ్యాంగం స్థానంలో మనుధర్మం తేవాలని ఎత్తుగడ
- బీజేపీ కాపలా కుక్క ఈడీ.. ప్రతిపక్షాలపై దాడి : తమ్మినేని
- ఇంటి నిర్మాణానికి రాష్ట్రం ఐదు లక్షలు, కేంద్రం పది లక్షలివ్వాలి
- ప్రజా సమస్యలపై వెనక్కి తగ్గబోం..
- వైరా, మధిర, బోనకల్‌లో యాత్రకు ఘన స్వాగతం

CPIM జన చైతన్య యాత్ర

సీపీఐ, బీఆర్ఎస్ సంఘీభావం

కె. శ్రీనివాసరెడ్డి, నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

అగ్రవర్ణాల ఆధిపత్య రాజ్యమే బీజేపీ లక్ష్యమని, ఒకే దేశం, ఒకే మతం అంటున్న మోడీషాలు.. ఒకే కులం అని ఎందుకు అనట్లేదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రశ్నించారు. కుల వ్యవస్థను కొనసాగించాలనేది వారి సిద్ధాంతం.. బీజేపీ సిద్ధాంతానికి అవరోధంగా ఉన్న కమ్యూనిస్టులు, భారత రాజ్యాంగాన్ని తప్పించాలని వారి ఎత్తుగడగా ఉందన్నారు. అందుకే రాజ్యాంగం ...3లో

ఘనంగా పద్మ అవార్డుల ప్రదానం

- రాష్ట్రపతి భవన్‌లో అవార్డులను బహూకరించిన రాష్ట్రపతి ముర్ము



రాష్ట్రపతి నుంచి అవార్డు స్వీకరిస్తున్న కమలేశ్ డి. పటేల్, సంకురాత్రి చంద్రశేఖర్‌రావు

న్యూఢిల్లీ: గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా.. దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులకు కేంద్రం ప్రకటించిన ...5లో

బిల్కిస్ బానో కేసుపై సుప్రీం ప్రత్యేక బెంచ్

- నిందితులకు శిక్ష తగ్గించడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్



న్యూఢిల్లీ : తనపై లైంగికదాడికి పాల్పడిన నిందితులకు శిక్ష తగ్గించడాన్ని సవాల్ చేస్తూ బిల్కిస్‌బానో దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ...5లో

పారదర్శకంగా విచారణ జరపాలి

పేపర్ లీకేజీపై గవర్నర్‌కు రేవంత్‌రెడ్డి వినతి

- మంత్రి కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలని విజ్ఞప్తి
- ఐటీ శాఖ ఉద్యోగులదే కీలక పాత్ర
- టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యుల్ని సస్పెండ్ చేయాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పేపర్ లీకేజీలో విచారణ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి గవర్నర్‌ను కోరారు. మంత్రి కేటీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ లీకులో మంత్రి కేటీఆర్‌కు సంబంధించిన ఐటీ శాఖ ఉద్యోగులే కీలక పాత్ర వహించారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ చైర్మెన్, సభ్యులను సస్పెండ్ చేసే అధికారం గవర్నర్‌కు ఉన్నదని తెలిపారు. బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయంలో న్యాయ సలహాలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్టు రేవంత్ చెప్పారు. పేపర్‌ను దొంగిలించి కోట్ల రూపాయలకు అమ్ముకుని లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. ఈ ...5లో



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతల బృందం

నేడు పలు జిల్లాల్లో సీఎం పర్యటన



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గురువారం పలు జిల్లాల్లో పర్యటించనున్నారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు వెళ్తారు. ఈ సందర్భంగా వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తారు. ఇటీవల రాష్ట్రంలో కురిసిన వర్షాలకు భారీగా పంట నష్టం జరిగిన విషయం తెలిసిందే. కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో భారీగా పంట నష్టం జరిగిన నేపథ్యంలో సీఎం ఆయా జిల్లాల్లో పరిశీలించనున్నారు.



హైదరాబాద్ రవీంద్రభారతిలో

వ్యతిరేకత ఉంది...రాజు జాగ్రత్త

ప్రభుత్వ పంచాంగ శ్రవణంలో హెచ్చరిక

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాజకీయంగా అధికారపార్టీకి వ్యతిరేకత ఉన్నదనీ, పాలించే 'రాజు' జాగ్రత్తగా ఉండాలని ఉగాది వేడుకల సందర్భంగా నిర్వహించిన పంచాంగం శ్రవణంలో సిద్ధాంతి హెచ్చరిక చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో శారదాపీఠం పండితులు బాచుపల్లి సంతోష్‌కుమార్ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నదని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ ఏడాది ...5లో

హైదరాబాద్ చేరుకున్న కవిత, మంత్రులు

ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ ఎదుర్కొంటున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్ చేరుకున్నారు. ప్రత్యేక చాపర్ విమానంలో ఢిల్లీ నుంచి ఆమెతో పాటు మంత్రులు కే తార కరామారావు, టీ హరీశ్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అటునుంచి వారంతా నేరుగా ప్రగతిభవన్‌కు వెళ్లారు.

రాజకీయాల్లో మతానికి స్థానం లేదన్న భగత్‌సింగ్

చరిత్ర పునరావృతం కాదు. కానీ ఘటనలను పోలిన ఘటనలు జరుగుతూ ఉంటాయి. ఆ విధంగా గత చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనలు మరో రూపంలో ఇప్పుడు కూడా జరుగుతున్నాయా అనిపిస్తుంది. 1919లో మొదటి ప్రపంచ యుద్ధం ముగింపు దశలో ఉండగా భారతదేశంలో స్వాతంత్రోద్యమం కొత్త ఉత్సాహంతో ఉరకలు వేసింది. దానికి ముఖ్యమైన కారణం ఆ యుద్ధ కాలంలో సామ్రాజ్యవాదం బలహీనపడి నూతన సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్ అవతరించడం, దాని ప్రభావంతో దేశదేశాలలో వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమాలు పుంజుకున్నాయి. దీనిని అదుపు చేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదం త్రిముఖ వ్యూహాన్ని అనుసరించింది. ఒకటి మాంటెగ్ ఛైమ్స్ ఫోర్డ్ సంస్కరణల ద్వారా భారతీయుల స్వాతంత్ర్య అభిలాషను గుర్తించామన్న భావనను కల్పించి సంతృప్తి పర్చడం. రెండు నిర్బంధ చర్యలతో ఉద్యమాన్ని అణచివేయడం. మూడు హిందూ-ముస్లిం ఘర్షణలు సృష్టించి ప్రజల మధ్య చీలికలు పెట్టడం. భారతీయుల స్వాతంత్రోద్యమ అభిలాషను అణచివేయడానికి మార్చి మొదటివారంలో రౌలట్ చట్టం తీసుకువచ్చింది. నిరసన తెలిపే హక్కు, ఊరేగింపులు, సభలు జరుపుకునే, సంఘాలు పెట్టుకునే హక్కు ఆఖరికి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కును సైతం ఈ చట్టం లాగేసుకుంది. పౌరుల కదలికలపై తీవ్రమైన ఆంక్షలు విధించింది. విమర్శకులకు దేశద్రోహ ముద్ర వేసింది. రాజద్రోహం నేరం కింద జైళ్ళలో కుక్కింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో ప్రజలు ఏప్రిల్ 14న సభ జరుపుకోవడానికి జమ కూడారు. దీన్ని అదునుగా తీసుకుని నాటి పోలీసు అధికారి డయ్యర్ ప్రజలపై విచక్షణా రహితంగా కాల్పులు సాగించాడు. ఈ కాల్పుల్లో 1200మంది అసువులు బాశారు. స్వాతంత్రోద్యమ చరిత్రలో ఇది రక్తాక్షరాలతో లిఖించిన అధ్యాయం. భారతదేశం భగ్గుమంది. స్వాతంత్ర్యోదమం ఉవ్వెత్తున ఎగిసింది. దేశ వ్యాప్తంగా హిందూ, ముస్లింలు భుజం భుజం కలిపి ఖిలాఫత్ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఖిలాఫత్ ఉద్యమం ద్వారా వచ్చిన ఐక్యత స్వాతంత్రోద్యమంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన సహాయ నిరాకరణోద్యమానికి నాంది పలికింది. 1921-22లో దేశమంతా స్వాతంత్రోద్యమ గాలులు వీచాయి. బ్రిటిష్ వారికి పన్నులు చెల్లించ నిరాకరించడం మొదలుకొని విదేశీ వస్తు బహిష్కరణ వరకు ఇది సాగింది. గాంధీ ఈ ఉద్యమాన్ని శాంతియుత సత్యాగ్రహ రూపంలో సాగించారు. అయితే 1922 ఫిబ్రవరిలో చౌరీచౌరాలో జరిగిన ఘటనను ఆసరా చేసుకుని గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని ఉపసంహరించారు. యువతరంలో దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. అసంతృప్తికి గురైన యువనాయకత్వం నూతన మార్గం కోసం అన్వేషించారు. ఈ క్రమంలోనే భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, భటుకేశ్వర దత్ లాంటి జాతీయ విప్లవకారులు పురుడు పోసుకున్నారు. జలియన్‌వాలాబాగ్ ఘటనతో చలించిపోయిన భగత్‌సింగ్ తన 12వ ఏటనే ఆ స్థలాన్ని సందర్శించి పోరాట స్ఫూర్తిని పొందాడు. 14వ ఏట స్కూలును బహిష్కరించి బ్రిటిషువారిపై తిరుగుబాటు చేశాడు. 1923లో హిందూస్థాన్ రిపబ్లికన్ ఆర్మీలో సభ్యుడుగా చేరాడు. 1925లో మొదటిసారి అరెస్టు వారంటు వచ్చింది. 1926 నుంచి నౌజవాన్ భారత సభలో చురుకైన పాత్ర పోషించాడు. 1928లో సైమన్ గోబ్యాక్ ఉద్యమంలో లాలా లజపతిరాయ్‌పై లాఠీ ఝళిపించి మరణానికి కారకుడైన శాండర్స్‌ను హత్య చేయడంతో భగత్‌సింగ్ రాజకీయ జీవితం బయట ప్రపంచానికి వెల్లడైంది. తదనంతరం వ్యక్తిగత హత్యలతో స్వాతంత్ర్యం సాధించలేమని ప్రజలను కూడగట్టి రాజ్యాధికారాన్ని కూలదోస్తేనే స్వాతంత్ర్యం వస్తుందని జీవితానుభవం ద్వారా గ్రహించాడు. ఆ క్రమంలోనే సోషలిస్టు భావాలతో ప్రభావితుడయ్యాడు. పంజాబ్ కమ్యూనిస్టు నాయకుడు సోహన్ సింగ్ జోష్‌తో పరిచయమైనాక మరింత పరిపక్వత సాధించాడు. సోషలిజమే జీవితాశయంగా బహిరంగంగా ప్రకటించాడు. అది 1928లో హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీగా రూపాంతరం చెందింది. 1931 మార్చి 23న ఉరికంబం ఎక్కబోయే ముందు జైలు గోడల మధ్య లెనిన్ జీవిత చరిత్రను చదువుతూ తానొక గొప్ప విప్లవకారునితో సంభాషిస్తున్నట్లుగా జైలు అధికారులతో భగత్‌సింగ్ చెప్పుకున్నాడు. భగత్‌సింగ్, సుఖదేవ్, రాజగురు లాంటివారు భారతదేశాన్ని దాస్య శృంఖలాల నుంచి విముక్తి చేయటానికై అమరులైన చారిత్రక దినం నేడు మనం జరుపుకుంటున్నాం. 1928లో బ్రిటిష ప్రభుత్వం కమ్యూనిస్టులను, కార్మికోద్యమాలను అణచడానికి ప్రజా భద్రతా బిల్లు, పారిశ్రామిక సంబంధాల బిల్లును తీసుకొచ్చింది. ఇవి రెండూ విప్లవ, కార్మికోద్యమాలను నిషేధించేవే. వీటికి వ్యతిరేకంగా ఏప్రిల్ 8న పార్లమెంటులో బాంబులు వేసి సంచలనం సృష్టించాలని, ఈ నిరంకుశ బిల్లులకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావాలని భగత్ సింగ్ బృందం భావించింది. బటుకేశ్వర్ దత్తుతో కలిసి భగత్‌సింగ్ ఈ బాంబులు వేశారు. తప్పించుకోకుండా అక్కడే నిలబడి నినాదాలిచ్చారు. జాతీయ విప్లవకారుల భావాలను ప్రభావితం చేయడానికి కమ్యూనిస్టు పార్టీకి చెందిన వాన్ గార్డ్ అనే పత్రికలో జాతీయవాదులకు విజ్ఞప్తి పేరుతో ఒక వ్యాసం ప్రచురించారు. 1929 అక్టోబర్ 19న విద్యార్థి మహాసభకు సందేశం పంపుతూ ఇలా రాశారు... "పిస్టళ్లను, బాంబులను చేపట్టాల్సిందిగా ఈనాడు మనం యువకులను అడగజాలం. పారిశ్రామిక ప్రాంతాల్లోని మురికివాడల్లోనూ, గ్రామసీమల్లోని గుడిసెల్లోనూ నివసించే కోట్లాది ప్రజలను చైతన్యపరచాల్సి ఉంది." "నిజమైన విప్లవ సైనికులు గ్రామాల్లోను, ఫ్యాక్టరీల్లోనూ ఉన్న రైతులు, కార్మికుల్లోనే ఉన్నారు" అంటూ "మార్క్స్, లెనిన్ రచనలను చదవాల్సిందిగా యువతకు సలహా ఇస్తున్నాను"అన్నాడు. వృత్తి విప్లవకారుల అవసరాన్ని ఆయన గుర్తించారు. తనను ఉరి తీయడానికి సంవత్సరం ముందు జైలు మిత్రులతో మాట్లాడుతూ.. "వాళ్లు నన్ను చంపి వేయవచ్చు. కానీ నా భావాలను వారు అణచివేయలేరు. ఒక శాపంవలే నా భావాలు బ్రిటిషు వారిని వెంటాడుతాయి. దానితో చివరకు వారు ఇక్కడ నుంచి పారిపోవాల్సి వస్తుంది" అని ప్రగాఢమైన విశ్వాసంతో చెప్పాడు. "బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు బతికున్న భగత్‌సింగ్ కంటే చనిపోయిన భగత్‌సింగ్ మరింత ప్రమాదకారి. నన్ను ఉరితీసిన తర్వాత నా విప్లవభావాలు ఈ సుందర భారతాన్ని నలుదిశలా వెదజల్లుతాయి. యువత స్వాతంత్ర్యం కోసం, విప్లవం కోసం తపించేట్లు చేస్తాయి. ఇది దృఢ విశ్వాసం" 1947 ఆగస్టు15 భారతదేశ విముక్తితో భగత్‌సింగ్ కల అక్షర సత్యమైంది. ఈనాడు స్వాతంత్రోద్యమంతో ఏమాత్రం సంబంధంలేని బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చింది. బీజేపీని వెనుక నుంచి నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ స్వాతంత్రోద్యమానికి వెన్నుపోటు పొడిచింది. నాడు బ్రిటిష్ వారి చేతిలో పావుగా ఉన్న హిందూ, ముస్లిం ఘర్షణలను తీవ్రం చేసింది. ఒకవైపు ముస్లింలీగ్ నాయకుడు జిన్నా, మరోవైపు ఆర్ఎస్ఎస్ నాయకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించి దేశ విభజనకు కారకులయ్యారు. నాడు వారు రగిల్చిన చిచ్చు ఇప్పటికీ రావణాసుర కాష్టంలా మనల్ని వెంటాడుతూనే ఉంది. నేడు దేశ ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయి అల్లాడుతుంటే దేశభక్తి పేరుతో అంబానీ,అదానీ లాంటి కార్పొరేట్లకు ప్రభుత్వ ఆస్తులను ధారాదత్తం చేస్తున్నారు. సంఘ్ పరివార్ మోడీని విమర్శించే వారందరినీ దేశద్రోహులుగా ముద్ర వేస్తున్నది. దేశాన్ని బలహీనపరచి సామ్రాజ్యవాదుల సరుకుల దొడ్డిగా మార్చడానికి మోడీ కంకణం కట్టుకున్నాడు. రాజ్యాంగానికి పునాదులైన ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయి. వీటిని కాపాడుకుంటూ మరో నూతన ప్రపంచానికి నాంది పలకాలి. డెబ్బైయేండ్ల తర్వాత మరలా నాటి బ్రిటిష్ వ్యతిరేక పోరాటం తరహాలో మరో స్వాతంత్రోద్యమానికి నాంది పలకాల్సిన సమయమిది. బ్రిటీష్ నిర్బంధకాండలో నుంచి భగత్‌సింగ్ ఆవిర్భవించినట్లుగానే నేడు బీజేపీ మతోన్మాద వ్యతిరేక పోరాటంలో నుంచి చరిత్రను తిరగరాసే కొత్త తరం ఆవిర్భవిస్తుంది. అయితే ఈతరం ఎటువైపు నిలబడాలో నిర్ణయించుకోవాలి. భగత్ సింగ్‌లా పోరాడి దేశసమైక్యతను కాపాడాలా? సంఘ్ పరివార్ దేశ విచ్ఛిన్నకులుగా మారాలా? భగత్‌సింగ్ సాక్షిగా మార్పునకు స్వాగతం పలికే తరానికి ఇది చరిత్ర విసురుతున్న సవాల్. భగత్‌సింగ్ రాజకీయ జీవితం సుమారు ఏడు సంవత్సరాలే. కేవలం ఈ కాలంలోనే విప్లవ దార్శనికతనీ, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ చైతన్యాన్నీ, విస్పష్టమైన సోషలిస్టు లక్ష్యాన్ని చాటడంతో పాటు వాటిని సాధించటానికి అవసరమైన అంకురిత దీక్షా తత్వాన్నీ,త్యాగనిరతిని ప్రదర్శించిన భగత్ సింగ్‌ను ఈ దేశ పాలకులు నేటికీ సాధ్యమయినంత వరకు విస్మరించే పనిలోనే ఉన్నారు. తన ప్రతి రాజకీయ దశలోనూ నిజమైన లౌకికవాదిగా జీవించిన భగత్‌సింగ్‌ను లౌకికవాదిగా స్మరించని భారతీయ జనతా పార్టీ పాలకులు సావర్కర్‌ని ఒక వీరునిగా ప్రదర్శిస్తున్నారు.తన జీవితకాలంలో మూడుసార్లు బ్రిటిషు పాలకులకు, రెండు సార్లు కాంగ్రెస్ వారికి లొంగుబాట్లు ఇచ్చి జైలు నుండి బయట పడాలని చూసిన సావర్కర్, త్యాగజీవి భగత్‌సింగ్‌కు సాటిగా ఎలా నిలవగలుగుతాడు?



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

> రాజకీయాలలో మతానికి స్థానం లేదన్న భగత్‌సింగ్, నేడు మత ద్వేష రాజకీయాలతో అధికారం చెలాయించాలని ప్రయత్నించే హిందుత్వవాదులది పరస్పర విరుద్ధ చరిత్ర. అందుకే కామ్రేడ్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ను బ్రిటిష్ ముష్కరులు ఉరితీసిన మార్చి 23ను లౌకిక ప్రజాస్వామ్య దినంగా ప్రకటించాలి. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చడానికి బదులు భగత్‌సింగ్ రచనలన్నింటినీ, ప్రధాన భారతీయ భాషల్లోకి అనువాదాలు చేయించి ముద్రించాలి. భగత్‌సింగ్ వీలునామాను విద్యార్థులకు పాఠ్యాంశంగా నిర్ణయించాలి.



రాజకీయాలలో మతానికి స్థానం లేదన్న భగత్‌సింగ్, నేడు మత ద్వేష రాజకీయాలతో అధికారం చెలాయించాలని ప్రయత్నించే హిందుత్వవాదులది పరస్పర విరుద్ధ చరిత్ర. అందుకే కామ్రేడ్ భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ను బ్రిటిష్ ముష్కరులు ఉరితీసిన మార్చి 23ను లౌకిక ప్రజాస్వామ్య దినంగా ప్రకటించాలి.

భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చడానికి బదులు భగత్‌సింగ్ రచనలన్నింటినీ, ప్రధాన భారతీయ భాషల్లోకి అనువాదాలు చేయించి ముద్రించాలి. భగత్‌సింగ్ వీలునామాను విద్యార్థులకు పాఠ్యాంశంగా నిర్ణయించాలి. ఉరికంబంపై నిలబడి దిక్కులు పిక్కటిల్లేలా ఇచ్చిన నినాదాలు ఇంకా సజీవంగానే ఉన్నాయంటే వారి ఆశయాలు, లక్ష్యాలు ఇంకా సాధించ వలసిన కర్తవ్యాలుగానే మిగిలి ఉన్నాయని గుర్తించాలి. వాటి సాధనకు నేటి తరం ముందుకు సాగాలి.

'భారత తొలి సామ్యవాద భావ విప్లవ కెరటం భగత్‌సింగ్'



తంగిరాల చక్రవర్తి
9393804472

భారత స్వాతంత్ర్య సమరయోధుల్లోను, విప్లకారులు, సోషలిస్టులల్లోనూ అగ్రశ్రేణికి చెందిన వారిలో భగత్‌సింగ్ ఒకరు. అంతే కాదు, ఈ దేశంలో మొట్టమొదటి మార్క్సిస్ట్ సిద్ధాంత ఆలోచనాపరులలోకూడా ఆయన ముఖ్యుడు. ఉరి కొయ్యకు తల వంచని ధీరత్వం ఆయనది. అశేష పీడిత జన విముక్తికై గొంతెత్తిన "ఇంక్విలాబ్ జిందాబాద్" రణ నినాదమై ధ్వనిస్తాడు. ప్రతి విప్లవకారుని హృదయంలో... ఆయన ఆశయాలు నిత్యం సజీవమై ఉన్నాయి. ఆనాటి ఆయన ముఖ్య అనుచరులంతా తరువాత కాలంలో కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలంగా కేంద్రకమిటీ స్థాయిల్లో పనిచేశారు. ఇది గమనించాల్సిన ముఖ్య అంశం. గొప్ప విషయం. వారి రచనల ద్వారా ఎన్నో అంశాలు తెలుస్తాయి. శివవర్మ, విజయకుమార్ సిన్హా, గణేశ్ శంకర్ విద్యార్థి, అజయ్‌ఘోష్, జయదేశ్ కపూర్, భగవతీచరణ్, డాక్టర్ కిచ్లు, డాక్టర్ సత్యపాల్, సత్యభక్త, సెహగల్, రాధా మోహన్ తదితరులు భారత కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ కేంద్ర నేతలుగా ఉన్నారు. 1907 అక్టోబర్ 7వ తేదీన పంజాబ్‌లోని బంగా గ్రామంలో పుట్టిన భగత్‌సింగ్‌ను బ్రిటిష్ పాలకులు 1931 మార్చి 23వ తేదీన 'ఉరి' తీశారు. మతాన్ని - సామ్రాజ్యవాదాన్ని తరిమి కొట్టడమే అతనికి మనమిచ్చే నేటి నివాళి. దేశ మాత దాస్య శృంఖలాలు బద్దలు కొట్టాలనే దృఢ సంకల్పంతో దేశంలో విడి విడిగా గ్రూప్‌లుగా పనిచేస్తున్న విప్లవ తీవ్ర వాద సంస్థల్ని ఒక సంస్థగా కలిపి దేశంలోని యువతనే గాక, యావత్ భారత ప్రజల్ని విప్లవంవైపు చూసేలా వీరోచిత కృత్యాలు భగత్‌సింగ్. ఆయన సహచరులు కొద్ది కాలంలోనే చేశారు. అనుశీలన్ సమితి, యుగాంతర్, గద్దర్‌వీరుల, హిందుస్థాన్ ప్రజాతంత్ర సంఘం" నవ జవాన్ భారత్ సభ - లాంటి సంస్థల్ని ఏకం చేసిన "హిందూస్థాన్ సోషలిస్టు ప్రజాతంత్ర సంఘం" స్థాపించి బ్రిటిష్ పాలకుల్ని గజగజలాడించిన విప్లవ సింహం భగత్‌సింగ్. 1931 అక్టోబర్ 3 విమలా ప్రతిభాదేవి పరిశోధనా గృహంలో భగత్‌సింగ్ విప్లవ రూపకల్పన డాక్యుమెంట్ లభించింది. విప్లవసాధనకై తన కృషి ఆ రచనలో తెలుస్తుంది.

భగత్‌సింగ్ ఎంతటి ఉద్యమకారుడో అంతకన్నా హెచ్చుగా వేలాది గ్రంథాలు అధ్యయనం చేసిన విజ్ఞానశీలి. విక్టర్ హ్యూంగో, హాల్కేన్, అప్టన్‌సింక్లర్, టాల్‌స్టాయ్, డాస్కోవస్కీ, గోర్కీ, బెర్నార్డ్ షా, డికెన్స్, మార్క్స్ - లెనిన్‌ల సాహిత్యంతో బాటు నిర్మలానంద స్వామి (ఇంకిత జ్ఞానం) బకనిన్ (దేవుడురాజ్యం), డార్విన్ (ఆరిజన్ ఆఫ్ స్పీషిస్) లాంటి పుస్తకాలతో పాటు ఫ్యూయర్ బాక్ (హేగల్ శిష్యుడు) హెగల్‌ల సాహిత్యం చదివాడు. లెనిన్ కార్యాచరణపై చక్కటి అవగాహన - విశ్లేషణ భగత్‌సింగ్ కలిగివున్నాడు. (మొదటి డ్యూమా, రెండో డ్యూమాపై) ఈ దేశంలో సైమన్ రాకను నిరసిస్తూ లాలాలజపతిరాయ్, నిరసన - ఆయనపై పోలీసుల దాడి - ఆయన మృతికి కారకుడైన స్కాట్‌ను చంపేయత్నంలో సాండర్స్‌ను చంపడం - కకోరి రైలు దోపిడి (బ్రిటిష్‌వారి ధనాగారానికి పంపే నగదు) బ్యాంక్ లూటీ, పార్లమెంట్‌లో బాంబు లేయడం... ఆ తరువాత లొంగిపోయి కోర్టులో విప్లవ పంథా వినిపించడం... హేతువాదం - నాస్తిక భావాలు వెల్లడించడం ముఖ్యమైన అంశాలు. ఈ దేశంలో విప్లవోద్యమానికి డాక్యుమెంట్ తయారు చేయడం - తండ్రికి దేశ భక్తియుతంగా లేఖరాయడం, తన విప్లవ వీలునామా ప్రకటన లాంటి చర్యలు ప్రేరణగా నిలుస్తాయి. ప్రపంచ విప్లవోద్యమాల్లో చేగువేరాలా, భారత్‌లో భగత్‌సింగ్ యువత హృదయాల్లో రెడ్‌స్టార్‌గా ఎప్పటికీ ఉంటారు. సామ్రాజ్యవాదాన్ని - మతోన్మాదాన్ని ఏకకాలంలో ఎదుర్కొనే నేటి సందర్భంలో భగత్‌సింగ్ ఉద్యమ గురువుగా ఉంటారు. ఆయన భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళడమే ఆయనకు మనమిచ్చే నివాళి.

(నేడు భగత్‌సింగ్ 92వ వర్ధంతి)

కలిసికట్టుగా...



మాస్కో: క్రెమ్లిన్‌లోని ది ప్యాలెస్ ఆఫ్ ది ఫాసెట్స్‌లో విందుకు హాజరైన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్

బ్యాంకులను కాపాడాలి



వాషింగ్టన్: "స్టాప్ దర్టీ బ్యాంక్స్" ర్యాలీలో బ్యాంకు అధికారుల మాస్కులు ధరించి నిరసన

మాక్రాన్‌కు నిరసన సెగ



పశ్చిమ ఫ్రాన్స్: నాంటెస్‌లో పదవీ విరమణ వయస్సు పెంపునకు వ్యతిరేకంగా నిరసన

'సేవ్ డెమోక్రసీ సేవ్ కాన్‌స్టిట్యూషన్'



కోల్‌కతా: కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా 'సేవ్ డెమోక్రసీ సేవ్ కాన్‌స్టిట్యూషన్ ర్యాలీలో లాయర్లు

కేంద్ర ప్రభుత్వ దురహంకారమిది..

- డీవోపీటీ ఆదేశాల్ని రద్దు చేయాల్సిందే : సీఐటీయూ
- నిరసన..ఉద్యోగుల ప్రజాస్వామ్య హక్కు
- వారికి కార్మిక సంఘాల మద్దతు కొనసాగుతుంది : తపన్‌సేన్

న్యూఢిల్లీ : ప్రభుత్వ ఉద్యోగులెవ్వరూ సమ్మె, సామూహిక సెలవులు, ధర్నాలు, నిరసనలు చేపట్ట కుండా మోడీ సర్కార్ జారీచేసిన ఆదేశాల్ని రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఉద్యోగు లను హెచ్చరిస్తూ జారీచేసిన ఆదేశాల్ని, కేంద్ర ప్రభుత్వ దురహంకారాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. ఉద్యోగులు సామూహికమైన వ్యక్తీకర ణలకు దిగరాదని, సమ్మె, నిరసనల్లో పాల్గొనరాదని ఆదేశిస్తూ డీవోపీటీ మార్చి 20న ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వులను ఉల్లంఘించినట్టు తేలితే ఉద్యో గులపై కఠినమైన క్రమశిక్షణా చర్యలుంటాయని తెలిపింది. ఈ ఉత్తర్వులను ఖండిస్తూ బుధవారం సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగుల ప్రజా స్వామ్య హక్కులను కాలరాసే నిరంకుశ ప్రయత్నంగా పేర్కొన్నారు. "కార్మిక వ్యతిరేక విధానాలకు మోడీ సర్కార్ ప్రసిద్ధిగాంచింది. దేశవ్యాప్తంగా ఉద్యోగుల నుంచి నిరసనలు ఎదురవుతున్నాయని భయపడుతోంది. వీటిని అణచివేసేందుకు రకరకాలుగా ప్రయ త్నిస్తోంది. పాత పెన్షన్ (ఓపీఎస్) కోసం జరుగు తున్న ఉద్యోగుల నిరసనలు, ఆందోళనలు మోడీ సర్కార్‌కు రాజకీయంగా సవాల్‌గా మారుతున్నా యి. ప్రజాస్వామ్య పద్ధతుల్లో జరుగుతున్న ఉద్యోగుల నిరసనల్ని నిషేధించాలని కేంద్రం భావిస్తోంది. జిల్లా స్థాయిల్లో నిరసన ర్యాలీలు చేపట్టాలని ఉద్యోగ సంఘాల నేషనల్ జాయింట్ కౌన్సిల్ ఆఫ్ యాక్షన్ నిర్ణయించిన వెంటనే డీవోపీటీ ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే కేంద్రం బెదిరింపులు ఉద్యోగుల నిరసనల్ని ఆపలేవు. తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యోగులు చేప డుతున్న ఆందోళనలు, నిరసనలకు సీఐటీయూ ఎప్పుడూ అండగా నిలుస్తుంది. కార్మికసంఘాలు తమ మద్దతు కొనసాగిస్తా"యని తపన్‌సేన్ చెప్పారు.



సిసోడియా కస్టడీ పొడిగింపు

- లిక్కర్ స్కాం కేసులో ప్రత్యేక కోర్టు ఆదేశం

ఢిల్లీ: లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన ఆప్ కీలక నేత మనీశ్ సిసోడియా కస్టడీని ఢిల్లీ ప్రత్యేక కోర్టు పొడిగించింది. ఈ కేసులో కస్టోడియల్ ఇంటరాగేషన్ ముగియడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయన్ని బుధవారం రౌస్ ఎవెన్యూ కోర్టులో ప్రవేశపెట్టింది. దీంతో.. స్పెషల్ జడ్జి ఎంకే నాగ్‌పాల్, సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ఆదేశించారు.

హైవేలపై పచ్చదనం

- జాతీయ రహదారుల సుందరీకరణలో హెచ్ఎండిఏ కీలకపాత్ర
- వరంగల్, నాందేడ్ నేషనల్ హైవేలపై రూ.18.61 కోట్లతో పనులు పూర్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పచ్చదనం పరిమళాలు పట్టణాలకే పరిమితం కాకుండా జాతీయ రహదారుల వెంట విస్తరిస్తున్నది. మండు వేసవిలోనూ పచ్చదనంతో, పూల వనాలతో హైదరాబాద్‌కు వచ్చే నేషనల్ హైవే మార్గాలు ప్రజానీకానికి కంటికి ఇంపుగా ఆనందాన్ని కలిగిస్తున్నాయి. హైదరాబాద్ నగరానికి అనుసంధానంగా ఉన్న నేషనల్ హైవేలు, స్టేట్ హైవేల సుందరీకరణలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) కీలక పాత్ర పోషిస్తున్నది. ప్రజల అవసరాలకు అనుగుణంగా, భవిష్యత్ తరాలకు పర్యావరణ సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా విరివిగా పచ్చదనాన్ని (గ్రీనరీ) పెంచేందుకు ఏర్పాట్లు చేసింది.

వరంగల్ నేషనల్ హైవే(ఎన్‌హెచ్-163) వెంట ప్రస్తుతం యాదగిరిగుట్ట రాయగిరి క్రాస్ రోడ్స్ వరకు ఉన్న హెచ్ఎండీఏ "మల్టీలేయర్ ప్లాంటేషన్" గ్రీనరీని జనగామ వరకు పొడిగించాలని సీఎం కేసీఆర్ పురపాలక శాఖను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి వరంగల్ దాకా గ్రీన్ కారిడార్‌ను తలపించేలా పచ్చదనాన్ని నెలకొల్పాలని మున్సిపల్ పరిపాలన పట్టణ అభివృద్ధి శాఖకు సూచించారు. ఈ మేరకు మంత్రి కేటీఆర్ మార్గదర్శకంలో పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, మెట్రోపాలిటన్ కమిషనర్ అర్వింద్ కుమార్ పర్యవేక్షణలో హెచ్ఎండీఏ యుద్ధపాతిపదికన ఈ పనులను పూర్తి చేసింది.

"తెలంగాణకు హరితహారం'లో భాగంగా మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఓఆర్ఆర్, వరంగల్ నేషనల్ హైవే(ఎన్‌హెచ్-163)వెంట జనగామ వరకు దాదాపు రూ.15.04 కోట్లతో హెచ్ఎండీఏ రూపొందించిన "మల్టీలేయర్ ప్లాంటేషన్" ఆకట్టుకుంటున్నది. ఇప్పటికే రూ.15.04 కోట్లతో వరంగల్ హైవే వెంట 64 కిలోమీటర్లు, రూ.3.57 కోట్లతో నాందేడ్ హైవే (ఎన్‌హెచ్-161) వెంట 33 కిలోమీటర్ల సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీ లేయర్ ప్లాంటేషన్ పనులు పూర్తయ్యాయి. శ్రీశైలం హైవే (ఎన్‌హెచ్-765) వెంట శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మహేశ్వరం వరకు 18 కిలోమీటర్ల సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీ లేయర్ ప్లాంటేషన్ నిర్వహణ, కర్నూలు హైవే (ఎన్‌హెచ్-44) వెంట ఆరాంఘర్ నుంచి షాద్‌నగర్ వరకు 25 కిలోమీటర్ల సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీ లేయర్ ప్లాంటేషన్‌ను హెచ్ఎండీఏ నిర్వహించింది. రాజీవ్ రహదారి స్టేట్ హైవే (ఎన్‌హెచ్-1) వెంట శామీర్‌పేట నుంచి గజ్వేల్ వరకు దాదాపు 39 కిలోమీటర్ల మేరకు సెంట్రల్ మిడెన్ గ్రీనరీ, మల్టీ లేయర్ ప్లాంటేషన్ నిర్వహించింది. హెచ్ఎండీఏ గ్రీనరీపై గతంలో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్.హెచ్.ఏ.ఐ) అధ్యయనం చేసింది. నాందేడ్ నేషనల్ హైవే (ఎన్‌హెచ్-161) వెంట హెచ్ఎండిఏ మల్టీ లేయర్ ప్లాంటేషన్‌తో పచ్చదనాన్ని పరిమళింప చేస్తున్నది. కంది క్రాస్ రోడ్స్ (చౌరస్తా) నుంచి రామ్‌సాన్‌పల్లె వరకు 32.77 కిలోమీటర్ల పొడవునా దాదాపు రూ.3.57 కోట్ల వ్యయంతో సెంట్రల్ మిడెన్, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు చేసింది.

గ్రీన్ కారిడార్‌గా హైదరాబాద్ - వరంగల్ హైవే

రాష్ట్ర ప్రభుత్వం యాదాద్రి ఆలయాన్ని అభివృద్ధి చేసిన నేపథ్యంలో వరంగల్ నేషనల్ హైవే(163) వెంట గ్రీనరీ పెంపుదలకు సహకరించాలని రెండేండ్ల కిందట కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. సానుకూల స్పందన రాకపోవడంతో సీఎం కేసీఆర్ వరంగల్ హైవే వెంట గ్రీనరీ పెంపుదల బాధ్యతలు చేపట్టాలని మంత్రి కేటీఆర్‌కు సూచించారు. తొలి దశలో వరంగల్ హైవే గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనులను రూ.5.5 కోట్ల అంచనాలతో దాదాపు 30 కిలోమీటర్ల పొడవున.. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు నేషనల్ హైవే సెంట్రల్ మిడెన్ గ్రీనరీ పనులు అర్వింద్ కుమార్ పర్యవేక్షణలో పూర్తయ్యాయి. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో "మల్టీలేయర్ ప్లాంటేషన్" వరంగల్ వరకు పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రీనరీ బ్యూటిఫికేషన్ పనులు పూర్తి కావడంతో వరంగల్ రహదారి వెంట ఆకు పచ్చని అందాలు కనువిందు చేస్తున్నాయి.

యాదాద్రి రూట్‌లో హెచ్ఎండీఏ పెంచిన మల్టీ లేయర్ ప్లాంటేషన్ నేషనల్ హైవే అథారిటీకి ఆదర్శంగా నిలిచింది. ఉత్తర్‌ప్రదేశ్(ఈస్ట్) వారణాసి నేషనల్ హైవే వెంట హెచ్ఎండీఏ తీర్చిదిద్దిన "యాదాద్రి రూట్ మల్టీ లేయర్ ప్లాంటేషన్" మోడల్ ను గతంలో నేషనల్ హైవే జాయింట్ అడ్వయిజర్(ప్లాంటేషన్) ఎ.కె.మౌర్య అధ్యయనం చేశారు. ఇటీవల కేరళ రాష్ట్రానికి చెందిన ఐఎఫ్ఎస్ అధికారుల బృందం యాదాద్రి నేషనల్ హైవేను పరిశీలించింది. అంతేకాకుండా బెర్లిన్ యూనివర్సిటీకి చెందిన పీహెచ్‌డీ విద్యార్థి హెచ్ఎండీఏ మల్టీ లేయర్ ప్లాంటేషన్ పై అధ్యయనం చేశారు.

ఆరోగ్య మహిళకు విశేష స్పందన
11 వేల మందికి స్క్రీనింగ్

- మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి హరీశ్‌రావు పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న "ఆరోగ్య మహిళ" కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తున్నది. రెండు మంగళవారాల్లో కలిపి 11,121 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. మొదటి మంగళవారం (ఈనెల 14న) 4,793 మంది మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, ఇందులో 975 మందికి అవసరమైన మందులను అందజేశారు. ఉన్నత స్థాయి వైద్యం అవసరం ఉన్నవారిని గుర్తించి సమీపంలోని రిఫెరల్ సెంటర్ అయిన పెద్దాసుపత్రికి తీసుకెళ్లి వైద్య సేవలు అందేలా చూస్తున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఒక రోజు కేటాయించి వైద్య సేవలు అందిస్తుండటం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండో మంగళ వారం (ఈనెల 21న) 6,328 మంది మహిళలు ఆరోగ్య మహిళ క్లినిక్స్‌ను సందర్శించారు. వీరిలో 3,753 మందికి రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 884 మందికి గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 3783 మందికి నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, 718 మందికి మూత్రకోశ ఇన్ఫెక్షన్ల నిర్ధారణ పరీక్షలు, 1,029 మందికి సూక్ష్మ పోషక లోప నిర్ధారణ పరీక్షలు, 777 మందికి థైరాయిడ్ పరీక్షలు, 477 మందికి విటమిన్-డి లోప పరీక్షలు, 1294 మందికి సీబీపీ పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం 24 జిల్లాల్లో 100 కేంద్రాల్లో వైద్య సేవలు మొదలయ్యాయి. దశల వారీగా 1200 కేంద్రాలకు విస్తరించనున్నారు. ఈ కేంద్రాల్లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళలకే 8 రకాల వైద్య సేవలు అందిస్తున్నారు.మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, ఇతర సాధారణ పరీక్షలు, 2, ఓరల్, సర్వైకల్, రొమ్ము క్యాన్సర్ల స్క్రీనింగ్, థైరాయిడ్ పరీక్ష, సూక్ష్మ పోషకాల లోపాలను గుర్తించడం. అయోడిన్ సమస్య, ఫోలిక్ యాసిడ్, ఐరన్ లోపంతో పాటు, విటమిన్ బీ12, విటమిన్ డి పరీక్షలు చేసి చికిత్స, మందులు అందజేస్తారు. మూత్రకోశ సంబంధిత ఇన్ఫెక్షన్లు, పెల్విక్ ఇన్ఫ్లమేటరీ వ్యాధుల పరీక్షలు చేస్తారు. మెనోపాజ్ దశకు సంబంధించి పరీక్షల అనంతరం అవసరమైన వారికి హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ చేయడంతోపాటు కౌన్సిలింగ్‌తో అవగాహన కలిగిస్తారు. నెలసరి సమస్యలపై పరీక్షలు చేసి వైద్యం అందిస్తారు. సంతాన సమస్యలపై ప్రత్యేకంగా పరీక్షలు చేసి అవగాహన కలిగించడం, అవసరమైనవారికి అల్ట్రాసౌండ్ పరీక్షలు చేస్తారు. సెక్స్ సంబంధిత అంటువ్యాధుల పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తారు. అవసరమైన వారికి వైద్యం అందిస్తారు. బరువు నియంత్రణ, యోగా, వ్యాయామం వంటివాటిపై అవగాహన కల్పిస్తారు. ఆరోగ్య మహిళా కార్యక్రమన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి హరీశ్‌రావు కోరారు.

25న ఇందిరా పార్కు వద్ద
నిరుద్యోగుల మహాధర్నా

- టీఎస్‌పీఎస్‌సీ పేపర్ల లీక్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి
- ఉగాది వేడుకల్లో బండి సంజయ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఈ నెల 25న ఇందిరాపార్కు వద్ద తమ పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగ మహాధర్నా నిర్వహిస్తామనీ, త్వరలో మిలియన్ మార్చ్ తరహాలో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. మంగళంపల్లి శ్రీనివాసశర్మ పంచాంగ పఠనం వినిపించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ సంస్థాగత జాతీయ సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్, ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, జాతీయ కార్యవర్గసభ్యులు జి.వివేక్ వెంకటస్వామి, మహిళా మోర్చా అధ్యక్షులు గీతామూర్తి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. సిట్ విచారణను వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ల లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించేదాకా పోరాడుతామన్నారు. పరీక్షల రద్దు నేపథ్యంలో నిరుద్యోగులకు లక్ష రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 30 లక్షల మంది నిరుద్యోగల జీవితాలపై ప్రభావం చూపే పేపర్ లీకేజీ సర్వసాధారణమా? అని ప్రశ్నించారు. పేపర్ లీకేజీలకు కారకుడైన మంత్రి కేటీఆర్ రాజీనామా చేసేదాకా వదిలిపెట్టబోమన్నారు. ఆయనకు సిట్ ఎందుకు నోటీసులివ్వలేదో చెప్పాలని నిలదీశారు. ప్రశ్నించే మీడియా సంస్థలను, పార్టీల అమతు చూస్తామని వార్నింగ్ ఇవ్వడంలో భాగంగానే తీన్మార్ మల్లన్న, విఠల్ అరెస్టులు జరిగాయన్నారు. ఈ అంశంపై న్యాయస్థానంలో పోరాడుతామన్నారు. తెలంగాణ ఉద్యమకారులంతా రోడ్లెక్కి కేసీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని కోరారు. అనంతరం బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపుతున్న సోషల్ మీడియా సంస్థలను, యూ ట్యూబ్ ఛానళ్లను బెదిరించడం, జర్నలిస్టులను అరెస్టు చేయడం వంటి అంశాలను ఖండించారు. జర్నలిస్టుల పక్షాన న్యాయపోరాటం చేస్తామన్నారు.

అగ్రవర్ణాల రాజ్యమే బీజేపీ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని ఆచరణలోకి తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. బీజేపీ కాపలా కుక్క ఈడీని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాలపై దాడులు చేస్తోందని చెప్పారు. సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రలో భాగంగా బుధవారం వైరా, మధిర, బోనకల్ మండలం రావినూతలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో తమ్మినేని మాట్లాడారు. ఉగాది పండుగ అయినా భారీగా తరలివచ్చిన ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీకి రామునిపైన కాదు భక్తి.. దేశంలో కులవ్యవస్థను రక్షించాలనే ఆసక్తి అన్నారు. ఒకే దేశం.. హిందూ దేశం అంటున్న బీజేపీ ఒకే కులాన్ని ఎందుకు కోరుకోవడం లేదని ప్రశ్నించారు. దేశంలో 60 వేల కులాలున్నాయని, వీరిలో 52శాతంగా ఉన్న బీసీల రిజర్వేషన్ గురించి బీజేపీ ఎందుకు మాట్లాడదన్నారు. వర్గాలు, వైషమ్యాలు, పగలు, కక్షలను పెంచిన బీజేపీ ఏనాడైనా అన్ని కులాలు ఒక్కటని మాట్లాడిందా? అని ప్రశ్నించారు. కమ్యూనిస్టులు, అంబేద్కర్ వల్ల కులవ్యవస్థ బలహీన పడుతుందని బీజేపీ భావిస్తోందన్నారు. అందుకే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్తలు గోల్వాల్కర్, సావర్కర్ పరమ చెత్త, అతుకుల బొంత అని అభివర్ణించారని గుర్తు చేశారు. పార్టీలు మారే అలవాటున్న వాళ్లు ఫాసిస్టు బీజేపీ వైపు పోవద్దని హితవు పలికారు. దుర్మార్గపు ప్రణాళిక ఉన్న బీజేపీ పట్ల అప్రమత్తంగా వ్యవహరించాల న్నారు.

మోడీని గద్దె దించేందుకు బీజేపీ వ్యతిరేక పార్టీలను సమీకరిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ ప్రయివేటీకరణకు పూనుకుందన్నారు. ప్రయివేటీకరణ వెనుక పేదల రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర దాగుందన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ ధైర్యంగా నిలబడుతున్నారు కాబట్టే కలిసి నడుస్తున్నామని తెలిపారు. సమయం వచ్చినప్పుడు ఎన్నికలపై చర్చ ఉంటుందని, చావైనా బతుకైనా సీపీఐ, సీపీఐ(ఎం) మాత్రం కలిసే ఉండాలని నిర్ణయించుకున్నాయన్నారు. బీఆర్‌ఎస్‌తో కలిసి నడుస్తున్నాం కదా..! ఇక ప్రజా సమస్యల మాటేమిటి అనుకోవచ్చు.. ప్రజలకు కంటనీరు తెప్పించే పనులు చేస్తే కేసీఆర్‌నైనా నిలదీస్తామన్నారు. ప్రజలకు ఇండ్ల స్థలాల పట్టాలతో పాటు ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం పది లక్షల రూపాయల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు.



మోడీ హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదు

ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా అని తమ్మినేని ప్రశ్నించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేశారా? 2022నాటికి దేశంలో ఉన్నవాళ్లందరికీ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు.. ఏమయ్యాయని నిలదీశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల సంగతి ఏంటని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉంటే బెదిరింపులు, దాడులు చేస్తున్నారన్నారు. కాగితాల పైన ఉండే మోసపూరిత కంపెనీలతో అదానీ రూ.17 లక్షల కోట్లు దోచినా చర్యలు ఉండవా? అన్నారు. రాష్ట్రాల హక్కుల్ని బీజేపీ హరిస్తోందని ఆరోపించారు. ఆర్థిక సార్వభౌమత్వాన్ని నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రవర్ణాలను తప్ప 85శాతం హిందువుల మేలుకోరే పార్టీ బీజేపీ కాదన్నారు. బీజేపీ విషనాగు వంటిందని.. దాని ప్రమాదాన్ని నిలువరించడానికే బీజేపీ వ్యతిరేక పార్టీలతో ముందుకెళ్తున్నామని తెలిపారు.

బీజేపీ నిజస్వరూపాన్ని అర్థం చేసుకోవాలి : పోతినేని

బీజేపీ నిజస్వరూపాన్ని అర్థం చేసుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు సూచించారు. సీసీఐ, మార్క్ ఫెడ్, నాఫెడ్ వంటి సంస్థలను ఎత్తేసి రైతులను అగాధంలోకి నెట్టేయాలని చూస్తోందన్నారు. రైతులు అప్రమత్తం కాకపోతే మనభూమి మనకే దక్కదని హెచ్చరించారు.

మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఏమైంది?: మల్లు లక్ష్మి

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఏమైందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి ప్రశ్నించారు. ప్రతి ఇంటికీ హెల్త్ ఇన్సూరెన్స్ సంగతేంటన్నారు. బీజేపీ ఆడవాళ్ళ స్వేచ్ఛను హరించి వేయాలని చూస్తుందన్నారు.

బీజేపీ విధానాలు నష్టదాయకం: సాయిబాబు

యావత్ భారతదేశానికి బీజేపీ విధానాలు నష్టదాయకమని సీఐటీయూ జాతీయ నాయకులు ఎం.సాయిబాబు అన్నారు. ఆ విధానాలు లౌకిక తత్వం, ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తాయని తెలిపారు. సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తాయన్నారు. అందుకే ప్రమాదకర బీజేపీ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సభల్లో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

యాత్రకు సంఘీభావం

జన చైతన్య యాత్రకు బీఆర్‌ఎస్, సీపీఐ నాయకత్వం సంఘీభావం తెలిపింది. వైరాలో బీఆర్‌ఎస్ తరఫున స్థానిక ఎమ్మెల్యే రాములు నాయక్, మధిరలో జడ్పీ చైర్మెన్ లింగాల కమల రాజ్, సీపీఐ నాయకులు సంఘీభావం ప్రకటించారు.

కూల్ డ్రింక్స్ రూపంలో పెను ముప్పు

సహజ పానీయాలే తాగండి..

- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు
- జేవీవీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

నేటి తరానికి కూల్ డ్రింక్స్ రూపంలో పెను ముప్పు వచ్చి పడిందని, సహజ పానియాలే తాగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు అన్నారు. యువతీయువకులంతా వాటిని మానుకుని ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన సహజ పానీయాలను తాగాలని సూచించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కృష్ణకాంత్ పార్కు మెయిన్ గేట్ వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. బహుళజాతి సంస్థలు కూల్ డ్రింక్స్ తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. కూల్ డ్రింక్‌లో కలిపే సోడియం బెంజోయేట్ అనే ప్రిజర్వేటివ్ రసాయనం కణాల్లోని డీఎన్‌ఏపై ప్రభావం చూపడం వల్ల కణ వ్యవస్థకు నష్టం కలుగుతుందన్నారు. కూల్ డ్రింక్స్‌లో ఉండే యాసిడ్ ఎదలో మంటను కలిగిస్తుందన్నారు. అంతేకాదు అధిక రక్తపోటు వస్తుందని చెప్పారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజా మాట్లాడుతూ.. నిత్యం కూల్ డ్రింక్స్ తాగే వాళ్ళు అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ. కూల్ డ్రింక్స్‌కు వ్యతిరేకంగా జేవీవీ అనేక పోరాటాలు చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులు జి.నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మూఢనమ్మకాలను నియంత్రించేందుకు ప్రభుత్వం ఒక చట్టం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు సింహాచలం, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, జేవీవీ నగర నాయకులు చెన్నుపాటి చంద్రశేఖరరావు, జూబ్లీహిల్స్ జోన్ ప్రధాన కార్యదర్శి ఎం.రవీంద్రబాబు, అధ్యక్షులు పి.సుబ్బారావు, జితిన్ ప్రసాద్, పాపారావు, జి.సూర్యప్రకాష్‌రెడ్డి, వి.శ్రీనివాస్, ఎల్.సతీష్, ఆర్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'కూల్ డ్రింక్స్ వద్దు, సహజ పానీయాలు ముద్దు' నినాదంతో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుషాయిగూడలో నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ నాగేంద్రప్రసాద్, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో జేవీవీ మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీని జేవీవీ రాష్ట్ర కోశాధికారి ప్రారంభించారు.

సీతారాముల కళ్యాణ మహోత్సవానికి సీఎంకు ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శ్రీరామనవమి సందర్భంగా ఈనెల 30న భద్రాచలంలో జరిగే సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాలని సీఎం కేసీఆర్‌ను కోరుతూ దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం ప్రగతి భవన్‌లో కలిసి ఆహ్వానించారు. సీఎం దంపతులను ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆలయ ఈవో, పూజారులు ఆహ్వానించారు.

అక్కడిలాగే ఇక్కడా చేయలేమో...

- సోషల్ మీడియా అరెస్టులపై మంత్రి కేటీఆర్ ట్వీట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరుష పదాలతో ట్వీట్లు చేసిన వారిని అరెస్టులు చేస్తున్నారనీ, తెలంగాణ రాష్ట్రంలో కూడా అలాగే చేయాలేమో... అంటూ మంత్రి కే తారకరామారావు ట్వీట్ చేశారు. తెలంగాణలో ఏకంగా ముఖ్యమంత్రి, మంత్రులను దుర్భాషలాడుతూ అవమానకరంగా మాట్లాడు తున్నా సహిస్తున్నామన్నారు. పరుష పదాలతో ట్వీట్ చేసినందుకు బీజేపీ పాలిత రాష్ట్రం కర్ణాటకలో కన్నడ నటుడు చేతన్‌ను అరెస్ట్ చేసిన విషయాన్ని ట్విట్టర్ వేదికగా ఆయన ప్రస్తావించారు. అక్కడిలాగే ఇక్కడా స్పందించాలే మో...ఏమంటారు? అంటూ ప్రజల్ని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. భావ ప్రకటనా స్వేచ్ఛ... దూషించే స్వేచ్ఛ కాకూడదని ట్వీట్‌లో పేర్కొన్నారు.

మోడీ అంటే ఒక అమ్మకం

- పీయూసీ చైర్మెన్, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మోడీ అంటేనే ఒక అమ్మకమని పీయూసీ చైర్మెన్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి తెలిపారు. మహారాష్ట్ర లోని నాందేడ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రాకకోసం మరాఠీ సోదరులు ఎదురు చూస్తున్నారన్నారు. కాందార్‌లో సభ ద్వారా తెలంగాణ మోడల్ ఆవిష్కృతమవుతుందని ఆయన పేర్కొన్నారు. "అనితర సాధ్యమైన అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తెలంగాణ మోడల్ అని,మోడీది అన్నం పెట్టిన వారికే సున్నం పెట్టే మోడల్ అని విమర్శించారు. మోడీది ఈడీయిజమనీ, బీజేపీ ఒక సెల్లర్ పార్టీ అనీ, కిసాన్ కిల్లర్ పార్టీ అని విమర్శించారు. బీఆర్ ఎస్ ది రాజనీతి. బీజేపీది దమన నీతన్నారు. మోడీ దిమ్మతిరిగేలా కాందార్ లోహ సభ విజయవంతం చేయాలని కోరారు.

సీడీపీఓ, ఈఓ పరీక్ష రద్దు చేయాలి

- లేకపోతే ఆమరణ నిరాహారదీక్ష : అభ్యర్థులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన సీడీపీఓ, ఇవో పరీక్షలను రద్దు చేయాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేశారు. లేకపోతే ఆమరణ నిరాహారదీక్ష చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాంకు అభ్యర్థులు స్వప్న, రాజమణి, నవ్య, ఎస్తేర్ తదితరులు వినతిపత్రం సమర్పించారు. తాము చేసే పోరాటానికి సహకరించాలని కోరారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ కేసులో నిందితునిగా ఉన్న రాజశేఖర్ రెడ్డి తల్లి ఐసీడీఎస్ లో వర్కర్‌గా పని చేస్తుండటం, అతని గ్రామ శివారు ముత్యంపేట గ్రామ పంచాయతీకి చెందిన ఐసీడీఎస్ వర్కర్ ఆర్.శోభారాణి ఇవో మెరిట్ లిస్ట్‌లో తొమ్మిదో స్థానంలో ఉండటం, అంగన్ వాడీ వర్కర్స్ లేదా వారితో సంబంధమున్న వారే మెరిట్ లిస్ట్‌లో ఉండి ఉద్యోగాలకు ఎంపిక కావటం ఆ పరీక్షల ప్రశ్నాపత్రాలు కూడా లీక్ అయ్యాయనే అనుమానాన్ని పెంచుతున్నాయని వారు పేర్కొన్నారు.

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి : సర్దార్ వినోద్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టీఎస్‌పీఎస్సీ లీకేజీ అంశం చాలా చిన్నదంటూ వ్యాఖ్యానించినరాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి క్షమాపణ చెప్పాలని తెలంగాణ జన సమితి (టీజేఎస్) విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తన సొంత నియోజకవర్గం నిర్మల్ జిల్లా కేంద్రంలో గల మున్సిపాలిటీలో 42 ప్రభుత్వ ఉద్యోగాలను సైతం అర్హులకు ఇవ్వకుండా అమ్ముకున్న చరిత్ర మంత్రిదని ఆరోపించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ మెప్పు కోసం తెలంగాణ విద్యార్థి, నిరుద్యోగులకు అవమానిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలనీ, నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ప్రజల సందర్శన కోసం రాష్ట్రపతి నిలయం...

- హోంమంత్రి మహమూద్ అలీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచనల మేరకు రాష్ట్రపతి నిలయాన్ని ప్రజల సందర్శన కోసం వీలు కల్పిస్తూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర హోం మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ పాల్గొన్నారు. హైదరాబాదులోని రాష్ట్రపతి నిలయంలో బుధవారం నాడు జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొనగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో హోం మంత్రి మాట్లాడారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.... భారత రాష్ట్రపతి హైదరాబాద్‌లోని రాష్ట్రపతి నిలయాన్ని ఏడాది పొడవునా సాధారణ ప్రజలు సందర్శించేందుకు వీలు కల్పించే ఈ గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. ఉగాది శుభదినమనీ, తెలుగు ప్రజలకు నూతన సంవత్సరం ప్రారంభం రోజున భారత రాష్ట్రపతి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఎస్సారెస్పీ కెనాల్‌లో ఇద్దరు పిల్లల గల్లంతు

- ఘటన స్థలాన్ని పరిశీలించిన ఏసీపీ కిరణ్‌కుమార్
- అప్రమత్తమైన డిజాస్టర్ రెస్పాండ్ ఫోర్స్ టీం

నవతెలంగాణ-హసన్‌పర్తి



(ఫైల్)

పండుగపూట నిరుపేద ఇంట్లో విషాదం నెలకొంది. ఈత కోసం వెళ్లిన ఇద్దరు పిల్లలు ఎస్సారెస్పీ కెనాల్‌లో గల్లంతయ్యారు. ఈ ఘటన కొత్తపల్లి గ్రామస్తులను శోకసంద్రంలో ముంచింది. హన్మకొండ ఏసీపీ కిరణ్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేయూ ఎస్ఐ సతీష్, రాజుకుమార్‌తో పాటు డిజాస్టర్ రెస్పాండ్ ఫోర్స్ టీంను అప్రమత్తం చేసి గల్లంతైన పిల్లల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధి పలివేల్పుల శివారు గ్రామం కొత్తపల్లిలోని మట్టెడ నరేష్‌ది నిరుపేద కుటుంబం. నరేష్ ఇద్దరు కుమారులు మట్టెడ హర్షిత్(16), మట్టెడ అన్విక్(9) ఎస్సారెస్పీ పెద్ద కెనాల్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈతకు వెళ్లారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పిల్లలు కొట్టుకుపోయారు. అక్కడే బట్టలు ఉతుకుతున్న చేతాళ్ల కేతమ్మ చూసి కేకలు వేసి ఒడ్డున ఉన్న అశోక్‌ని అప్రమత్తం చేసింది. పిల్లలను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ విషయాన్ని స్థానికులు కేయూ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కేయూ ఇన్‌స్పెక్టర్ దయాకర్ ఎస్ఐలు రాజుకుమార్, సతీష్‌తో పాటు డిజాస్టర్ రెస్పాండ్ ఫోర్స్ టీంను అప్రమత్తం చేసి ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం హన్మకొండ కిరణ్ కుమార్‌యాదవ్ ఘటన స్థలాన్ని పరిశీలించి అగ్నిమాపక సిబ్బందిని, జీడబ్ల్యుఎంసీ డిసస్టర్ రెస్పాండ్ ఫోర్స్ టీమ్‌తో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు బృందాలుగా ఏర్పడి నీటిలో దిగి గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ పిల్లల ఆచూకీ లభించలేదు. ప్రభుత్వ అన్ని శాఖల విభాగాల సమన్వయంతో గాలింపు చర్యలు చేపడుతున్నామని, సాధ్యమైనంత తొందరలో పిల్లల ఆచూకీ కనిపెడతామని ఏసీపీ కిరణ్‌కుమార్ తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

నత్తకు నడకనేర్పుతున్న భారత్‌మాల

అస్తవ్యస్థంగా ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు

- నాలుగున్నరేండ్లుగా 40 శాతమే
- తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు
- దెబ్బతింటున్న వ్యాపారాలు
- చురుగ్గా సాగని ఎలివేటేడ్ కారిడార్ ప్రాజెక్టు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రజాభివృద్ధి ప్రాజెక్టుల పట్ల కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి కరువైంది. ఉప్పల్ ఎలివేటేడ్ కారిడార్ ఫ్లైఓవర్ ప్రాజెక్టు నిర్మాణం నత్తకే నడక నేర్పుతున్నది. వర్కింగ్ ఏజెన్సీతోపాటు అధికారులు ఆశించినస్థాయిలో చురుగ్గా వ్యవహరించకపోవడంతో నాలుగున్నరేండ్లుగా పనులు స్తంభించాయి. దీంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కేంద్రం ప్రారంభించిన ఒకే ఒక్క ప్రాజెక్టు ఏండ్లతరబడి ఆపసోపాలు పడుతుండగా, ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం 30 ఫ్లైఓవర్లు, ఆర్‌యూబీలు, ఆర్వోబీలను పూర్తిచేసి అందుబాటులోకి తేవడం చర్చనీయాంశమవుతున్నది.


జనం అవస్థలు

ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అన్న చందంగా మారింది ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రాజెక్టుతో ప్రజలకు నిత్యం అవస్థలు తప్పడం లేదు. నిర్మాణం చేపట్టి నాలుగున్నరేండ్లవుతున్నా, 40 శాతం పనులు కూడా పూర్తి కాకపోవడం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) అధికారులు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన రెండేండ్లలోనే 6.2 కిలోమీటర్ల మేర భూసేకరణ చేసి జాతీయ రహదారుల అభివృద్ధి అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ)కి అప్పగించారు. కానీ పనుల పురోగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. రోడ్డు మధ్యన నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ఉప్పల్, మేడిపల్లి మధ్య ప్రయాణానికి కనీసం గంట సమయం పడుతున్నది. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు ప్రయాణం నరకప్రాయమవుతున్నది. ఉప్పల్ రింగ్‌రోడ్డు, బోడుప్పల్, మేడిపల్లి, చెంగిచర్ల చౌరస్తాల వద్ద తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇక వర్షం వచ్చినప్పుడు, పండుగల సమయంలోనైతే ప్రయాణికుల బాధలు వర్ణనాతీతం. ట్రాఫిక్ సమస్య మరింత పెరిగి వాహనదారుల్లో అసహనం పెంచుతున్నది. సహనానికి పరీక్షగా మారుతున్నది.

ప్రాజెక్టు ఉద్దేశం..

ఉప్పల్ - మేడిపల్లి మధ్య ట్రాఫిక్ సమస్యకు చరమగీతం పాడేందుకు ఈ ఆరు లేన్ల స్కైవే నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 163 జాతీయ రహదారిపై 6.2 కిలోమీటర్ల మేర 148 పిల్లర్లతో పనులకు శ్రీకారం చుట్టారు. 2018 జూలైలో పనులు ప్రారంభం కాగా, 2020 జూన్ వరకు నిర్మాణం పూర్తిచేయాలనేది లక్ష్యం. ఈ నిర్మాణ పనులతో ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. కారిడార్ పనులు పూర్తయితేనే దెబ్బతిన్న రోడ్డు పనులు పూర్తిచేయగలమని అధికారులు అంటున్నారు.

BHARATMALA
ROAD TO PROSPERITY



ఫ్లైఓవర్ల నిర్మాణం వేగం

రాష్ట్రంలో ఎస్సార్డీపీ పథకం మొదటి దశలో రూ.8092 కోట్లతో 47 చోట్ల ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, కేబుల్ బ్రిడ్జిలు, స్టీల్ బ్రిడ్జిలు, ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాన్ని తెలంగాణ సర్కారు చేపట్టింది. ఇప్పటివరకు రూ.3748.85 కోట్లతో 31 చోట్ల ప్రాజెక్టులు అందుబాటులోకి వచ్చాయి. 15 ఫ్లైఓవర్లు, ఐదు అండర్‌పాస్‌లు, ఏడు ఆర్వోబీ/ఆర్‌యూబీలు, ఒక కేబుల్ బ్రిడ్జి, విస్తరణ బ్రిడ్జి ఒకటి, ఓఆర్ఆర్ నుంచి మెదక్ జంక్షన్ వరకు ప్రాజెక్టులు రావడంతో ట్రాఫిక్ సమస్యకు చెక్ పడింది. ఇక రూ. 4304.07కోట్లతో 16 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. కాగా అందుబాటులోకి వచ్చిన చోట ట్రాఫిక్ సమస్య తొలగిపోయింది. ఈ ఏడాది మార్చి 10న ఉప్పల్-రామంతాపూర్ రోడ్డులో రూ.411 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికే 40 శాతం మేర పిల్లర్స్ పనులు పూర్తయ్యాయి.

భారత్‌మాల...

ఉప్పల్ ఎలివేటేడ్ కారిడార్ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వం భారత్‌మాల పథకం కింద చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణం. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ.626.80 కోట్ల వ్యయంతో ఉప్పల్-నారపల్లి మధ్య నిర్మిస్తున్న ఈ ఆకాశ మార్గానికి కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 2018, మే నెలలో శంకుస్థాపన చేశారు. ఇప్పటికే నాలుగున్నరేండ్లు గడిచినా ఈ నిర్మాణం నత్తనడక సాగుతున్నది. 40 శాతం పనులే పూర్తయ్యాయనీ, ఇప్పటికిప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దష్టి సారిస్తే ఈ ఫ్లై ఓవర్ మరో రెండేండ్లలో అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇక తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మక రహదారుల అభివద్ధి ప్రాజెక్టు (ఎస్సార్డీపీ)లో భాగంగా షేక్‌పేట వద్ద అతిపెద్ద ఫ్లైఓవర్ నిర్మించింది. రూ.333.55 కోట్ల వ్యయంతో 2.80 కిలోమీటర్ల పొడవున నిర్మించిన ఈ ఫ్లై ఓవర్‌కు 2018 ఏప్రిల్‌లో శంకుస్థాపన జరుగగా, ఈ ఏడాది జనవరి ఒకటిన ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. దాదాపు నాలుగు లక్షల మంది ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం లభించింది. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం మరో 30 ఫ్లైఓవర్లు, ఆర్‌యూబీలు, ఆర్వోబీలను పూర్తిచేసి అందుబాటులోకి తెచ్చింది.

దెబ్బతిన్న వ్యాపారాలు

ఎలివేటెడ్ కారిడార్ పనులు, రోడ్డు పనులు తీవ్ర ఆలస్యమవుతుండంతో ఉప్పల్ ప్రధాన రహదారిలోని వ్యాపారాలు దెబ్బతిన్నాయి. వ్యాపార సముదాయాల వద్ద వాహనాలు పార్కింగ్ చేసే అవకాశమే లేదు. లాభం కంటే నష్టాలు ఎక్కువగా వస్తున్నాయి. పనులు పూర్తిచేసి, రోడ్ల నిర్మాణం జరిగితే కనీసం వ్యాపారం కొనసాగించడానికి వీలుంటుందని స్థానిక వ్యాపారులు అభిప్రాయడుతున్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించడం కష్టమే

ఉప్పల్-మేడిపల్లి రోడ్డులో ట్రాఫిక్‌ను నియంత్రించడం కష్టంగా మారింది. శుభకార్యాలు, ఉదయం, సాయంత్రం రద్దీ సమయంలో ట్రాఫిక్‌ను కంట్రోల్ చేయడానికి సిబ్బంది చాలా శ్రమించాల్సి వస్తున్నది. రోడ్డు పనుల నేపథ్యంలో ట్రాఫిక్ చాలా నెమ్మదిగా సాగుతున్నది. దీనితో ఇది ప్రజలకు తీవ్ర అసహనాన్ని కలిగిస్తున్నదని స్థానిక ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు.

సంపాదకీయం

ఒక ట్వీట్... అరెస్ట్...

"నీ అభిప్రాయాలతో ఏకీభవించక పోవచ్చు... కానీ నీ అభిప్రాయం చెప్పే హక్కు కోసం నా ప్రాణమిస్తా" అంటాడు ఫ్రెంచ్ తత్వవేత్త వోల్టేర్. ఇది కదా నిజమైన ప్రజాస్వామిక లక్షణం. ప్రజాస్వామ్యమంటేనే భిన్నాభిప్రాయాలను మన్నించడం, ప్రశ్నలను, విమర్శలను గౌరవించడం కదా... ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం మన

నిజాలు గుర్తించలేకపోవడం, గుర్తించినా మభ్యపెట్టాలని 0చూడటం అభ్యంతరకరం, అనైతికం అవుతాయిగానీ, నిజాలు మాట్లాడటం తప్పెలా అవుతుంది? అభిప్రాయాలు వెల్లడించడం, ప్రశ్నించడం, విమర్శించడమే నేరమైతే అది ప్రజాస్వామ్యమెలా అవుతుంది? ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా నిరాకరించే నిరంకుశ పోకడలే ఈ దేశం పరువు తీస్తున్నాయనే సత్యాన్ని ఈ ఏలికలకు ఎవరు చెప్పాలి?

దేశంలో ప్రజాస్వామ్యమే అమలవుతోందా? అన్న సందేహం రాకమానదు. ఇప్పుడీ సందేహానికి కారణం భారత ప్రజాస్వామ్యం పట్ల రాహుల్‌గాంధీ విదేశాల్లో చేసిన వ్యాఖ్యలు కాదు, స్వదేశంలో "చేతన్ కుమార్ అహింస" అనే ఓ కన్నడ నటుడిని అరెస్ట్ చేయడం.

దళిత, గిరిజనహక్కుల కార్యకర్త కూడా అయిన ఈ చేతన్‌కుమార్ నేరమేమిటంటే... "హిందూత్వ అనేది అబద్ధాల ఆధారంగా నిర్మించబడింది" అని ట్వీట్ చేయడమే..! ఈ అబద్ధాలను రుజువు చేయడానికి అతను కొన్ని ఉదాహరణలను పేర్కొన్నాడు. అందులో "రావణుడిని ఓడించి రాముడు అయోధ్యకు తిరిగి వచ్చినప్పటి నుండే భారతదేశం ప్రారంభమైంది" అన్న సావర్కర్ వాదన ఒకటి. హిందూత్వవాదులు "బాబ్రీ మసీదే రాముడి జన్మస్థలం"అని చెప్పడం మరొకటి. అన్నిటికీ మించి, వొక్కలిగ వర్గానికి చెందిన ఉరిగౌడ, సంజెగౌడలే టిప్పుసుల్తాన్‌ను హత్య చేశారంటూ సాగుతున్న ప్రస్తుత ప్రచారమంతా పచ్చి అబద్ధమని కూడా చేతన్ కుమార్ ట్వీట్ చేశాడు. దీనిపై ఓ భజరంగ్‌దళ్ సభ్యుడు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారంనాడు బెంగుళూరు పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఉద్దేశపూర్వకంగా రెండు వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టాడనీ, మత విశ్వాసాలను అవమానించాడనీ కేసు నమోదు చేశారు. కేవలం అభిప్రాయాలు వెల్లడించినంతనే ఇంతటి అభియోగాలు మోపబడుతున్న చోట ప్రజాస్వామ్యం మనగలగుతుందంటే ఎలా నమ్మడం?



నిజానికి, 1799లో బ్రిటిష్‌వారితో పోరాడుతూ మరణించిన యోధుడు టిప్పుసుల్తాన్ అని చరిత్ర చెపుతోంది. కానీ, కర్నాటకలో ఇందుకు విరుద్ధంగా ఒక నాటకం రూపొందించబడింది. ఇది ఉరిగౌడ, సంజెగౌడ అనే ఇద్దరు వొక్కలిగ నాయకులు టిప్పు సుల్తాన్‌ను హత్య చేసినట్టుగా చిత్రీకరిస్తోంది. అయితే, కల్పిత పాత్రలూ కట్టుకథలతో కూడిన ఈ వక్రీకరణను చరిత్రకారులంతా ప్రశ్నించారు. కానీ కర్నాటక కమలనాథులు మాత్రం ఈ కల్పితాన్ని ఏకంగా ఎన్నికల ర్యాలీలలో ఉపయోగించారు. కన్నడ ప్రజలకు చారిత్రక స్ఫూర్తిగా నిలిచిన టిప్పుసుల్తాన్ ముస్లిం కావడమే ఈ వక్రీకరణకు ఒక కారణంగా కాగా, రాష్ట్రంలో బలమైన సామాజికవర్గంగా ఉన్న వొక్కలిగలను ముస్లిం వ్యతిరేకులుగా మార్చడం మరొక కారణమన్నది కొన్ని విశ్లేషణలూ, నివేదికల సారాంశంగా ఉన్నది. రాష్ట్రంలో బీజేపీయేతర రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, జనతాదళ్ (సెక్యులర్)లు కూడా ఇదంతా కేవలం ఓ కట్టుకథ అని కొట్టిపారేశాయి. వొక్కలిగ సంఘం నేతలు సైతం "రాష్ట్ర ప్రభుత్వం ఈ అబద్ధాల ప్రచారం మానుకోకుంటే ఆందోళనలు చేపడతాం" అని హెచ్చరించడం గమనార్హం. కర్నాటకలో నెలకొన్న ఈ పరిణామాల నేపథ్యంలోంచి చూస్తేగానీ చేతన్‌కుమార్ అరెస్ట్‌కు అసలు కారణాలు బోధపడవు.

రాహుల్ గాంధీ మన ప్రజాస్వామ్యం గురించి విదేశాల్లో మాట్లాడి దేశం పరువుతీశాడని అరచి గగ్గోలు పెడుతున్నవారంతా, ఇప్పుడీ చేతన్‌కుమార్ అరెస్ట్ దేనికి సూచికో సమాధానం చెప్పాలి. నేడు దేశంలో ప్రజాస్వామ్యం ఏ స్థితిలో ఉందో తెలుసుకోవడానికి ఇది మచ్చుకో ఉదాహరణ. కేవలం ఒక అభివ్యక్తికి కూడా అవకాశం లేని ఈ ప్రజాస్వామ్యానికి అర్థమేమిటి? దేశం పట్ల నిజమైన ప్రేమ ఉన్నవారంతా ఆలోచించాల్సిన అంశమిది. దేశంలో ప్రజాస్వామ్యమిలా ఉంటే, విదేశాల్లో పరువు తీసేందుకు ఏ రాహుల్‌గాంధీ అవసరం లేదు. పరస్పరం అనుసంధానించబడి, ప్రపంచమే ఓ కుగ్రామంగా మారిన ప్రపంచీకరణ యుగంలో ఉన్నాం మనం. పలు అంతర్జాతీయ నివేదికలే వెల్లడిస్తున్న ప్రపంచ ప్రజాస్వామిక సూచికలలో భారత్ స్థానమేమిటో తెలియనిదెవరికి? ఆకలీ అసమానతల సూచీల్లో సైతం మన అట్టడుగు స్థానమేమైనా జగమెరుగని సత్యమా?

అయినా నిజాలు గుర్తించలేకపోవడం, గుర్తించినా మభ్యపెట్టాలని చూడటం అభ్యంతరకరం, అనైతికం అవుతాయిగానీ, నిజాలు మాట్లాడటం తప్పెలా అవుతుంది? అభిప్రాయాలు వెల్లడించడం, ప్రశ్నించడం, విమర్శించడమే నేరమైతే అది ప్రజాస్వామ్యమెలా అవుతుంది? ఈ ప్రాథమిక సూత్రాన్ని కూడా నిరాకరించే నిరంకుశ పోకడలే ఈ దేశం పరువు తీస్తున్నాయనే సత్యాన్ని ఈ ఏలికలకు ఎవరు చెప్పాలి?

భారత విప్లవోద్యమ దిక్సూచి షహీద్ భగత్‌సింగ్

మతతత్వ ఉన్మాదం తలకెక్కి ఎందరో అమరుల త్యాగఫలమైన స్వాతంత్ర్య సమరస్ఫూర్తికి తూట్లుపొడుస్తూ, మన రిపబ్లిక్ రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న శక్తులు విలయ తాండవం చేస్తుండగా నేడు షహీద్ భగత్‌సింగ్ అమరత్వాన్ని గుర్తుచేసుకుని మనం మరింతగా ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుం కట్టవలసిన సమయం ఇది.

1931వ సంవత్సరం మార్చి 23వ తేదీనాడు సాయంత్రం బ్రిటిష్ వలసపాలనను సాయుధంగా కూలదోయాలనే లక్ష్యంతో పనిచేస్తున్న హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ అనే విప్లవ సంస్థకు చెందిన ముగ్గురు యువ సోషలిస్టు విప్లవకారులను లాహోర్ జైలులో బ్రిటిష్ ప్రభుత్వం ఉరికంభం ఎక్కించింది. తాము ఉరికంభం ఎక్కేనాటికి ఈ ముగ్గురు విప్లవకారుల వయసు 24సంవత్సరాలు. వీరు చనిపోకముందు తాము యుద్ధ ఖైదీలమని, తమని యుద్ధఖైదీలుగా భావించి కాల్చిచంపమని కోరారు. అయినప్పటికీ వలస పాలకులు వారి అభ్యర్థనను తిరస్కరించి వారిని ఉరితీసి, రాత్రికి రాత్రే రహస్యంగా వారి భౌతికకాయాలను ఖననం చేశారు.

భగత్‌సింగ్ అంటరానితనాన్ని సంస్కరించటం గురించి మాత్రమే మాట్లాడలేదు. ఆయన దళితులను 'నిజమైన కార్మికవర్గం' అని అన్నాడు. దళితులు తమను తాము విముక్తి చేసుకోవాలని భగత్ సింగ్ కోరాడు. ఆయన శశికాంత్ హింగోనేర్కర్ కవితను ఇలా ఉటంకించాడు: 'ఒకవేళ మీరు మీ బొటనవేలును కోల్పోకుండా ఉండివుంటే చరిత్ర కొంతవరకు మరోలా సాగేది. కానీ మీరు మీ బొటనవేలును, చరిత్రను వాళ్ళకు దారాదత్తం చేశారు. ఏకలవ్యా! ఆ రోజున ఎండి వాళ్ళు నీవైపు తిరిగి చూడలేదు. ఏకలవ్యా! నన్ను క్షమించు. వాళ్ళ తియ్యని మాటలు ఇక నన్ను మోసగించలేవు. నా బొటనవేలు ఎప్పటికీ నానుంచి దూరం కాదు...'

అఖిల భారత హిందూ మహాసభ 1921వ సంవత్సరంలోను, ఆర్ఎస్ఎస్ 1925వ సంవత్సరంలోను అస్తిత్వంలోకి వచ్చినప్పుడు భగత్‌సింగ్ కౌమారదశలో ఉన్నాడు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) కూడా 1925వ సంవత్సరంలోనే ఆవిర్భవించింది. అనేకమంది హిందూ జాతీయ వాదులకు, కమ్యూనిస్టులకు అనుశీలన్, యుగన్‌తరన్ వంటి విప్లవ గ్రూపులతో సంబంధాలు ఉండేవని అందరికీ తెలుసు. 1920వ దశకంలో జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలలో జరుగుతున్న మార్పులను అవగాహన చేసుకుంటున్న ఒక యువ విప్లవకారుడిగా భగత్‌సింగ్ ముందు అనేక రాజకీయ ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. అయినప్పటికీ ఆయన అత్యంత సంక్లిష్టమైన సర్వస్వతంత్ర పంథాను ఎంపిక చేసుకున్నాడు. ఆయన ఒక నాస్తికుడుగా, ఒక విప్లవ సోషలిస్టుగా, ఒక అంతర్జాతీయవాదిగా తన ప్రాపంచిక దృక్పథాన్ని నిర్మించుకున్న తీరు "నేనెందుకు నాస్తికుడనయ్యాను" అనే వ్యాసంలోని ప్రతి అక్షరం ప్రతిబింబిస్తుంది.

భగత్‌సింగ్ స్పష్టంగా తన ప్రాపంచిక దృక్పథాన్ని తన రచనలలోను, ఆచరణతోను ప్రకటిం చినప్పటికీ కొన్ని మతతత్వ సంస్థలు తమ పేర్లకు సిగ్గులేకుండా భగత్‌సింగ్ పేరును జోడిస్తుంటాయి.


నెల్లూరు నరసింహారావు


భగత్‌సింగ్ నాస్తికుడే కాకుండా అతను, అతని కామ్రేడ్స్ నికరంగా మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడారు. మతతత్వ సంస్థలకు చెందిన యువతకు విప్లవ నౌజవాన్ భారత్ సభలో సభ్యత్వం ఇవ్వకూడదని 1928వ సంవత్సరంలో జరిగిన నౌజవాన్ భారత్ సభ సమావేశంలో భగత్ సింగ్, ఆయన సహచరులు స్పష్టం చేశారు. లాలా లజపతిరాయ్ పట్ల భగత్‌సింగ్‌కు అత్యంత గౌరవభావం ఉండేది. బ్రిటిష్ పోలీసులు విపరీతంగా కొట్టటంవల్లనే ఆయన మరణించాడనే వాస్తవం భగత్‌సింగ్‌ను ప్రతీకారం తీర్చుకునేలా చేసింది. అంతలా తను గౌరవించిన వ్యక్తి మతతత్వ రాజకీయాలవైపు మరలగానే భగత్‌సింగ్ లాలా లజపత్‌రాయ్ పైన ఒక కరపత్రాన్ని ఆయన ముఖచిత్రంతో ప్రచురించాడు. ఆ కరపత్రానికి ఆయన పెట్టిన పేరు "పతనమైన నాయకుడు"!

"కీర్తి" పత్రిక 1928వ సంవత్సరం జూన్ 28వ సంచికలో భగత్‌సింగ్ రెండు వ్యాసాలను రాశాడు. వాటిలో ఒకటి: "మత కలహాలు-వాటి పరిష్కారాలు", రెండవది: "అంటరానితనం మీద". మత కలహాలలో "మతతత్వవాదులైన రాజకీయ నాయకుల, వార్తాపత్రికల" పాత్రను భగత్‌సింగ్ స్పష్టంగా గుర్తించాడు. మతతత్వానికి వ్యతిరేకంగా మాట్లాడలేని, మతతత్వ ప్రవాహంలో కొట్టుకుపోతూ జాతీయ నాయకులుగా చలామణీ అవతున్నవారిని ఆయన హేళన చేశాడు. పాత్రికేయ వత్తిని గురించి భగత్ సింగ్ ఇలా రాశాడు:

"ఒకప్పుడు పవిత్రంగా భావించబడిన పాత్రికేయ వృత్తి నేడు అత్యంత దిగజారింది. ప్రజలను చైతన్యపరచటం, ప్రజల మనసులలో నుంచి రాగద్వేషాలను తొలగించి వారిని మత ఛాందసం నుంచి కాపాడటం, మతతత్వ భావనలను రూపుమాపి సమిష్టి జాతీయవాదం వైపు ప్రజలను మరలించటం వార్తాపత్రికల ప్రధాన కర్తవ్యం. అయితే ఈ కర్తవ్యాలను నిర్వహించకుండా అజ్ఞానాన్ని వ్యాప్తిచేయటం, మతమౌఢ్యాన్ని, మత దురహంకారాన్ని బోధిస్తూ ప్రచారం చేయటం, భిన్నత్వంతో విలసిల్లే మన సంస్కృతిని, సమిష్టి వారసత్వాన్ని నాశనం చేసేలా ప్రజల మనసుల్లో మతతత్వ విషాన్ని నింపటమే లక్ష్యంగా వార్తాపత్రికలు పనిచేస్తున్నాయి. (సంప్రదాయక్ దంగే ఔర్ ఉన్కా ఇ లాజ్, కీర్తి, జూన్, 1928).

మతతత్వానికి పరిష్కారం విప్లవ మార్క్సిస్టు సిద్ధాంతంలో ఉందని భగత్‌సింగ్ గ్రహించాడు. ఆయన ఇలా రాశాడు: "కడుపు నింపుకోవటానికి సంబంధించిన భౌతిక ప్రశ్నలు ప్రతి విషయానికి పునాదిగా ఉంటాయి ఇది మార్క్సిజం అందిస్తున్న జ్ఞానంలో ఒక అంశం. పరస్పర కలహాలకు, హింసకు ప్రజలు దిగకుండా ఆపాలంటే వర్గ చైతన్యం కావాలి. పెట్టుబడిదారులే తమ నిజమైన శత్రువులని పేదలు, కష్టజీవులు, రైతులు గ్రహించవలసిన అవసరం ఉంది. మతం, వర్ణం, జాతీయత, జాతి ప్రాతిపదికన చూపే వివక్షను రూపుమాపటంలో వారి ప్రయోజనం దాగిఉంది. ఇది వారికున్న సంకెళ్ళను తెంచి వారిని స్వేచ్ఛా జీవులుగా మారుస్తుంది. అది వారికి ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇస్తుంది...

జారిస్టు పాలన ప్రజలను చీల్చి వివిధ జాతుల మధ్య కలహాలను రెచ్చగొట్టేదని రష్యా చరిత్ర తెలిసిన వాళ్ళకు తెలుసు. అయితే కార్మికులు అధికారంలోకి వచ్చాక అటువంటి హింస కనుమరుగైంది. ఇప్పుడు ప్రతివ్యక్తీ ఒక 'మతానికి చెందిన వాడు'గా కాకుండా ఒక 'మానవుడు'గా భావించ బడుతున్నాడు". అలా భగత్‌సింగ్ మత హింసను నిరోధించాలంటే వర్గ చైతన్యం అవసరమని పేర్కొన్నాడు. ఒకవైపు దేశంలో మత హింస పేట్రేగిపోతుండగా కలకత్తా నగరంలో ట్రేడ్ యూనియన్ కార్మికులు మతహింసలో పాల్గొనకపోవటం, హిందూ, ముస్లిం కార్మికులు కలిసి హింసను అడ్డుకోవటం ఒక ఆశాకిరణంలా కనిపిస్తున్నదని భగత్‌సింగ్ అన్నాడు. యువత



తమను తాము హిందువులుగాను, ముస్లింలుగాను లేక సిక్కులుగాను భావించకుండా తామందరమూ మానవులం అని భావించటంలోనే భారతదేశ భవిత ఉందని ఆయన చాటాడు. 1914 -15నాటి అమరులు రాజకీయాల నుంచి మతాన్ని వేరుచేశారు. మతం వ్యక్తిగత విషయమని, దానిలో ఎవరూ జోక్యం చేసుకోరాదని వారు అన్నారు. అలాగే ప్రజలను విడదీసి, వారి ఐకమత్యాన్ని దెబ్బతీసే మతాన్ని రాజకీయాలలో ప్రవేశపెట్టకూడదని కూడా వారు పేర్కొన్నారు. గదర్ ఉద్యమం ఐక్యంగా మిగలటానికి కారణం సిక్కులు, హిందువులు, ముస్లింలు కలిసికట్టుగా తమ జీవితాలను త్యాగం చెయ్యటమే.

భారతీయ జన జీవన సంస్కృతిలో అత్యంత అమానుషమైన అంటరానితనమనే దురాచారాన్ని ఆచరించటంపైన భగత్‌సింగ్ నేరుగా దాడిచేశాడు. మతమార్పిడుల గురించి గుండెలు బాదుకోవటం పైన ఆయన ఇలా అన్నాడు: "...మీరు(హిందువులు) వాళ్ళను పశువుల్లా చూస్తే వాళ్ళు మిమ్మల్ని వదిలి మరిన్ని హక్కులను అనుభవించవచ్చనే ఆశతోను, సాటి మనుషులుగా చూడబడతామనే నమ్మకంతోను ఇతర మతాలను ఆశ్రయిస్తారు. ('అఛూత్ కా సవాల్, కీర్తి, జూన్, 1928).

భగత్‌సింగ్ అంటరానితనాన్ని సంస్కరించటం గురించి మాత్రమే మాట్లాడలేదు. ఆయన దళితులను 'నిజమైన కార్మికవర్గం' అని అన్నాడు. దళితులు తమను తాము విముక్తి చేసుకోవాలని భగత్ సింగ్ కోరాడు. ఆయన శశికాంత్ హింగోనేర్కర్ కవితను ఇలా ఉటంకించాడు: 'ఒకవేళ మీరు మీ బొటనవేలును కోల్పోకుండా ఉండివుంటే చరిత్ర కొంతవరకు మరోలా సాగేది. కానీ మీరు మీ బొటనవేలును, చరిత్రను వాళ్ళకు దారాదత్తం చేశారు. ఏకలవ్యా! ఆ రోజున ఎండి వాళ్ళు నీవైపు తిరిగి చూడలేదు. ఏకలవ్యా! నన్ను క్షమించు. వాళ్ళ తియ్యని మాటలు ఇక నన్ను మోసగించలేవు. నా బొటనవేలు ఎప్పటికీ నానుంచి దూరం కాదు...'

దళితుల విముక్తి కోసం, అణచివేతకు గురవుతున్న అశేష ప్రజల విముక్తి కోసం భగత్‌సింగ్ చెప్పిన మాటలు నేటికీ తమ సమకాలీనతను కోల్పోలేదు: 'ఎవరైతే ముందుగా విముక్తిపొందుతారో వారే మొదటి దెబ్బ వెయ్యాలి. ఆధిపత్య వర్గానికి చెందిన ప్రతిఒక్కరూ హక్కులన్నిటినీ ఆస్వాదిస్తూ కింది వాళ్ళను తమ పాదాల కింద అణచివేయటానికి ప్రయత్నిస్తుంటారు. ఆవిధంగా ఆచరణలో బలవంతుడి మాటే శాసనం అవుతుంది. కాబట్టి కాలాన్ని వృధాచేసుకోకుండా మీ కాళ్ళమీద మీద మీరు నిలుచోవటానికి ఐక్యమై సామాజిక వ్యవస్థకు సవాలు విసరండి. మీకు రావలసిందేదో మీకు దక్కకుండా చూసే ధైర్యం చేస్తున్నదెవరో తెలియనివ్వండి. ఎవరి దయాదాక్షిణ్యాల మీదో ఆధారపడకండి. అటువంటివారి పట్ల భ్రమలను వీడండి. అధికార యంత్రాంగం ఉచ్చులో చిక్కుకోకుండా చూసుకోండి. ఎందుకంటే వీళ్ళు మీకు మిత్రులుగా ఉండకుండా వారుపాడే పాటకు తాళం వెయ్యమంటారు. నిజం చెప్పాలంటే పెట్టుబడిదారీ వర్గంతో ఉద్యోగస్వామ్యం(బ్యూరోక్రసీ) కలయికే మీ దారిద్ర్యానికి, అణచివేతకు కారణం. కాబట్టి ఎప్పుడూ వీరి దగ్గరకు చేరకండి. వారి కుయుక్తులను కనిపెడుతూ వుండండి. అయితే పరిష్కారం ఏమిటి? మీరే నిజమైన కార్మికవర్గం. మీరు ఐక్యమైతే పోయేదేమీలేదు సంకెళ్ళు తప్ప. అస్తిత్వంలోవున్న వ్యవస్థపైన ఉవ్వెత్తునలేచి తిరగబడండి. క్రమేణా మెరుగు పడటం, సంస్కరణ వాదం వంటివాటితో మీకు ఏమీ ఉపయోగం ఉండదు. సామాజిక ఉద్యమంతో విప్లవాన్ని మొదలెట్టి రాజకీయ, ఆర్థిక విప్లవం కోసం నడుం బిగించండి. మీరు మాత్రమే దేశాలకు ఆయువు. మీ పునాదులపైనే దేశాల మనుగడ ఉంది. ఓ నిదురపోతున్న సింహాల్లారా! మేల్కొనండి. విప్లవ పతాకను ఎత్తిపట్టి తిరగబడండి! (భగత్ సింగ్, 'అఛూత్ కా సవాల్', కీర్తి, జూన్, 1928).

దాదాపు ఒక శతాబ్దం క్రితం భగత్‌సింగ్ రాసిన రాతలు నేటికీ మనలను ఉత్తేజితులను చేయటమే కాకుండా నేటి విపత్కర పరిస్థితులలో కూడా మనల్ని కార్యోన్ముకులను చేస్తున్నాయి. షహీద్ భగత్‌సింగ్ త్యాగధనుడైన ఒక విప్లవకారుడేకాదు అయన భారత విప్లవోద్యమానికి ఒక దిక్సూచి. ఆ దిక్సూచి చూపిన మార్గంలో పయనించి విప్లవనావను గమ్యం చేర్చటం నేటి విప్లవోద్యమ కర్తవ్యం.

సెల్:8886396999



నిత్య వసంతాన్ని..

నేను కవిని..
కల్పన, వర్ణన నా నైజం.
గడవని చీకటి రాత్రుల్లో
కన్నీరు సంద్రమై పొంగుతొంటే
మదిలోతుల భావాలకు శిల్ప రమణీయత నద్ది,
వర్ణశోభిత అక్షర ప్రతిమనై ఒదిగిపోతాను.

ఒత్తిడికి గురైన వేళ రాలిన ఆత్మవిశ్వాస శిశిరాన్ని
కిసలయాక్షరాలతోజ వసంతంగా మారుస్తాను.

విశ్వాంతరాళాలలోని
అణువణువు స్పందనల గాథను
ఆర్ద్రంగా స్పృశించి, అద్భుత అక్షరమాలికగా కూర్చుతాను.

అణగారిన చరితల బతుకు సీమను
అనునిత్యం సజియిస్తూ,
చేతనా ఉషస్సులు పూయిస్తూ,
తిరుగుబాటు గొంతుకల్లో
విప్లవశంఖం పూరించే కంఠానౌతాను.

కోయిలకు ఏడాదికి
ఒక్కవసంతం మాత్రమే...
కానీ, నేను మాత్రం
కాలచక్రపు కదలికలకు
స్పందిస్తూ,ప్రతిస్పందిస్తూ
భూతభవిష్యత్ వర్తమానాలలో
పరిభ్రమిస్తూ, కవితాలాపన చేస్తూనే ఉంటాను.

కలాన్ని స్పృశించని దినం
దిగులు గడప గడియపడి,
గడవని గడియ గుదిబండౌతుంది.
అందుకే ఎన్ని అవాంతరాలు
ముళ్లదారిలా కప్పినా
కవితావక్షాన్నై భావాల ఫలాలు పండిస్తూ ఉంటా!

సాదాసీదా మధ్యతరగతి జీవితాన
నాకో అస్తిత్వాన్నిచ్చి,
సమాజంలో నన్ను ప్రత్యేకంగా నిలిపిన
కవిత్వమంటే నాకు చాలా ఇష్టం.
నేను కవిని.

- వేమూరి శ్రీనివాస్,
9912128967

ప్రసార(ట్రాన్స్‌మిషన్)చార్జీలు - మోడీ ప్రభుత్వ మాయాజాలం

విద్యుత్ రంగంలో మోడీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను రాష్ట్రాలపై రుద్దేందుకు కేంద్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (సీఈఆర్‌సీ) ఒక ఉపకరణంగా మారింది. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, ఆదేశాలకు అనుగుణంగా సీఈఆర్‌సీ ఉత్తర్వులు, రెగ్యులేషన్లు జారీచేస్తున్నది. వాటిని రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ కమిషన్లు అనుసరిస్తున్నాయి. కేంద్ర విద్యుత్ సంస్థలు, అంతర్రాష్ట్ర విక్రయాలు చేసే విద్యుత్ సంస్థలు సీఈఆర్‌సీ నియంత్రణ పరిధిలో ఉండటం ఇందుకు మార్గాన్ని సుగమం చేస్తున్నది.


ఎం. వేణుగోపాలరావు

ఒక రాష్ట్రానికి చెందిన డిస్కాముల కేంద్ర విద్యుత్ సంస్థల నుండి, రాష్ట్రం బయట నుండి మార్కెట్లో, విద్యుత్ ఎక్స్చేంజ్‌ల ద్వారా, ఇతర రాష్ట్రాల నుండి కొనుగోలు చేసే విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కేంద్ర విద్యుత్ ప్రసార సంస్థ పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (పీజీసీఐఎల్) ప్రసార వ్యవస్థను వినియోగించు కోవాలి. ఇందుకు చెల్లించాల్సిన ప్రసార చార్జీలను సీఈఆర్‌సీ నిర్ణయిస్తుంది. అంటే రాష్ట్ర విద్యుత్ ప్రసారానికి చెల్లించాల్సిన చార్జీలను (ఐఎస్‌టీఎస్) చాలా అన్యాయంగా సీఈఆర్‌సీ పెంచుతున్నది. గతంలో ఉన్న సీఈఆర్‌సీ రెగ్యులేషన్ల ప్రకారం, తెలంగాణ డిస్కాముల కేంద్ర విద్యుత్ ఉత్పత్తి స్టేషన్ల నుండి, పీజీసీఐఎల్ ప్రసార వ్యవస్థను వాడుకుంటున్న ప్రయివేటు విద్యుత్ ప్రాజెక్టుల నుండి సరఫరా జరుగుతున్నా విద్యుత్‌కు వర్తించే ట్రాన్స్మిషన్ ఛార్జీలకు దీర్ఘకాలిక యాక్సెస్ (ఎల్‌టీఏ) సామర్థ్య 4119.574 మెగావాట్లు (ఎండబ్ల్యూ) ఉండేది. గత అక్టోబర్ 15 నుండి అమలులోకి వచ్చే విధంగా సీఈఆర్‌సీ అంటారు రాష్ట్ర ప్రసార వ్యవస్థకు కనెక్టివిటీ అండ్ జనరల్ నెట్వర్క్ యాక్సెస్ రెగ్యులేషన్లను జారీ చేసింది. దీని ప్రకారం, ఐఎస్‌టీఎస్ చార్జీల వర్తింపు ఎల్‌టీఏ నుండి గెనెల్ నెట్వర్క్ యాక్సెస్ (జీఎన్ఏ)కు మారింది. గత మూడేండ్లలో మార్కెట్లో స్వల్పకాలిక కొనుగోళ్లను కూడా చేర్చి పీక్ డిమాండ్ ఆధారంగా ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించే సామర్థ్యాన్ని సీఈఆర్‌సీ తాజా ఉత్తర్వు ప్రకారం లెక్కగడుతున్నారు. అంటే వినియో గించని ప్రసార సామర్థ్యాన్ని కూడా వినియోగించి నట్లుగా పరిగణించి డీమ్డ్ జీఎన్ఏ సామర్థ్యాన్ని లెక్కగడుతున్నారు. దీనితో తెలంగాణ డిస్కాములకు 4119 ఎండబ్ల్యూగా ఉన్న ఎల్‌టీఏ సామర్థ్యం కాస్తా 6140 ఎండబ్ల్యూ డీమ్డ్ జీఎన్ఏ సామర్థ్యంగా మారింది. దీని ప్రకారం పీజీసీఐఎల్ అధిక చార్జీలను వసూలు చేస్తున్నది. పశ్చిమ ప్రాంతంలోని రాయ గఢ్ నుండి దక్షిణ ప్రాంతంలోని పుగుళూర్ వరకు పీజీసీఐఎల్ కొత్తగా నెలకొల్పిన 800కెవి హెచ్‌వీడీసీ లైన్ గత సెప్టెంబర్ నుండి వాణిజ్యపరంగా పనిచేస్తున్నది. ఈ కొత్త హెచ్‌వీడీసీ లైన్ సామర్థాయం వినియోగంతో నిమిత్తం లేకుండా చార్జీలను ఆ ప్రాంత రాష్ట్రాల డిస్కాములపై మోపుతూ సీఈఆర్‌సీ ఇచ్చిన ఉత్తర్వులతో నెలకు రూ.12 నుండి 15కోట్ల అదనపు భారం పడుతుందని తెలంగాణ డిస్కాముల అంచనా చూపాయి.

ఐఎస్‌టీఎస్ కింద వినియోగించే సామర్థాయం పెరగకపోయిన, జీఎన్ఏ రెగ్యులేషన్లు అమలులోకి రాక ముందు ఏపీడిస్కాములకు నెలకు చెల్లించిన దాని కన్నా, జీఎన్ఏ రెగ్యులేషన్ల కింద నెలకు చెల్లించాల్సిన మొత్తం 49.42శాతం మేరకు 2023-24 నుండి పెరుగుతున్నట్లు అంచనా చూపాయి. అంటే ఇష్టారాజ్యంగా చేస్తున్న మార్పుల వల్ల ఒక్క సంవత్సరంలోనే ఐఎస్‌టీఎస్ చార్జీల భారం ఇంత అధికంగా ఏపీ డిస్కాములపై పెరిగింది. ఈ అదనపు భారాలు డిస్కాముల వినియోగదారులపై చార్జీల రూపంలో పడుతున్నాయి. ఐఎస్‌టీఎస్ చార్జీలను సీఈఆర్‌సీ తాజా ఉత్తర్వు ప్రకారం ఎంతమేరకు పెరుగుతాయనేది తేల్చేందుకు తెలంగాణ డిస్కాములు పీజీసీఐఎల్ ఇవ్వనున్న తాజా బిల్లుల కోసం ఎదురు చూస్తున్నాయి.

స్వల్పకాలిక విద్యుత్ కొనుగోళ్లు వాటి స్వభావం రీత్యా తాత్కాలికమైనవి. ఆ మేరకు విద్యుత్ ప్రసారం చేయడానికి పీజీసీఐఎల్ ప్రసార సామర్థ్యాన్ని చేర్చలేదు. అందువల్ల, గత మూడేండ్లలో డిస్కాములు చేసిన స్వల్పకాలిక కొనుగోళ్లను బట్టి ఐఎస్‌టీఎస్ చార్జీలు వర్తించే సామర్థ్యాన్ని లెక్కగట్టడం నిర్హేతుకం. ఎల్‌టీఏ విధానానికి విరుద్ధం. పైగా 2023-24 సంవత్సరానికి తెలంగాణ డిస్కాముల మార్కెట్ కొనుగోళ్లుచేయాల్సిన అవసరం చాలా స్వల్పంగా 136 ఎంయూ ఉంటుందని అంచనా చూపాయి. డిస్కాముల మార్కెట్లో విద్యుత్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితికి కేటాయించిన మేరకు బొగ్గు, సహజ వాయువు వంటి ఇంధనాలను సరఫరా చేయించటంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే ప్రధాన కారణం. డిస్కాములపై మోపుతున్న ఆర్‌పీపీఓ కొనుగోళ మరో కారణం. అవసరంలేని ట్రాన్స్మిషన్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచి అవసరం లేని రాష్ట్రాల డిస్కాములపై ఐఎస్‌టీఎస్ చార్జీలను మోపటం ప్రస్నార్థకం. మార్కెట్లో డిస్కాములు కొనుగోలు చేసిన మేరకు ఎస్‌టీఎస్ చార్జీలను ఆ మేరకే, ఆ వినియో గించుకున్న కాలానికే నిర్ణయించటం, పరిమితం



చేయటం న్యాయం. అదికూడా డిస్కాముల కాంట్రాక్టు చేసిన సామర్థ్యాన్ని సంబంధిత స్టేషన్ల నుండి విద్యుత్ ఉత్పత్తి, సరఫరా జరగక వాడుకోకపోతే, ఆ సామర్థ్యానికి చెల్లిస్తున్న చార్జీల నుండి స్వల్పకాలిక కొనుగోళ్ల సామర్థ్యానికి చార్జీలను సర్దుబాటు చేయాలి.


డీమ్డ్ జీఎన్ఏ రెగ్యులేషన్ల అన్యాయాన్ని ప్రశ్నిస్తూ దక్షిణాది రాష్ట్రాల డిస్కాముల తరపున దాఖలు చేసిన పిటిషన్ సీఈఆర్‌సీ నిర్హేతుకంగా తోసిపుచ్చింది. నియంత్రణ ప్రక్రియ అన్యాయంగా భారాలు మోపాయి. మొక్కుబడి ప్రక్రియగా తయారయ్యింది. పీజీసీఐఎల్ ట్రాన్స్మిషన్ వ్యవస్థను దేశ వ్యాప్తంగా వినియోగించుకోవచ్చు. గనుక, అదనంగా చేర్చిన లైను జాతీయ స్థాయిలో చార్జీలు వర్తించే విధంగా పరిగణించాలన్న దక్షిణాది రాష్ట్రాల అభ్యర్థనను కూడా సీఈఆర్‌సీ పట్టించుకోలేదు. దానిపై అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఏపీటీఈఎల్)లో దాఖలు చేసిన అప్పీల్ పెండింగ్‌లో ఉంది. అవసరంతో నిమిత్తం లేకుండా, విచక్షణా రహితంగా ట్రాన్స్మిషన్ సామర్థ్యాన్ని పీజీసీఐఎల్ పెంచగూడదు. రాష్ట్రాల డిస్కాముల కాంట్రాక్టు చేయని ట్రాన్స్మిషన్ సామర్థ్యానికి పీజీసీఐఎల్ చార్జీలను వసూలు చేయరాదు. అవసరంతో పొంతన లేకుండా ప్రసార సామర్థ్యాన్ని అధికంగా చేరిస్తే అదనపు సామర్థ్యం నిరు పయోగంగా ఉంది, రాష్ట్రాలపై భారాలు పెరుగుతున్నాయని దేశంలో విద్యుత్ నియంత్రణ కమిషన్ల ప్రతినిధులతో ఏర్పాటైన ఫోరమ్ ఫర్ రెగ్యులేటర్స్ (ఎఫ్ఓఆర్) తన నివేదికలో తప్పుపట్టింది. ట్రాన్స్‌మిషన్ సామర్థ్యం ఏర్పాటు ప్రణాళికా బద్ధంగా ఉండాలని పేర్కొంది. ఫర్‌లో భాగస్వామి అయినా సీఈఆర్‌సీ వీటిని పట్టించుకో లేదు. పీజీసీఐఎల్ అనవసర సామర్థ్యాన్ని చేర్చటాన్ని కూడా ప్రశ్నించలేదు.

సెప్టెంబర్ 2025 వరకు నెలకొల్పే సౌర విద్యుత్ యూనిట్లకు కేంద్రం ఐఎస్‌టీఎస్ చార్జీల నుండి 25 ఏండ్ల పాటు మినహాయింపు ఇచ్చింది. ఐటీఐ, ఆ చార్జీలను మోడీ ప్రభుత్వం పీజీసీఐఎల్‌కు చెల్లించటం లేదు. డీమ్డ్ జీఎన్ఏ సామర్థ్యం పేరుతో మినహాయింపు చార్జీలను కూడా రాష్ట్రాల డిస్కాములపై సీఈఆర్‌సీ మోపింది. అది తాతలు, ఇతర పెట్టుబడిదారీ సంస్థలు ఇతర రాష్ట్రాలలో నెలకొల్పుతున్న సౌర విద్యుత్ ప్రాజెక్టుల నుండి ఎస్ఈసీఐ, ఎన్‌వీవీఎన్ఎల్ వంటి కేంద్ర వ్యాపార సంస్థలు ఇతర రాష్ట్రాల డిస్కాములకు సరఫరా చేసేయ్ విద్యుత్ ధరలు తక్కువగా ఉన్నట్లు చూపడానికి, ఆయా గుత్తపెట్టుబడిదారీ సంస్థల ప్రోజెక్టుల నుండి విద్యుత్ కొనుగోలుకు వీలు కల్పించటానికి మోడీ ప్రభుత్వం ఈ మినహాయింపు ఇచ్చింది. ఆశ్రిత పెట్టుబడిదారుల సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేయటంలో ఆలస్యం జరుగుతున్నా దృష్ట్యా ఐఎస్‌టీఎస్ చార్జీల మినహాయింపును వాటిని నెలకొల్పాల్సిన గడువును కూడా పలుమార్లు మోడీ ప్రభుత్వం పొడిగిచింది. కానీ ఆచరణలో ఆ మినహాయింపు మొత్తాన్ని కూడా జీఎన్ఏ సామర్థ్యం పేరుతొ డిస్కాముల వినియోగదారులపైనే మోపు తున్నది. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ మినహాయింపు ఇచ్చినట్లయితే, ఒక రాష్ట్రంలో నెలకొల్పి, ఆ రాష్ట్ర డిస్కాములకు, వినియోగదారులకు సరఫరా చేసేందుకయ్యే ట్రాన్స్మిషన్ చార్జీలకు కూడా మోడీ ప్రభుత్వం మినహాయింపు

ఆశ్రిత పెట్టుబడిదారుల సౌర విద్యుత్ ప్రాజెక్టులను అమలు చేయటంలో ఆలస్యం జరుగుతున్నా దృష్ట్యా ఐఎస్‌టీఎస్ చార్జీల మినహాయింపును వాటిని నెలకొల్పాల్సిన గడువును కూడా పలుమార్లు మోడీ ప్రభుత్వం పొడిగిచింది. కానీ ఆచరణలో ఆ మినహాయింపు మొత్తాన్ని కూడా జీఎన్ఏ సామర్థ్యం పేరుతొ డిస్కాముల వినియోగదారులపైనే మోపు తున్నది. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఈ మినహాయింపు ఇచ్చినట్లయితే, ఒక రాష్ట్రంలో నెలకొల్పి, ఆ రాష్ట్ర డిస్కాములకు, వినియోగదారులకు సరఫరా చేసేందుకయ్యే ట్రాన్స్మిషన్ చార్జీలకు కూడా మోడీ ప్రభుత్వం మినహాయింపు ఇచ్చి ఉండాలి.

ఇచ్చి ఉండాలి. ఆ మినహాయింపు మొత్తాలను సంబంధిత రాష్ట్ర ట్రాన్స్మిషన్ సంస్థకు కేంద్రం చెల్లించాలి. కానీ మోడీ ప్రభుత్వం అలా చేయటం లేదు. సీఈఆర్‌సీ కూడా ఆ మినహాయింపు మొత్తాలను పీజీసీఐఎల్ కేంద్ర ప్రభుత్వం నుండి పొందాలని తన ఉత్తర్వులు, రెగ్యులేషన్లలో నిర్దేశించకుండా దాటవేస్తున్నది. ఆ విధంగా మినహాయింపు ఇస్తున్నట్లు పైకి ప్రచారం చేసుకొంటూ, ఆచరణలో మినహాయింపు మొత్తాలను కూడా వినియోగదారులపై మోపే టక్కరి వ్యవహారం నడుస్తున్నది. వాస్తవానికి తనంత తానూ ఆలాంటి మినహాయింపులు ఇచ్చే అధికారం సెర్క్‌కి, రాష్ట్రాల ఈఆర్‌సీలకు చట్టప్రకారం లేదు.

ఆర్ఈ ఉత్పత్తి స్టేషన్లకు, రెన్యూబుల్ హైబ్రిడ్ జెనరేటింగ్ స్టేషన్లు (సౌర, పవన విద్యుత్‌ను మిశ్రమ ఉత్పత్తి చేసే స్టేషన్లు), పంపెడ్ జలవిద్యుత్ స్టేషన్లు, వాటి విద్యుత్‌ను వినియోగించేందుకు బాటరీ స్టొరగె సిస్టమ్లను వినియోగించే స్టేషన్లకు ఐఎస్‌టీఎస్ చార్జీల నుండి మినహాయింపు ఇస్తూ కేంద్రం విధానాల ప్రకారం సీఈఆర్‌సీ తాజాగా రేగులషన్లు జారీ చేసింది. రెగ్యులేషన్‌లో పేర్కొన్న షరతులకు లోబడి జూన్ 30, 2025 లోగా నెలకొల్పే పైన పేర్కొన్న ప్రాజెక్టులకు 12 నుండి 25ఏండ్ల పాటు ఈ మినహాయింపు వర్తిస్తుందని పేర్కొంది. ఇక్కడ కూడా ఆ మినహాయింపు చార్జీలను కేంద్రం సంబంధిత ట్రాన్స్మిషన్ సంస్థలకు చెల్లించాలని పేర్కొనకుండా సీఈఆర్‌సీ యథావిధిగా దాటవేసింది. అదానీ, ఇతర పెట్టుబడిదారీ సంస్థలు ఈ విధమైన ప్రాజెక్టులను నెలకొల్పుతున్న నేపథ్యంలో ఈ రెగ్యులేషన్లు జారీ అయ్యాయి.



సుధా స్రవంతి రస్తోగి... ఓ ఆర్టిస్ట్, ఆర్ట్ టీచర్. హైదరాబాద్ నగరంలో సాలార్జంగ్ మ్యూజియంలో ప్రస్తుతం జరుగుతున్న ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఈమె గీసిన చిత్రం కూడా ప్రదర్శనలో వుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా మార్చి 14న మొదలైన ఈ చిత్రకళా ప్రదర్శన మార్చి 31, 2023 వరకు కొనసాగుతుంది. ఈ సందర్భంగా కేరళ మురల్ ఆర్ట్‌లో తన ప్రతిభను కనబరుస్తూ, మరెందరినో కళాకారులుగా తీర్చిదిద్దుతున్న ఆమె కళా ప్రయాణం నేటి మానవిలో...


జీవకళ ఉట్టిపడే చిత్రాలు

సాలార్జంగ్ మ్యూజియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన "ఆర్ట్ ఫ్రమ్ హార్ట్" చిత్రకళా ప్రదర్శనలో నా కేరళ మురల్ పెయింటింగ్ కూడా చోటు చేసుకోవటం ఎంతో ఆనందంగా వుంది. అక్కడ జరిగే ప్రదర్శన కోసం చిత్రాల ఎంపిక జరుగుతుందని తెలిసి నేను పూర్తిగా ఈ చిత్రం గీయటం పైనే మనసు కేంద్రీకరించాను. నా చిత్రంలో 'స్త్రీని 'దేవతా రూపం'లో చూపించాలని. మహిళ ఎంతటి కష్టం వచ్చినా చాలా ప్రశాంతంగా వాటిని ఎదుర్కొని నిలబడుతుంది. అందుకనే చిత్రంలో నీలి రంగులను, అలాగే స్త్రీ చూపించే ప్రేమ, ఆప్యాయతలు కోసం లేత రంగులని ఎంచుకున్నాను. చిత్రం అందంగా ఉండేందుకు లేత గులాబీ రంగుని ఎంచుకున్నాను. ఆమె చిరునవ్వు చూపు అన్నీ కూడా తన చుట్టు వున్న వాటిపై దృష్టి పెట్టినట్లుగా కనిపిస్తాయి. ఇలా నాలో కలిగే ఎన్నో భావాలు ఈ చిత్రంపై చిత్రీకరించాను" అంటూ ఈ పెయింటింగ్ గీయటంలో తన అనుభవాలను తెలిపారు సుధా రస్తోగి. మురల్స్ ఆర్ట్ అంటే గోడలపై గీసే కుడ్య చిత్రాలు. ఇవి సాంప్రదాయకంగా కేరళలో మనకి కనిపించే చిత్రాలు. ఎక్కువగా దేవతలు, దేవుళ్ళ చిత్రాలను పెద్ద పెద్ద గోడలపై గీస్తారు. సుధకు ఈ చిత్రం గీయటానికి 34 గంటలు పట్టింది. దీనికోసం ఆయిల్ కలర్స్, అక్రిలిక్ కలర్స్‌ని ఉపయోగించారు.



అకాడమీ స్థాపించి

నగరంలోని శాలివాహన నగర్, ఎల్లారెడ్డిగూడాలో నివాసముంటున్నారు సుధ. డిగ్రీ పూర్తి చేసి అక్కినేని హార్ట్ యానిమేషన్ అకాడమీలో 2డి ట్రెడిషనల్ యానిమేషన్ కోర్స్ చేసారు. అనంతరం అక్కడే ఉద్యోగంలో చేరారు.



భారతీయుల పురాతన చిత్ర కళలకి మెరుగులు దిద్దుతూ కొత్త కొత్త కళలను తమదైన శైలిలో సృష్టిస్తూ దంపతులు ఈ కళను ఆసక్తి కలవారికి నేర్పిస్తున్నారు. వీరు పెయింటింగ్‌లు ఎందరో కళాభిమానుల ఇళ్ళలో అలరిస్తున్నాయి. విదేశాల నుంచి కూడా ఆర్డర్స్ వస్తుంటాయి. వీరి పిల్లలు కూడా తల్లి తండ్రుల అడుగుజాడల్లోస నడుస్తూ ఎన్నో మంచి ఆర్ట్ వస్తువులు తయారు చేస్తున్నారు. "సృజనాత్మకత వుంటే భవిష్యత్తు ఎంతో బాగుంటుంది. ఇప్పుడిప్పుడే ప్రజలలో కుడా చైతన్యం వస్తోంది. ఈ కళని బాగా ఆదరిస్తున్నారు. ఈ ఆర్ట్‌లో ప్రసిద్ధులైన రాజ రవివర్మ పెయింటింగ్స్ ఇప్పటికీ ఎంతో ప్రసిద్ధి పొందాయి. ఆ తర్వాత కూడా ఎంతో మంది తమ కళ ద్వారా పైకి వచ్చారు. ఎప్పటికీ ఈ ఫైన్ ఆర్ట్స్ కళలు ధ్రువ తరలా వెలుగొందుతూనే వుంటాయి" అంటారు ఆమె.

సృజనాత్మకత వుంటే...

పవన్ రస్తోగితో వివాహం తర్వాత తిరిగి ఆర్ట్ టీచర్‌గా పర్ ఫెక్ట్ స్ట్రోక్ అకాడమీలో 2010 నుంచి ప్రయాణం చేస్తున్నారు. ఫ్రీహాండ్ డ్రాయింగే కాదు సాఫ్ట్ వేర్ రంగంలోనూ ఈ కళలో మరింత రాణించడానికి కొన్ని కోర్స్‌లు చేశారు. భర్త కూడా ఫైన్ ఆర్ట్స్ రంగంలో ప్రసిద్ధులే. ఇరువురు కలిసి ఈ ఆకాడమీని చూసుకుంటున్నారు. యానిమేషన్‌లో ఫ్యాకల్టీగా, 2డి ,3డి యానిమేషన్, ఫైన్ ఆర్ట్స్ ఇన్‌స్ట్రక్టర్‌గా 23 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉన్న వీరు ఎందరో చిన్నారులకు పేయింగ్ నేర్పించే కళాకారిణి. సృజనాత్మకత కలిగిన బహుముఖ ప్రజ్ఞావంతురాలు. నేడు ఎంతో అభివృద్ధి చెందిన ఆధునిక టెక్నాలజీలోనూ దూసుకుపోతున్న ఆర్టిస్ట్. సాంకేతిక నైపుణ్యంలో వీరు ట్రాక్ రీడింగ్, ఎక్స్ పోజర్ షీట్లు, టైమింగ్ చార్ట్స్, అక్షరాలు, లేఅవుట్‌ల కోఆర్డినేషన్, యానిమేషన్, టైమింగ్, స్పేసింగ్ వంటివి ఎలా చేయాలో తెలిసిన వ్యక్తి.

ఎందరికో శిక్షణ

2010 నుండి వీరు సొంత ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్‌ని నడిపిస్తున్నారు. 2డి, 3డి యానిమేషన్‌లో భాగంగా యానిమేషన్, కార్టూన్స్ వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ అన్ని వయసుల వారికి 40 రకాల కళలు, చేతిపనులు నేర్పిస్తూ వుంటారు. ఇంటీరియర్ డిజైనింగ్, హోమ్ డెకర్, ల్యాండ్ స్కేపింగ్ వర్క్‌లను కూడా తీసుకుంటారు. సబ్జెక్ట్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్‌తో కూడిన అనేక రకాల హాబీలను బోధించడం వీరి ప్రత్యేకం. అవసరం అయితే విజిటింగ్‌కి కూడా చేస్తుంటారు. "రూట్స్ కోలీజియం"లో ఆర్ట్ టీచర్‌గా కూడా పాఠాలు చెబుతున్నారు.

ఎంతో అనుభవం



సుధకు అనేక యానిమేషన్ చిత్రాలకు, ప్రముఖ టీవి నిర్మాణ సంస్థలలోనూ యానిమేటెడ్ ప్రకటనలలో 'కీ' యానిమేటర్‌గా పనిచేసిన అనుభవం వుంది. చిన్నపిల్లలు, పెద్దలూ ఎంతో ఆసక్తిగా చూసే 'మిస్టర్ బీన్', 'లవ్ లైన్ వంటి వాటికి డైరెక్టర్, కీ యానిమేటర్‌గా పని చేశారు. అలాగే డిస్కవరీ చానెల్ కోసం కూడా పని చేశారు. పద్మాలయా టెలీ ఫిల్మ్స్, డిస్కవరీ చానెల్, వార్నర్ బ్రదర్స్, యుఎస్‌ఏ వారి కోసం, పోర్స్ లైట్ ఎంటర్ టైన్మెంట్ ఇలా ఎన్నో ప్రముఖ సంస్థలలో యానిమేటర్‌గా పని చేసిన అనుభవం వుంది. అటు ఆకాడమీని చూసుకుంటూ, ఇటు ప్రముఖ సంస్థలలో పని చేస్తూ, పెయింటింగ్ కళపై ఆసక్తి గల వారికి స్టూడియోలోనూ, అడిగిన వారికి ఇంటికి వెళ్ళి కూడా ఈ కళని నేర్పిస్తున్నారు.

ఎన్నో రకాల కళలు...

పిల్లలలోని సృజనాత్మకతకు పదును పెట్టే చోటు "పర్ఫెక్ట్ స్ట్రోక్స్ ఆర్ట్ అకాడమి" ఇక్కడ క్రియేటివిటికి ఎన్నో దారులు వున్నాయి. "తల్లి తండ్రులు తమ పిల్లల అభిప్రాయాలకి విలువ నిస్తున్నారు. తమ పిల్లలు ఏం కోరుకుంటున్నారో దానికి ప్రాముఖ్యతనిస్తున్నారు. ఇందుకు ఉదాహరణే మా వద్దకు వచ్చే స్టూడెంట్. మా దగ్గర డ్రాయింగ్, స్కెచ్చింగ్, తంజావూర్ పెయింటింగ్, 3డి మురల్ పెయింటింగ్, అక్రిలిక్ పెయింటింగ్, ఫాబ్రిక్ పెయింటింగ్, స్టైన్ వుడ్ పెయింటింగ్, వాటర్ కలర్ పెయింటింగ్, కేరళ పెయింటింగ్, గ్లాస్ పెయింటింగ్సింగిల్ స్ట్రోక్ పెయింటింగ్ ఇలా ఎన్నో రకాల పెయింటింగ్స్ వున్నాయి. ఆసక్తి గల విద్యార్థులకి అన్నీ నేర్పిస్తాము. అంతే కాదు పాలిమర్ క్లే, టెర్రకోట జ్యూవలరి, క్విల్లింగ్, పంచ్, క్రాఫ్ట్, చాక్లెట్ తయారి, కాండిల్ తయారి వంటివి కూడా నేర్పిస్తాము" అని తమ ఆర్ట్ క్లాస్‌లో నేర్పించే అంశాల గురించి చెప్పారు.

ఎక్కువగా ఆదరిస్తున్నారు

"నేర్చుకోటానికి వయసుతో నిమిత్తం లేదు. రిటైర్ అయిన వాళ్ళు కూడా మా వద్దకు వస్తారు. పెయింటింగ్ ఎగ్జిబిషన్‌లు జరుగుతుంటాయి. మహిళలు కూడా తమ కిట్టీ పార్టీలలో క్రాఫ్ట్, పెయింటింగ్ క్లాసెస్ పెట్టేవారు. సమ్మర్ కాంప్స్ పెడుతుంటారు. తరచుగా వర్క్ షాప్స్ నిర్వహిస్తుంటారు. "3డి సాస్ పెసొ ఆర్ట్"ని ఎక్కువగా ఆదరిస్తున్నారు. అలాగే టెర్రకోట జ్యువెలరీ, పేపర్‌తో చేసే కీ చైన్స్ అందరినీ ఆకర్షిస్తున్నాయి" అని అంటారు సుధ.

ప్రముఖుల పిల్లలు...

సుధలోని కళా నైపుణ్యానికి గుర్తుగా ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు. చిన్నతనంలోనే అభినందన జీవనరత్న అవార్డ్, వంశీ వారి బాల రత్న అవార్డు, వాసవి వారి ఆల్ రౌండర్ అవార్డు, కామ్లిన్ వారి స్టేట్ లెవెల్ అవార్డులు అందుకున్నారు. 1998లో ఉమెన్ ఆఫ్ టుమారో ఫైనల్స్ వరకు వచ్చారు. ఎన్నో ఫైన్ ఆర్ట్ వర్క్ షాప్‌లు నిర్వహించారు. పలువురి ప్రశంసలు అందుకున్నారు. మెగాస్టార్ చిరంజీవి భార్య సురేఖ, అతని కుమార్తె, అతని మనవరాళ్ళు, అల్లు అర్జున్ పిల్లలు, రాజమౌళి అమ్మాయిలు వీరి దగ్గర ఆర్ట్ నేర్చుకున్నారు. అలాగే వీరి అన్నమయ్య (7వ తరం) మనవరాలు, మహేష్ బాబు కూతురు, సిరివెన్నెల సితారామయ్య మనవరాలు, సబితారెడ్డి మనవరాలు, జీవీకే మనవరాలు, జానారెడ్డి మనవరాలు, మనవడు ఇలా ఎందరో ప్రముఖుల పిల్లలు వున్నారు. ఈమె 2023 సంక్రాంతి నాడు తిరుమల దేవస్థానంలోని ఉత్తమ అతిథి గృహాలలో వీరు చిత్రించిన 12 అడుగుల తంజావూరు పెయింటింగ్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాదు ప్రముఖ చిత్రకారుడు జయదేవ్ బాబు రచించిన యానిమేషన్ గురించి రాసిన పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. అలాగే తాను కోర్సు చేసిన అక్కినేని హార్ట్ యానిమేషన్‌లోనే అసిస్టెంట్ యానిమేటర్‌గా ఏడాదిపైగా పనిచేశారు.

- మణినాథ్ కోపల్లె, 9703044410



పారదర్శకంగా విచారణ జరపాలి

(మొదటిపేజీ తరువాయి)

ఘటనలో కేటీఆర్ పీఏపై ఆరోపణలు వస్తున్నట్టు చెప్పారు. ఆర్టికల్ 317 ప్రకారం గవర్నర్‌కు విశేష అధికారాలున్నాయనీ, వాటి ప్రకారం ఇప్పుడున్న బోర్డులో ఉన్న అందర్ని సస్పెండ్ చేయాని కోరారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకు కేసులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌పై తమకు నమ్మకం లేదనీ, పారదర్శక విచారణకు గవర్నర్ అనుమతి కోరామని తెలిపారు. ఇది లక్షలాది అభ్యర్థుల సమస్యకాదనీ, లక్షలాది కుటుంబాలకు సంబంధించిన సమస్య అని అన్నారు. పేపర్ లీకేజీలో ప్రభుత్వ పెద్దల పాత్ర ఉన్నదని ఆరోపించారు. గతంలో వ్యాపం కుంభకోణంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తమ ఫిర్యాదులో పేర్కొన్నట్టు తెలిపారు. మంత్రి కేటీఆర్‌తోపాటు చైర్మెన్ జనార్ధన్‌రెడ్డి, కార్యదర్శి అనితా రామచంద్రన్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు తమకు అవకాశం ఇవ్వాలని కోరినట్టు చెప్పారు.

రేవంత్ వెంట నడవండి...
గాంధీభవన్ ఉగాది వేడుకల్లో పంచాంగ కర్త ఉద్బోధ

నేతలంతా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి వెంట నడవాలని పంచాగ కర్త చిలుకూరు శ్రీనివాస మూర్తి ఉద్బోధించారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం పఠించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అవగాహన పెరుగుతున్నదని తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలను పట్టించుకోకుండా ప్రజలు పాలక పక్షం వైపు ఉంటారని చెప్పారు. తూర్పు ఈశాన్య రాష్ట్రాల్లో నష్టం జరుగుతుందని చెప్పారు. నూతన రాజకీయ కూటములు ఏర్పడుతాయన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అల్లర్లు ప్రజలను ఇబ్బంది పెడతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. బలహీన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. రాహుల్ స్ఫూర్తితో ప్రజల వద్దకు వెళ్లాలని కోరారు. ప్రజలకు నచ్చితే అధికారం ఇస్తారనీ, ప్రజలు నచ్చేలా నడుచుకోవాలని సూచించారు.

వ్యతిరేకత ఉంది...రాజు జాగ్రత్త

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందనీ, పెండింగ్ బిల్లులన్నీ క్లియర్ అవుతాయని చెప్పుకొచ్చారు. పాలించే రాజుకు కొందరు వ్యక్తుల ద్వారా వ్యతిరేకత వస్తుందనీ, అందువల్ల ఆయన జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వర్షాలు భారీగా పడతాయనీ, నాగార్జునసాగర్, శ్రీశైలం, కాళేశ్వరం ప్రాజెక్టులన్నీ నీటితో నిడుతాయని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో సమూల మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయనీ, విద్యాశాఖలో మరికొన్ని అవకతవకలు జరిగే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు.

న్యాయవ్యవస్థలో సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు ఇస్తాయని జోస్యం చెప్పారు. ప్రతిపక్షాలు ఉనికి కాపాడుకోవాలనీ, మత ఘర్షణలు, సామాజిక ఉద్రిక్తతలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఉత్తర భారతంలో అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరమైన సంఘటనలు జరగబోతున్నాయని వెల్లడించారు. ఈ మూడు మాసాల్లో విపరీతమైన ఒడిదుడుకులు జరగబోతున్నాయన్నారు. తెలంగాణ ప్రజలు ఆసక్తికరమైన రాజకీయాలను చూడబోతున్నారని తెలిపారు. ధరలు తగ్గుతాయనీ, ఏప్రిల్‌లో ఎండలు ఎక్కువవుతాయని చెప్పారు.

ఎంసెట్‌కు 1,34,443 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఎంసెట్ ఎంట్రెన్స్ టెస్టుకు ఇప్పటిదాకా(22 వ తేదీ వరకు) 1,34,443 దరఖాస్తులొచ్చాయని టీఎస్ ఎంసెట్ కన్వీనర్ డాక్టర్ బి.డీన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో 85,997, అగ్రికల్చర్, మెడిసిన్ విభాగంలో 48,325, రెండింటికీ కలిపి 141 చొప్పున దరఖాస్తులు అందాయని తెలిపారు. ఎంసెట్ ఎంట్రెన్స్ దరఖాస్తుల చివరి తేదీ ఏప్రిల్ పదో తేదీ అనే విషయం విదితమే.

వారానికి రూ.3,000 కోట్లు

- అదానీ సంపద ఆవిరి



న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల జాబితాను హురున్ రిచ్ లిస్ట్ విడుదల చేసింది. అత్యధిక మంది బిలియనీర్లు కలిగిన దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉన్నది.అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ సంపద ఈ ఏడాది భారీగా కుంగినట్లు 'ఎం3ఎం హురున్ గ్లోబల్ రిచ్ లిస్ట్ నివేదిక తెలిపింది. ఈ ఏడాదిలో ఆయన సగటున వారానికి రూ.3,000 కోట్లు కోల్పోయినట్టు పేర్కొంది. దీంతో ఆసియా ధనవంతుల జాబితాలో నుంచి అదానీ రెండో స్థానాన్ని కోల్పోయారు. రష్యాకు చెందిన ఝొంగ్ శాన్‌శాన్ ఆ స్థానానికి చేరారు. ప్రస్తుతం అదానీ సంపద 53 బిలియన్ డాలర్లుగా హురున్ నివేదిక లెక్కగట్టింది. విమానాశ్రయాల నుంచి వంట నూనెల వరకు వివిధ రంగాలకు విస్తరించిన అదానీ గ్రూప్ హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణల తర్వాత తీవ్ర ఒడుదొడుకులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. గ్రూప్‌నకు చెందిన నమోదిత సంస్థల మార్కెట్ విలువ గణనీయంగా తగ్గింది. ఒకప్పుడు ప్రపంచ ధనవంతుల జాబితాలో రెండో స్థానానికి చేరిన గౌతమ్ అదానీ ఇప్పుడు టాప్–20లో కూడా లేకపోవడం గమనార్హం. గరిష్ఠ స్థాయిల నుంచి ఆయన సంపద 60 శాతానికి పైగా తగ్గింది.

ఇక హిండెన్‌బర్గ్ నివేదిక జనవరి 24న విడుదలైంది. అప్పటి నుంచి అదానీ గ్రూప్ లోని నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.7.11 లక్షల కోట్లు ఆవిరైందని లెక్క కట్టింది.

బాణసంచా పరిశ్రమలో పేలుడు

- తమిళనాడులో ప్రమాదం.. ఎనిమిది మంది మృతి



చెన్నై: ఓ బాణసంచా పరిశ్రమ లో పేలుడు సంభవించి 8 మంది కార్మికులు మృతి చెందారు. ఈ విషాద సంఘటన తమిళనాడులోని కాంచీపురంలో బుధవారం చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎగిసిపడుతున్న మంటలను ఫైరింజన్ల సహాయంతో అదుపు చేశారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

మహాత్మాగాంధీ మనవరాలు గోకనీ మృతి



ముంబయి: మహాత్మాగాంధీ మనవరాలు ఉషా గోకనీ (89) మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ముంబయి లో కన్నుమూశారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.ఉషా గోకనీ గత ఐదేండ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా రెండేండ్లుగా మంచానికే పరిమితమయ్యారు. ముంబయిలోని గాంధీ స్మారక నిధి గతం లో ఆమె చైర్ పర్సన్‌గా పని చేశారు. గాంధీ స్థాపించిన వార్ధా సేవాగ్రామ్ ఆశ్రమం గోకనీ బాల్యం గడిచింది.

బిల్కిస్ బానో కేసుపై సుప్రీం ప్రత్యేక బెంచ్

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు బుధవారం అంగీకరించింది. ఈ పిటిషన్‌ను విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు పిఎస్ నరసింహ, జెబి పార్దివాలాలతో కూడిన ధర్మాసనం కొత్త బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. ఈ విషయాన్ని బిల్కిస్‌బానో తరపు న్యాయవాది శోభాగుప్తా వెల్లడించారు. కాగా, ఈ కేసులో కొత్త బెంచ్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని శోభాగుప్తా తన వాదనల్ని వినిపించారు. ఈ వాదనల అనంతరం దీనిపై ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేస్తాం.. ఈ విషయంలో సత్వరమే పరిశీలిస్తామని సీజేఐ డివై చంద్రచూడ్ చెప్పారు. బిల్కిస్‌బానోపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను గతేడాది ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సమయంలో గుజరాత్ ప్రభుత్వం విడుదల చేసిన సంగతి తెలిసిందే.

నిందితుల విడుదలకు వ్యతిరేకంగా బిల్కిస్‌బానో రివ్యూ పిటిషన్‌ను వేయగా.. దాన్ని గతేడాది డిసెంబర్‌లో సుప్రీం కొట్టేసింది. ఈ విషయంపై ప్రతిపక్షాలు, అధికారపక్షంపై విరుచుకుపడ్డాయి. దేశవ్యాప్తంగా పెద్ద దుమారం రేగిన విషయం విదితమే.

ఘనంగా పద్మ అవార్డుల ప్రదానం

(మొదటిపేజీ తరువాయి)

'పద్మ' అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ ఏడాది మొత్తం 106 పద్మ పురస్కారాలను ప్రకటించగా.. వీరిలో 50మందికి పైగా ప్రముఖులకు పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలు అందజేశారు. మిగతా వారికి మరో సందర్భంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటుచేసి అవార్డులను అందజేసి వారిని గౌరవించనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాల ప్రదానోత్సవంలో భాగంగా కర్నాటక మాజీ సీఎం ఎస్.ఎం.కృష్ణ, ప్రొఫెసర్ బాలకృష్ణ దోషి (మరణానంతరం) ఆయన కుటుంబ సభ్యులు పద్మవిభూషణ్ అందుకోగా.. ప్రముఖ వ్యాపారవేత్త కుమార మంగళం బిర్లా, ప్రఖ్యాత ప్లేబ్యాక్ సింగర్ సుమన్ కల్యాణ్‌పుర్, ప్రొఫెసర్ కపిల్ కపూర్, ఆధ్యాత్మికవేత్త కమ్లేశ్ డి పటేల్ (తెలంగాణ) పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. వీరితో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌రావు, చింతలపాటి వెంకటపతిరాజు, ఆచార్య ప్రకాశ్ చంద్రసూద్, డా మోదడుగు విజయ గుప్తా, పసుపులేటి హన్మంతరావు, బండి రామకృష్ణ, సీవీ రాజు, కోటా సచ్చిదానందతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన ఆయా రంగాల ప్రముఖులు పద్మశ్రీ అవార్డులను అందుకున్నారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కర్, ప్రధాని మోడీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీలో కదులుతున్న డొంక

(మొదటిపేజీ తరువాయి)

సిట్ కీలక సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఇందులో భాగంగానే టీఎస్‌పీఎస్సీ లోని టెక్నికల్ డిపార్ట్‌మెంట్‌తో సంబంధాలున్న వారికి నోటీసులు జారీ చేశారు. వారిని సైతం ప్రశ్నించి మరింత సమాచారం రాబట్టాలని అధికారులు యోచిస్తున్నారు.

గ్రూప్1కు 10, 12 మంది క్వాలీఫై?

ఐదురోజులుగా ప్రవీణ్, రాజశేఖర్‌ను వేర్వేరుగా విచారించిన అధికారులు కీలక సమాచారం సేకరించారు. రాజశేఖర్ ఇచ్చిన సమాచారం మేరకు సురేష్ అనే ఉద్యోగిని సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రవీణ్ గ్రూప్–1 పేపర్‌ను సురేష్‌కు ఇవ్వడంతోనే సురేష్ క్వాలిఫై అయినట్టు సిట్ అధికారులు గుర్తించారు. అంతేకాకుండా టీఎస్‌పీఎస్సీలోపని చేస్తున్న దాదాపు 10, 12 మంది ఉద్యోగులు కూడా గ్రూప్–1 పరీక్ష రాశారనీ, వారందరూ మెయిన్స్‌కు క్వాలిఫై అయినట్టు సిట్ అధికారుల విచారణలో తేలినట్టు తెలుస్తోంది. నోటీసులు అందుకున్న వారిలో ఏడుగురు రెగ్యులర్, ముగ్గురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులున్నట్టు తెలిసింది. ప్రవీణ్, రాజశేఖర్ కాంటాక్ట్స్, వాట్సాప్ చాటింగ్ వివరాలను సిట్ అధికారులు పరిశీలించారు. నిందితులకు ఇంకా ఎవరెవరితో సంబంధాలున్నాయోనని ఆరా తీశారు. ఇదిలావుండగా, ప్రశ్నపత్రాలు ఇచ్చిన రేణుకకు నీలేశ్, గోపాల్ ద్వారా రూ.13.50 లక్షలు అందినట్టు ఆధారాలను సిట్ సేకరించింది. బుధవారం విచారణ అనంతరం తొమ్మిది మంది నిందితులను సిట్ కార్యాలయం నుంచి సీసీఎస్‌కు తరలించారు.

కలకలం రేపిన వాల్ పోస్టర్లు

టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద వాల్ పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. టీఎస్‌పీఎస్సీ ఆఫీస్ ఓ జీరాక్స్ సెంటర్ అంటూ పోస్టర్లు వెలిశాయి. ఇచ్చట అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ ప్రశ్నాపత్రాలు లభిస్తాయంటూ ఓయూ జేఏసీ పేరుతో పోస్టర్లు అంటించారు. పలు డిమాండ్లతోపాటు కొన్ని ప్రశ్నలను ఈ పోస్టర్ ద్వారా లేవనెత్తారు. వారం రోజులుగా విద్యార్థిలోకాన్ని విస్మయానికి గురిచేస్తున్న టీస్‌పీఎస్సీని రద్దు చేయాలంటూ డిమాండ్ చేశారు.

మోడీ మాటలకు అర్థాలే వేరులే...!

(మొదటిపేజీ తరువాయి)

మరో సర్వే నిర్వహించలేదని ఇక్కడ అర్థమవుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం 724 మంది మహిళలు ఎన్నికల బరిలో నిలబడ్డారు. ఇందులో 82మంది గెలుపొంది సభలో అడుగుపెట్టారు. 2014 లోక్‌సభతో పోల్చుకుంటే మహిళా సభ్యుల సంఖ్య 68 నుంచి 82కు పెరిగింది. మోడీ హయాంలోని ప్రస్తుత కేంద్ర మంత్రివర్గంలో 11మంది మహిళలకు చోటుదక్కింది. ఇందులో అత్యధికం సహాయమంత్రి హోదాలే ఉన్నాయి.

పోలీస్ బలగాల్లో 10.5శాతం

రాష్ట్ర పోలీస్‌లో ఎంతమంది మహిళలు పనిచేస్తున్నారన్నది కేంద్రం తెలుపలేదు. గత ఏడాది విడుదలైన 'ఇండియా జస్టిస్' నివేదిక ప్రకారం, ఉద్యోగ నియామకాల్లో మహిళా రిజర్వేషన్లను 20 రాష్ట్రాలకుపైగా వివిధ నిష్పత్తుల్లో అమలుజేస్తున్నాయి. అయినప్పటికీ దేశవ్యాప్తంగా పనిచేస్తున్న పోలీస్ బలగాల్లో మహిళల ప్రాతినిథ్యం 10.5శాతం వద్దే ఆగిపోయింది. ఈ అంశానికి సంబంధించి గత ఏడాది బడ్జెట్ సమావేశాల్లో 'బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్' గణాంకాల్ని కేంద్రం విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం మొత్తం దేశంలో పనిచేస్తున్న పోలీస్ బలగాల్లో మహిళా ఉద్యోగుల సంఖ్య 10.3శాతముందని పేర్కొంది. అత్యధికశాతం ప్రాతినిథ్యమున్న రాష్ట్రాలుగా ..బీహార్–25.3శాతం, హిమాచల్–19శాతం, చండీగఢ్–18శాతం. .ముందు వరుసలో నిలబడ్డాయి.

తెలంగాణ జీవనగమనంలో మార్పు : హరీశ్‌రావు ట్వీట్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

సీఎం కేసీఆర్ ఆలోచనతో ప్రారంభించిన కాళేశ్వరం, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు తెలంగాణ జీవన గమనాన్ని మార్చాయని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ట్వీట్ చేశారు. అందరూ నీటి సంరక్షణ, నీటి వనరుల నిర్వహణ పద్ధతులు అవలంబించాలని కోరారు.

మినీ శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నవతెలంగాణ-ఉప్పల్
ఉప్పల్ మినీ శిల్పారామంలో శోభకృత్ నామ సంవ త్సరం ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహిం చడం జరిగింది. ప్రముఖ జ్యోతిష్యులు శ్రీ సోమనాథ శాస్త్రి ద్వాదశ రాశుల ఆదాయ వ్యయాలు, వారికి సంవత్సర జరిగే విషయాలను క్లుప్తంగా వాటికీ పరిష్కారాలను విపులంగా పంచాంగ శ్రవణంలో వివరించారు. తరువాత రేణుక ప్రభాకర్ శిష్య బృం దంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలో భాగంగా ఉగాది పాట, దశావతారాలు, అన్నమయ్య కీర్తనలు, హనుమాన్ చాలీసా, జతిస్వరం మొదలైన అంశాలను కళాకారులు ప్రదర్శించారు.

నూతన బృందావన్ కాలనీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-హయత్‌నగర్
మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను బుధవారం కార్పొరేటర్‌లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డిలు విచ్చేసి ప్రారంభించారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షులు ఎర్ర హరిబాబు, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు ఎర్ర మహేందర్, క్యాదాసు సుధాకర్, వెంకటేశ్వర్లు, సరికొండ యాదయ్య, రామచందర్, నవీన్, నరసింహ ఇతర కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ స్థలం అన్యాక్రాంతం - 30 ఏండ్లకు మోక్షం

- స్థలంలో బోర్డు ఏర్పాటు చేస్తున్న పాలకమండలి
- చైర్మెన్ ఈశ్వరమ్మ యాదవ్, ఈఓ శ్రీనివాసశర్మ
- గుడెసెలు తొలగించి స్వాధీనం



నవతెలంగాణ-సంతోష్‌నగర్
ముప్పై ఏళ్లుగా అన్యాక్రాంతమైంది. కోర్టు ఉత్తర్వులతో రూ.20కోట్ల విలువైన స్వామివారి స్థలానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి ఆలయానికి చెందిన సర్వే నంబర్ 150లో 15 గుంటల భూమిని కొందరు ఆక్రమించారు. దీంతో ఆలయ పాలకమండలి న్యాయపోరాటం చేసి ఎట్టకేలకు విజయం సాధించింది. కోర్టు ఇటీవల తీర్పు వెల్లడించింది. ధ్యానాంజనేయ ఆలయ పాలకమండలి చైర్మెన్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, ఈఓ శ్రీనివాసశర్మ న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం సోమవారం ఉదయం కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, సరూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుతో ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎల్బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఎల్బీనగర్, వనస్థలిపురం ఏసీపీలు శ్రీధర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, సరూర్నగర్ సీఐ జానకీరాంరెడ్డి, ఫైర్ అధికారులు, విద్యుత్, ఆరోగ్యశాఖ అధికారులతో పాటు దాదాపు వందమంది పోలీసులు అక్కడకు చేరుకున్నారు. స్వాధీనం చేసుకున్న స్థలంలో ఆలయ సిబ్బంది బోర్డు ఏర్పాటు చేశారు. భోజనశాల లేదా ఇతర మౌలిక సదుపాయాలకు ఉపయోగించాలనే ఆలోచన ఉన్నట్లు పాలకమండలి ప్రతినిధులు తెలిపారు. త్వరలోనే స్థలం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఆలయ స్థలానికి 30ఏళ్లకు మోక్షం లభించడంతో పాలకమండలి ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. స్థలం స్వాధీనానికి సహకరించిన ఆయా శాఖల అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి ధర్మకర్తలు మొరిశెట్టి శ్రీనివాసగుప్తా, చెగోని మల్లేష్‌గౌడ్, యాదిరెడ్డి, అఖిలామధుసాగర్, అనిత, రెడ్డి, సర్రె శ్రీనివాస్ పాల్గొన్నారు.

పునరావాసం చూపించాలి

ఎన్నో ఏళ్లుగా ఈ స్థలంలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నామని.. తమను ఆదుకోవాలని పలువురు నిరుపేదలు సోమవారం ఉదయం ఆర్డీవోను వేడుకున్నారు. ఎక్కడైనా పునరావాసం కల్పించాలని వారు కోరారు.
ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు చేపడతామని ఆర్డీఓ వారికి హామీ ఇచ్చారు.

బస్తీ దవాఖానాలను సద్వినియోగం చేసుకోవాలి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్
రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి, సుస్తీ నయం చేయటానికే బస్తీ దవఖానాలు ఏర్పాటు చేయటం జరిగిందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో ప్రతి 10 వేల జనాభాకు ఒక బస్తీ దవాఖాన, 50వేల జనాభాకు ఒక అర్బన్ పీహెచ్‌సి ఏర్పాటుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని, పేద ప్రజల చెంతకు వైద్యం తీసుకెళ్లటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆరోగ్య తెలంగాణ కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో 73 బస్తీ దవాఖానాలు మంజూరు కాగా, అందులో ఇప్పటికే 57 ప్రారంభం అయ్యాయని, మిగతావి కూడా త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా 27 యూపీహెచ్‌సీలు కూడా మంజూరు అయ్యాయన్నారు.
ఈనెల 24న సీపీఆర్‌పై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు, బస్తీ దవాఖాన ప్రోగ్రాం ఇన్‌చార్జ్ వినోద్, జిల్లా ట్రైనింగ్ అధికారి అనిత తదితులున్నారు పాల్గొన్నారు.



నగరంలో ఈనెల 29న 'టీడీపీ ఆవిర్భావ దినోత్సవం' వేడకలు నిర్వహిస్తున్న నేపథ్యంలో విజయవంతం చేసేందుకు బుధవారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు, మాజీ చైర్మెన్ పిన్నంనేని సాయిబాబాతోపాటు నగర నాయకులు హాజరై వివిధ అంశాలపై చర్చించారు.
- నవతెలంగాణ, సిటీబ్యూరో

తీన్మార్ మల్లన్నతో సహా నలుగురు రిమాండ్

పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే కేసు నమోదు
ఇది ముమ్మాటికీ నియంతృత్వ విధానమే
టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



నవతెలంగాణ-బోడుప్పల్
క్యూ న్యూస్ నిర్వాహకుడు తీన్మార్ మల్లన్నతో క్యూ న్యూస్ ఉద్యోగులు నలుగురిపై కేసులు నమోదు చేసిన పోలీసులు బుధవారం నాడు మేజిస్ట్రేటు ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం నాడు సాయంత్రం సమయంలో పీర్జాదిగూడ రాఘవేంద్రనగర్‌లో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులను బలవంతంగా క్యూ న్యూస్ కార్యాలయంలోకి తీసుకువెళ్లి నిర్బంధించారనే అంశంపై ఫిర్యాదు రావడంతో క్యూ న్యూస్ నిర్వాహకుడు తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్) నలుగురు క్యూ న్యూస్‌లో పనిచేసే బండారు రవీందర్, ఉప్పల నిఖిల్, సిర్రా సుధాకర్, చింత సందీప్ కుమార్‌లపై 363, 432, 395, 332, 307, రెడ్ విత్ 34 ఐపీసీ,సెక్షన్ 7(1) నేర సవరణ చట్టం 1932 ప్రకారం కేసులు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచిన అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. ముమ్మాటికీ నియంతృత్వ ధోరణే-తెలంగాణ రాష్ట్రంలో సర్కారు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తనదైన శైలిలో ప్రశ్నిస్తున్న తీన్మార్ మల్లన్నపై తప్పుడు కేసులలో ఇరికించి అరెస్టు చేయడం నియంతృత్వ ధోరణేనని టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మల్లన్న అరెస్టు విషయం తెలుసుకున్న ఆయన కాంగ్రెస్ నేతలతో పాటు మల్లన్న నివాసానికి వెళ్లి సంఘీభావం తెలిపారు. మల్లన్న కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

అష్టలక్ష్మి దేవాలయంలో ఉగాది నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సరూర్‌నగర్2
అష్టలక్ష్మి దేవాలయంలో ఉగాది నూతన సంవత్సర క్యాలెండర్, పంచాంగం వేద పండితుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్మెన్ సోమా సురేష్ కుమార్, ఫౌండర్ చైర్మెన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ గుప్త, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, సుధాకర్, పీవీసీ యాజమాన్యం నిల జయదేవ్, అనంతుల దయాకర్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి పంచాంగము క్యాలెండరు ఆవిష్కరించారు.



పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ అంజనేయ స్వామి ఆలయంలో జరిగిన ఉగాది ఉత్సవాలలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై ఉగాది ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో, పాలకమండలి సభ్యులు, కార్పొరేషన్ కార్పొరేటర్లు పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు.
– నవతెలంగాణ,బోడుప్పల్



ఉగాది పండుగ సందర్భంగా టూరిజం అభివృద్ధి సంస్థ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తాకు పండగ శుభాకాంక్షలు తెలిపిన రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ మైనార్టీ లీడర్ ఎస్‌కే మహ మూద్. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వరరావు పాల్గొన్నారు.
-నవతెలంగాణ, సరూర్‌నగర్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

ఎల్మేటి అమరేందర్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్
కేంద్రంలో, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి సాధ్యం మవుతుందని టీపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అమరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజక వర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాజీ నగర్ నుండి సుమారుగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మహిళలు, యువకులు కలిసి కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులై అమరేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి అక్రమాలకు పాల్పడి ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకు రావటానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ మైనారిటీ సెల్ చైర్మెన్ అహ్మద్ బామ్, నాయకులు వంగేటి మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు, సాయిగౌడ్, చారి, బల్వంత్ నాయక్, జగదీష్ నాయక్, చందు నాయక్, నాని నాయక్, దేశీ నాయక్, అంబాలిక నాయక్, మరియు మంజుల నాయక్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అధికారులతో సమీక్ష సమావేశం



నవతెలంగాణ-ఉప్పల్
హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి ఆదేశాల మేరకు జీహెచ్ఎంసి లోని అన్ని యానిమల్ కేర్ సెంటర్స్‌ని గత నాలుగు వారాలుగా పర్యవేక్షించిన తర్వాత హై లెవెల్ కమిటీ మెంబర్స్ మరియు అన్ని జోన్‌ల వెటర్నరీ అధికారులతో సమావేశం కావడం జరిగింది. ఈ సమావేశంలో జీహెచ్ ఎంసీలోని అన్ని జోన్‌లలో కావలసిన వెటర్నరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది కొరత, పబ్లిక్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మొదలగు అంశాలపై సుదీర్ఘ చర్చ చేయడం జరిగింది. దీనిపై పూర్తి రిపోర్ట్ తయారుచేసి త్వరలో కార్యరూపం దాల్చడానికి మేయర్‌కి అందజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో హై లెవెల్ కమిటీ మెంబర్స్ మరియు అన్ని జోన్ల వెటర్నరీ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడానికే చలివేంద్రాలు

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్
సమాజంలో ప్రజల దాహార్తని తీర్చటానికి వేసవి కాలంలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజక వర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మల్లాపూర్‌లో స్థానిక నాయకులు రియాసత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బంగారు బాబు, కార్పొరేటర్ బాలునాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకురావటానికి సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, వెంకటాపూర్ మాజీ సర్పంచ్ బొర్ర జగన్‌రెడ్డి, నాయకులు ప్రవీణ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు భాధితుల సమస్యపై పార్లమెంటులో ప్రస్తావించాలి

టీ.పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందించిన సమాఖ్య సలహాదారు



నవతెలంగాణ-బోడుప్పల్
బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వక్ఫ్ బోర్డు స్థలాల పేరిట ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించడానికి టీ.పీసీసీ చీఫ్‌గా, స్థానిక పార్లమెంటు సభ్యుడిగా చొరవ చూపాలని సమాఖ్య ముఖ్య సలహాదారు కల్యారి రాములు కోరారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసంలో కలిసి సమస్యకు సంబంధించిన అంశంపై వివరించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు భూ బాధితులు తమ సమస్య పరిష్కారం కోసం వివిధ రూపాలలో అనేక రోజులుగా ఆందోళనలు చేస్తున్న విషయాన్ని రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 350 ఎకరాలలోఎలాంటి క్రయవిక్రయాలు జరుగకుండా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని, దీంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యను స్థానిక పార్లమెంటు సభ్యులుగా చొరవ చూపి సీఎం కేసీఆర్, సంబంధిత అధికారులకు లేఖ రాయాలని కోరారు. దీనిపై ఎంపి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. వెంటనే సీఎం కేసీఆర్, సంబంధిత అధికారులకు తాను పార్లమెంటు సభ్యునిగా లెటర్ రాస్తున్నాని చెప్పారు.

పరీక్షల సమయంలో పిల్లలకు డైట్ ఫుడ్

ఇలా చేస్తే పదిలో గెలుపు మీదే

నవతెలంగాణ-హయత్‌నగర్
తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ నుంచి జరగనున్నాయి. చాలా మంది పిల్లలు సరైన ప్రణాళికలు వేసుకోక చివరి నిమిషంలో ఏదిపడితే అది చదివేస్తుంటారు. చివరి రోజుల్లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో కొన్ని సూచనలు, సలహాలు తెలుసుకుందాం.



మైండ్ మ్యాపింగ్
విజువల్ లెర్నింగ్ పద్ధతిలో మైండ్ మ్యాపింగ్ ఒకటి. ఈ పద్ధతిలో చదివింది చాలా సులభంగా గుర్తుండే అవకాశం ఉంటుంది. పరీక్షలు రాసే వారు ఏ అంశాన్ని అయినా సరే విజువల్ రూపంలో గుర్తుకు తెచ్చుకుంటే చాలా రోజులు గుర్తుకు ఉంటుంది.

ఫేన్‌మాన్ టెక్నిక్: ఫేన్‌మాన్ టెక్నిక్‌ని పాటించి చాలా మంది సక్సెస్ అవుతున్నారు. సింపుల్‌గా చెప్పాలి అంటే మొదటగా చాప్టర్స్‌ను విడగొట్టాలి. మనకు అర్థం కాని వాటిని గుర్తించాలి. వాటిని అర్థం చేసుకునేలా ప్రిపేర్ అవ్వడమే ఫేన్‌మాన్ టెక్నిక్.

పరీక్షల సమయంలో డైట్ ఫుడ్ తినాలి
విద్యా సంవత్సరం ముగుస్తుండడంతో ఈ సమయంలో విద్యార్థులకు పరీక్షలు ఉంటాయి. పిల్లలు పరీక్షల కోసం ఎంత చదివినా, ఎంత శ్రమించినా ఆరోగ్యం సహకరించకపోతే ఏడాదంతా వృధా అవుతుంది. అంతే కాదు ఎండ తీవ్రత కూడా ఈ సమయంలో ఎక్కువగా ఉంటుంది. ఇంట్లోనే కూర్చొని ఎక్కువగా చదువుతుంటారు. మంచి పోషకాహారం పిల్లలకు ఇవ్వాలి. బ్రెయిన్ దానికి అందే గ్లూకోస్, రక్త ప్రసరణపై ఆధారపడి పనిచేస్తుంది. ఎక్కువగా ఆహారం తీసుకున్నా, అసలు ఆహారం తీసుకోకపోయినా మెదడు పని మీద ప్రభావం చూపుతుంది. పిల్లలు ఉన్న బరువు, ఎగ్జామ్స్ ప్రిపరేషన్స్ టైంను బట్టి వారికి ఆహారం ప్లాన్ చేసుకుని అందించాలి. లేదంటే రెండు, మూడు వారాల్లో అధిక బరువు పెరుగుతారని న్యూట్రీషన్స్ చెబుతున్నారు. విటమిన్లు, మినరల్స్ అన్నీ అందేటట్లు ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు సహజ సిద్ధమైన వాటిని ఎక్కువగా ఇవ్వాలి. పిల్లలు వేపుళ్ళకు దూరంగా ఉండాలి. ఒకేసారి ఆహారం ఎక్కువగా తీసుకోకుండా కొంచెం, కొంచెం సమయానికి తినాలి. కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉండి, ఫైబర్ అధికంగా ఉండే పదార్థాలు తినాలి. ఈ సమయంలో జ్ఞాపకశక్తి పెంపొందించే ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాట్స్ ఎక్కువగా ఉండే పదార్థాలు తినాలి. ఆరంజ్, ద్రాక్ష, అరటి, యాపిల్ పండ్లు తినడం వల్ల పరీక్షల సమయంలో వుండే ఒత్తిడిని నివారించవచ్చు. అదే పనిగా చదవకుండా ప్రతి గంటకు 10 నిమిషాలు విరామం పరీక్ష కేంద్రాలు ఎక్కువ దూరం ఉంటే డీ హైడ్రేషన్ కాకుండా వాటర్ బాటిల్, మజ్జిగ, కొబ్బరి నీళ్ల తాగి వెళ్ళాలి. పరీక్ష కేంద్రంలో కి వెళ్ళే ముందు కొద్దిగా స్నాక్స్ తినాలి.

ఉదయం : ఉదయాన్నే ఒక గ్లాస్ పాలతో డైట్ ప్రారంభించాలి. ఉదయం 8గంటలకే బ్రేక్ ఫాస్ట్ తినాలి. ఎక్కువగా ఆయిల్ లేకుండా చపాతీ, పెసరట్టు, గింజలు, మిల్లెట్స్, జావ వంటివి తీసుకోవాలి. తర్వాత11గంటలకు పండ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్ల పిల్లలకు అందించాలి.

మధ్యాహ్నం : మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో భోజనాన్ని పూర్తి చేయాలి. ఇందులో సలాడ్స్, రోటీ, కొంచం అన్నం, వెజిటబుల్స్, కర్రీ, మిల్‌మేకర్, సోయా, మాంసం తీసుకున్నప్పుడు ప్రత్యేకంగా పప్పు అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. సాయంత్రం 3,4గంటలకు స్నాక్స్ తినాలి.

రాత్రి : రాత్రి వేళల్లో సాధ్యమైనంత వరకు రైస్ తీసుకోకుండా చపాతీతో కాయగూరలు తీసుకోవాలి. రాత్రి భోజనంలో పాలు, గుడ్లు చీజ్‌ను భాగంగా చేసుకోవాలి. మధ్యాహ్నంతో పోల్చుకుంటే రాత్రి తక్కువగా తినాలి.



ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీరు

పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



నవతెలంగాణ-బడంగ్‌పేట్
మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్‌లోని జల్‌పల్లి గ్రామం 16వ వార్డులో గత కొంతకాలంగా రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తున్నా మున్సిపల్ అధకారులు, ప్రజా ప్రతినిధులు ఎవ్వరు పట్టించుకోవటంలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎంతో కాలంగా ఒక పక్క రోడ్డు మరమ్మతులు, మరోపక్క మురికి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నాయని, ఆ మురికి నీటిలో దోమలకు నిలయంగా మారుతోందని, అంతేకాకుండా దుర్గంధపు వాసనతో స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులు విన్నవించినా ఎవ్వరు పట్టించుకోవటంలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేసి ఆదుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బుధవారం మంత్రి నివాసంలో ఉగాది పండుగ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి దంపతులకు కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ చైర్మెన్ తటకం రమేష్ శర్మ ,వేద పండితులు స్వామి వారి ఆశీర్వాదం, మహా ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్ పురం సుధాకర్ రెడ్డి ,ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉగాది పచ్చడి పంపిణీ చేసిన మహేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని పలు దేవాలయాల్లో ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీల రాజకీయ నాయకులు ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు దేవాలయాలలో మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడి ప్రసాదాలను పంపిణీ చేశారు.

రహదారులపైనే చెత్త పారబోత

- వినాయక్‌నగర్, నేరేడ్ మెట్ పరిధిలో పేరుకుపోతున్న చెత్త
- భరించలేని దుర్గంధం
- మూగజీవాలకు ఆవాసంగా మారిన వైనం
- డస్ట్ బిన్‌లు సరిగ్గా ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-నేరేడ్ మెట్ :

వినాయక్‌నగర్, నేరేడ్‌మెట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారిపై గత కొద్దిరోజులుగా చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతుంది. ఇండ్లలోని చెత్త చెదారం తెచ్చి రోడ్లపై పారబోస్తుండటంతో ప్రధాన రహదారులు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. కంపు కొడుతోంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల డస్ట్ బిన్స్ సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో స్థానికులు, వ్యాపారులు చెత్తను రోడ్ల పై పారబోసి వెళ్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు పరిసరాల పరిశుభ్రతతో తమకు ఏ మాత్రం సంబంధం లేనట్లు వ్యవహరిస్తోందని ఆరోపణలు వస్తున్నాయి.

మల్కాజిగిరి నుంచి నేరేడ్‌మెట్ వరకూ ప్రధాన రహదారులలో సమీప కాలనీల వాసులు తమ ఇండ్లలోని చెత్త చెదారంతో పాటు మిగిలి పోయిన ఆహార పదార్థాలు పార వేయ డంతో అవి మురిగిపోయి దుర్వాసన వెదజల్లు తోందని పలు వురు వాపోతున్నారు. చెత్తతోపాటు మిగిలి పోయిన ఆహార పదార్థాలను పారవేయ డంతో ఆవులు, కుక్కలు, పందులు చేరి వాటిని తింటున్నాయని.. ఆకలి తట్టుకోలేక ప్లాస్టిక్ కవర్లు కూడా ఆరగిస్తున్నాయన్నారు. చెత్తను రోడ్డంతా చెల్లాచెదురు చేస్తున్నాయని తెలిపారు. అసలే ఈ మధ్యన ఒక వైపు వర్షాలు కురుస్తుండడంతో ఈ చెత్త కుప్పల్లో నీరు నిలిచి ఈగలు, దోమల వద్ధి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. తమ పనులు కోసం ఈ రోడ్డు మార్గం గుండా అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తున్నా ఇంత వరకూ ఈ సమస్యను పట్టించుకున్నవారే లేరని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతి నిధులు ఈ చెత్త కుప్పలపై దష్టిసారించి తగు చర్యలు తీసుకో వాలని కోరుతున్నారు. డస్ట్ బిన్ లు ఏర్పాటు చేసి , వాటి చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి మూగజీవాలు చేరకుండా, అవి ప్లాస్టిక్ కవర్లు తిన కుండా వాటి ఆరోగ్యాలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నకిలీ ధ్రువపత్రాలు విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టు

- నలుగురు నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-జవహర్‌నగర్

అమాయక నిరుద్యోగ విద్యార్థులను ఆసరాగా చేసుకొని నకిలీ విద్యా ధ్రువపత్రాలను అమ్ముతూ అక్రమంగా డబ్బులు సంపాదిస్తున్న ముఠాను మల్కాజిగిరి ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఓటీ సీఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్ నగర్ కార్పొరేషన్‌కు చెందిన నలుగురు సభ్యులు సులభంగా డబ్బులు సంపాదించాలని ముఠాగా ఏర్పడి షాంపై ఇంటర్నేషనల్ యూనివర్సిటీ మణిపూర్, సర్వేపలి_రాధాకష్ణ యూనివర్సిటీ జతేడీ, భోపాల్, వినీయంకేరీ యూనివర్సిటీల నుంచి నకిలీ విద్యా ధ్రువపత్రాలను సేకరిస్తూ అమాయకులకు అమ్ముతూ భారీగా డబ్బు సంపాదిస్తున్నారు. ఎస్ఓటీ పోలీసులు స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగా నకిలీ ధ్రువపత్రాల రాకెట్‌ను పట్టుకున్నారు. నిందితులు బర్ల శంకర్రావు, భానుచందర్రెడ్డి, తిరుపతి శ్రవణ్కుమార్, దాయక సాయిలను అరెస్ట్ చేసి వారి నుంచి 25నకిలీ విద్యా సర్టిఫికేట్లు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సహజ పానీయాలు ఆరోగ్యానికి మంచిది

- టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి
- జేవీవీ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



నవతెలంగాణ-కాప్రా

సహజ పానీయాలు ఆరోగ్యానికి మంచిదని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా కూల్ డ్రింక్స్ వద్దు, సహజ పానీయాలు ముద్దు అని నినాదంతో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమాన్ని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్ఐ నాగేంద్రప్రసాద్, జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటి యువతరం కూల్ డ్రింక్స్ అలవాటు పడి అనారోగ్యానికి గురై అవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో పానకం, నిమ్మరసం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు సహజ పానీయాలు తాగుదామని.. కూల్ డ్రింక్స్ మానేద్దామని జనవిజ్ఞాన వేదిక ప్రచారంలో భాగంగా ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కుషాయిగూడ ట్రాఫిక్ ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. జేవీవీ వారు కరపత్రం ద్వారా ప్రచారం నిర్వహిస్తూ, ఉగాది పచ్చడి పంపిణీ నిర్వహించడం అభినందనీయమన్నారు. మనము ఏమి చేయాలన్నా ఆరోగ్యంగా ఉండటం ప్రధానమన్నారు. నాకు ఇప్పటివరకు కూల్ డ్రింక్స్ అలవాట్లేదని తెలిపారు. ఆరోగ్యంగా ఉండాలంటే కూల్ డ్రింక్స్ మానేద్దాం, సహజ పానీయాలు తాగుదాం అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎండాకాలం వచ్చిందంటే ఎండ తీవ్రతకు చాలా మంది ప్రజలు కూల్ డ్రింక్స్ వైపు మొగ్గు చూపుతారని.. కూల్ డ్రింక్స్ వల్ల చాలామంది అనారోగ్య పాలవుతున్నారని తెలిపారు.మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని సహజ పానీయాలు తాగుదాం అనే ప్రచారంలో పాల్గొన్న ముఖ్య అతిథులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు, ప్రతీ ఒక్కరికి ధన్య వాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కేసీఆర్ దాస్, దుర్గాచారి, నరసింహారావు, శేషు, సోమయ్యచారి, శ్రవణ్, జి.కె.రెడ్డి, వెంకయ్య, ప్రభాకర్, శివ శంకర్ రెడ్డి, శివప్రసాద్, రామ్ మోహన్ రావు, పరమేశ్వర్, నాగేశ్వరరావు, బసవ పునయ్య, వెంకట్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పంచాంగం శ్రవణం కన్నా రాజ్యాంగ పఠనం మిన్న'

- ఈసీఐఎల్‌లో మాటా పాట కవితలతో కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో తెలుగువారి నూతన సంవత్సరం ఆరంభం ఉగాది సందర్భంగా "పంచాంగం శ్రవణం కన్నా రాజ్యాంగ పఠనం మిన్న"కార్యక్రమం మాటా పాట కవితలతో ఈసీఐఎల్‌లోని కమలానగర్ ఆఫీసులో జరిగింది. కార్యక్రమానికి సామాజిక ఉద్యమ నాయకులు ప్రసాద్ బాబు అధ్యక్షత వహించారు. ముందుగా సమాచార హక్కు సాధన కమిటీ నాయకులు గగన్ కుమార్ ఆహ్వానితులను వేదిక మీదికి ఆహ్వానిం చారు. ప్రారంభ గీతంగా దేశభక్తి గీతాన్ని స్ఫూర్తి గ్రూప్ నాయకులు రుక్కయ్య ఆలపించారు. అధ్యక్షులు ప్రసాద్ బాబు మాట్లాడుతూ ప్రజలను చీలిక తీసుకువస్తున్న మతవాదాన్ని అనుసరించే పంచాంగం ప్రజలను అనేక మభ్యలు పెడుతున్నదని.. దాని స్థానంలో భారత రాజ్యాం గం పఠనం ఎంతో అవసరమని చెప్పారు. ముఖ్య వక్తగా విచ్చేసిన ప్రముఖ రచయిత్రి పీ జ్యోతి మాట్లాడుతూ దేవునిపై నమ్మకం వ్యక్తిగతమని, దాని పేరు మీద జాత కాలు పంచాంగాలు వివిధ రూపాలలో ప్రజలను అనేక రకాలుగా మూఢనమ్మకాల్లోకి తీసుకు వెళుతున్నారని తెలి పారు. విద్యార్థుల్లో కూడా స్వాతంత్ర దినోత్సవానికి రిపబ్లిక్ దినోత్సవానికి తేడా తెలియని స్థితి ఉందని దాన్ని మార్చ వలసిన అవసరం ఉందని చెప్పారు. ప్రజల్లో మూఢన మ్మకాలు పెంచి పోషిస్తున్న స్వాములు, పూజారులు అనేక రకాలుగా భయభ్రాంతులకు గురిచేసి మానసిక వైకల్యానికి కారణమవుతున్నారని చెప్పారు. నేడు యువత పబ్బుల్లో నాగరిక డ్రెస్సులో వచ్చినప్పటికీ కాళ్లకు నల్లటి దారాలు కట్టుకొని నత్యాలు చేస్తున్నారని, పాత నమ్మకాలైన దిష్టి దోష మని, మరోపక్క నవ నాగరికం వ్యవహారాలు నడుపుతు న్నారని ఇది మరో రకమైన మూఢత్వానికి తీసుకు వెళుతున్నారని చెప్పారు. తర్వాత కార్యక్రమం మాట పాట కవి త్వం కార్యక్రమాన్ని స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరి రావు నిర్వహించారు. ముందుగా ప్రముఖ కవి ఆచార్యులు తమ కవితలు చదివి వినిపించారు.ఎంటాక్ మీడియా వ్యవస్థాపకులు సీహెచ్ నాగేశ్వరావు రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌ను, జై భీమ్ నినాదాన్ని ఉటం కిస్తూ హిందీలో చక్కని పాట పాడారు. జానపద కళాకారుల నాయకులు భాస్కర్ కవిత పాట పాడారు. ప్రముఖ కళాకారులు సోమయ్య , నారాయణ శర్మ పౌరాణిక నాటకా లలోని పద్యాలు పాడి వినిపించారు. ప్రముఖ విద్యావేత్త మల్లేష్ మూఢనమ్మకాలను త్యజించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సమాన అవకాశాలపై, సైంటిఫిక్ టెంపర్ ప్రచారం చేయవలసిన అవసరాన్ని అందరికీ వివరించారు. చిన్నారులు మౌనశ్రీ, సహస్ర,తమ చిన్ని గళంతో చక్కని పాటలు పాడారు. శ్రీ మున్నయ్య పద్యం వినిపించారు. చల్లా లీలావతి దేవుల పల్లి కృష్ణశాస్త్రి రాసిన పాటను పాడి వినిపించారు. ప్రముఖ సామాజిక ఉద్యమ నాయకులు నర్సింగ్ రావు గోరేటి వెంకన్న పాటను పాడి వినిపించారు. ఐలన్న కవితను చదివి వినిపించారు.గొడుగు యాదగిరిరావు తన కవితలు చదివగా ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడారు. రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞగా అందరితో చేయించారు. స్ఫూర్తి గ్రూప్ నాయకుల భాషా వందన సమర్పణతో సభ ముగిసింది. శారద ఉగాది పచ్చడి అందరికీ అందించి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీమన్నారాయణ వెంకట్ వెంకటేశ్వరరావు, ప్రభాకర్, శ్రీనివాసరావు, ప్రసాద్, బీడీఎల్ నాయకులు విజయ్ కుమార్ , శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్, ఉన్నికష్ణన్ సమ్మయ్య, కొండయ్య, రాఘవరావు, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద్దలను విద్యార్థులు గౌరవించాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

నవతెలంగాణ-కాప్రా

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మీర్‌పేట్ హెచ్.బి కాలనీ డివిజన్ ఫేజ్ వన్ ప్లే గ్రౌండ్‌లో సెయింట్ జార్జ్ హై స్కూల్ వార్షికోత్సవం వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల శ్రేయస్సు కోసం కషి చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.ఈ కార్యక్రమంలో సెయింట్ జార్జ్ హై స్కూల్ కరస్పాండెంట్ స్వరూప్ రెడ్డి, కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, సతీష్ మేరు, జబర్దస్త్ కామెడీ షో కమెడియన్స్ భాస్కర్, నరేష్ , మహిళలు, విద్యార్థిని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌ను కలిసిన నాయకులు

నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్‌ను కైలాసగిరి సంక్షేమ సంఘ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ ఈ శోభకత్ నామ సంవత్సరం అందరి జీవితాలలో ప్రగతి శోభను నింపాలనీ, కొత్త సంవత్సరం మీ ఇంటిల్లిపాదికీ సంతోష సౌభాగ్యాలను ప్రసాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు జంగా బాలరాజు, సెక్రటరీ రామక్రిష్ణ, కార్యవర్గ సభ్యులు బాల్ నర్సింహ, రాందాస్ నాయక్, మల్లికార్జున్, శాంసన్, యాకూబ్, ఆదాం, జయరాజు, ఆంజనేయులు శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం

- మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి
- నాగారంలో చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషమని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలీ్టీ పరిధిలోని సత్యనారాయణ కాలనీలో 16వ వార్షిక చలివేంద్రంను చైర్మెన్ ప్రారంభించారు.కార్యక్రమంలో వైస్ చైర్మెన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్, ఎస్ఐ జగన్‌రెడ్డి, అన్నంరాజు సురేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన



నవతెలంగాణ-నాచారం

మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద తెలం గాణ తల్లి విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు తల్లిగా కొలుచుకునే తెలంగాణ తల్లి విగ్రహాన్ని మల్లాపూర్‌లో ఏర్పాటు చేయడం శుభపరిణామం అని అన్నారు. తెలంగాణ తల్లి ఖ్యాతిని ప్రజలకు తెలిపేందుకు ఎలిఫెంట్ సర్కిల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పళ్ళ కిరణ్ కుమార్ రెడ్డి, మల్లేష్, శ్రీనివాస్, బెల్లం గట్టయ్య, గడ్డం రవి, సుధాకర్, శీతల విజయ్, శీతల వీరస్వామి, పర్వతాలు, వెంకటేశ్వర రెడ్డి, దుర్గయ్య, దొడ్డి మల్లేష్, శ్రీశైలం, కుందన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

అంబర్ పేట నియోజకవర్గంలో బాగ్ అంబర్ పేట డివిజన్ పరిధిలో బతుకమ్మ కుంట మైసమ్మ ఆలయంలో ఘనంగా ఉగాది వేడుకలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ కోట్ల శివకుమార్, అరుణ్, కిరణ్ కుమార్, అద్విక పటేల్, ఆస్విక, పల్లవి, గాయత్రి. తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతికి ఉగాది ప్రతీక

- మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్



నవతెలంగాణ-జవహర్ నగర్

భినత్వంలో ఏకత్వాన్ని చాటి చెప్పే భారతీయ సంస్కృతికి ఉగాది ప్రతీక అని మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ అన్నారు. బుధవారం జవహర్ నగర్ కార్పొరేషన్‌లోని బీరప్ప దేవాలయంలో అధ్యక్షుడు మండల సురేందర్ కురుమ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ కాలాన్ని గౌరవించడం, ప్రకతిని పరిరక్షించడమే ఉగాది సందేశమని తెలిపారు. ఉగాదితోనే తెలుగు వారికి కొత్త సంవత్సరం ప్రారంభమవుతుందని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. షడ్రుచుల పచ్చడి, ఆయాకాలాల్లో వచ్చే అనారోగ్యాలను హరించడంతో పాటు గొప్ప వ్యక్తిత్వ వికాస పాఠాన్ని సందేశంగా ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి మేయర్, కార్పొరేటర్లు లావణ్య సతీష్ గౌడ్, నిహారికగౌడ్,

వేణు, లలితాయాదవ్, ఎస్సైలు అనిల్ కుమార్, నాగరాజ్ గౌడ్,అనిల్ రెడ్డి, కాంగ్రెస్ స్థానిక అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, పూడురు చందర్, నర్సింహాయాదవ్, సాధిక్, రమేషాచారి, అశోక్ గుప్తా, ముదిరాజ్ మహసభ యూత్ అధ్యక్షుడు అనిల్కుమార్ ముదిరాజ్, ప్రజా గాయకుడు వెంకటచారి, మాజీ ఎంపీటీసీ రషీదాబేగం, కురుమ సంఘం నాయకులు ప్రవీణ్, చంద్రయ్య, బిక్షపతి, ఎల్లయ్య, నర్సింహా, మీనయ్య, ఐలయ్య, వెంకటేష్, రవీందర్, నవీన్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మేయర్, కార్పొరేటర్‌లకు ఉగాది శుభాకాంక్షలు

నవతెలంగాణ-కాప్రా

ఉగాది పండుగ సందర్భంగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ని రెడ్డిలను వారి నివాసంలో చక్రిపురం కాలనీ అధ్యక్షులు మొగిలి రాఘవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి కట్యూరి బుచ్చిరెడ్డి, డీఎం కొండారెడ్డి, ఎం జగన్మోహన్ రెడ్డి, ఎనిశెట్టి వెంకటేష్, జి పాండు ,తదితరులు పాల్గొన్నారు.



మాజీ మేయర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మాజీ మేయర్‌ను కలిసిన చక్రిపురం కాలనీ నాయకులు

అలాగే మాజీ మేయర్ రామ్మోహన్, స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను వారి నివాసంలో బీఆర్ఎస్ నాయకులు బాల్ రెడ్డి,ప్రభు గౌడ్, రాజేశ్వర్ రెడ్డి, కనక రాజ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, రాఘవ రెడ్డి, గోపీ, శ్రీనివాస్, నర్సింగ్, విజయ్, ధనుంజయ గౌడ్ తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



అసోసియేషన్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-నాచారం

కాప్రా సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ డివిజన్ గోకుల్ నగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ముగ్గురమ్మల దేవాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులుగా టీ మల్కయ్య, ప్రధాన కార్యదర్శిగా శివరాం ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కష్టారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీగా రాజు, కోశాధికారిగా శంకర్ రావు, ఉపాధ్యక్షులుగా రమణారెడ్డి, బిక్షపతి, జాయింట్ సెక్రెటరీగా సునీల్, రాఘవేంద్ర రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్, వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా మూర్తి, వెంకటేశ్వరరావు, తిరుపతి, దేవకుమార్, శ్రీనివాస్‌లతో ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షులు మల్కయ్య మాట్లాడుతూ కాలనీ సమగ్ర అభివద్ధి కోసం ప్రజలందరూ సహకరించాలని కోరారు. గోకుల్ నగర్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అర్చకులకు వస్త్రాలు, పంచాంగాలు అందజేత



నవతెలంగాణ-నేరేడ్ మెట్

ఉగాది పండుగ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవి యాదవ్ అర్చకులకు వస్త్రాలు, పంచాంగాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "సర్వేజన్నా సుఖినోభవంతు" "సమస్త సన్మంగళాని భవంతు" అని మన్ఫపూర్వకముగా ఆశీర్వదించే అర్చకులను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అర్చక పురోహితులతో పాటు, బీజేపీ స్థానిక నాయకులు మంగేష్ లక్ష్మణ్ గౌడ్, కన్నయ్య యాదవ్, ఈగ లావణ్య కష్ణ, సర్వేష్ యాదవ్, భాస్కర్, జెనిగే అశోక్ యాదవ్, మణిరత్నం, ఆకారం సాయిరాం, సురేందర్ యాదవ్, సూర్యకాంత్ బిరదర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నాచారం

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ జన్మదిన వేడుకలను బుధవారం బీజేపీ, నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్ ఆధ్వర్యంలో నాచారం డివిజన్ నాయకులు తరలివెళ్లి ం ఉగాది శుభాకాంక్షలతో పాటు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి నేను రవి నాయక్, డివిజన్ అధ్యక్షులు ప్రకాష్, నాయకులు హనుమంతు బీదర్, నరసింహ రెడ్డి, అనిత రెడ్డి, నవీన్ గౌడ్, అభిషేక్ గౌడ్, వెంకటేష్ గౌడ్, క్రాంతి కుమార్, మోహన్ రెడ్డి, నవీన్ కుమార్, గోపి, యోగేశ్వర్ రెడ్డి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను కలిసిన ఆలయ కమిటీ ప్రతినిధులు



నవతెలంగాణ-నాచారం

నాచారం డివిజన్ పరిధిలోని నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ ప్రతినిధులుఉగాది శుభకృత్ నామ పురస్కరించుకొని జీహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుభకత నామ తెలుగు సంవత్సరం ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని కోరారు. ఆలయ నూతన కమిటీ ఈనెల 26న ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు తెలిపి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, చంద్రశేఖర్, ఉమామహేశ్వర చారి, శ్రీనివాస్ నాయక్, ప్రభాకర్, శ్రీధర్, రాములు, సురేందర్ స్వామి, దత్తన్న, కాళిదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో జంపన్న ప్రతాప్ ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

ఉగాది పర్వదిన పురస్కరించుకుని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ బుధవారం బోయిన్‌పల్లిలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో జరిగిన పంచాంగ శ్రవణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు.

చీర్యాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఘనంగా ఉగాది వేడుకలు



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ఉగాది పండుగ సందర్భంగా చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో చైర్మెన్ మల్లారపు లక్ష్మీ నారాయణ ఆనవాయితీ ప్రకారం ఉగాది పచ్చడిని, భక్షాల ను స్వామి వారికి సమర్పించి అనంతరం భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా, ధర్మకర్త శ్రీ హరి పాల్గొన్నారు

ఆలయంలో పత్యేక పూజలు



నవతెలంగాణ- నేరేడ్ మెట్

అల్వాల్ సర్కిల్ పరిధిలోని కనాజిగూడలో మరకత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మీ గణపతి స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. 32 ఔషధీకత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు, లక్ష్మీ గణపతి మూల మంత్రం, మరకత శ్రీ లక్ష్మీ హెూమం, మహా పూర్ణహుతి, పంచ హారతులు స్వామివారికి సమర్పించారు. శోభకత నామ సంవత్సర ఉగాది పర్వదినాన పంచాంగ శ్రవణం గావించారు.

దొంగలకు యూనివర్సిటీలోకి ప్రవేశం లేదు

నవతెలంగాణ-ఓయూ

ఈనెల 24వ తేదీన తలపెట్టబోయే నిరుద్యోగ దీక్ష నిరుద్యోగుల పాలిట శాపంగా మారనుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు తెలిపారు. ఈ ఏడాది ఉద్యోగ నామ సంవత్సరం టీఎస్పీఎస్సీలో ఇద్దరు వ్యక్తులు చేసిన తప్పిదం వల్ల ఇద్దరు రాజకీయ దొంగలు తెలంగాణ నిరుద్యోగులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారనీ, ఇదియనిరుద్యోగులు గమనించాలన్నారు. రాజకీయ లబ్ది కోసమే నిరుద్యోగులను ఉపయోగించుకోవడం రెండు జాతీయ పార్టీల అధ్యక్షులకే దక్కిందన్నారు. రాజకీయ నిరుద్యోగుల ట్రాప్‌లో ఓయూ విద్యార్థులు పడొద్దని సూచించారు. మీ రాజకీయ పార్టీలు బాధ్యతలు మరచి నిరుద్యోగులను ప్రభుత్వంపై రెచ్చగొట్టడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే నిందితులపై చర్యలు తీసుకుందనీ, నిరుద్యోగులు ఉద్యోగాలకు సిద్ధం కావాలనీ, బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీ పై ప్రభుత్వం మీద నిరాధారమైన ఆరోపణలు రేవంత్ రెడ్డి చేయడం దుర్మార్గం అన్నారు. పేపర్ లీకేజీలో రేవంత్ రెడ్డి పాత్ర ఉందనీ, అందుకే సిట్ విచారణ జరగకుండా నిందితుడు రాజశేఖర్ రెడ్డి భార్యతో కోర్టులో కేసు వేయించారని తెలిపారు.

డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం



నవతెలంగాణ-ఓయూ

అబిడ్స్‌లోని జీపీఓ ఫుట్ పాత్‌కు ఆనుకుని వీధి వ్యాపారుడు అబ్దుల్ ముజీబ్ ఖాన్ అనే వికలాంగుడు తన దుకాణం ముందు ఫుట్పాత్ పై రీలింగ్ పెట్టడంతో దుకాణం తెరిచేటప్పుడు, మూసేటప్పుడు రైలింగ్ ఉండటం ద్వారా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన వస్తుందనీ, ప్రయాణ దూరాన్ని తగ్గించడానికి తన దుకాణం ముందు ఒక చిన్న గేట్ ఏర్పాటు చేయాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని తమ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన డిప్యూటీ మేయర్ తక్షణమే ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ తో మాట్లాడి సంబంధిత అధికారులను ఆదేశించాలని తెలిపారు. అతనికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అతనికి కావాల్సినట్టు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉన్నత విద్యా ప్రమాణాలకు కేరాఫ్ ఇంజినీరింగ్ కాలేజ్

- కళాశాలకు ఐఎస్ఓ సర్టిఫికెట్స్
- కాలుష్య నియంత్రణ చర్యలకుగాను 'సర్టిఫికెట్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గ్రీన్ అవార్డ్'
- సర్టిఫికెట్స్‌తో ప్రయోజనాలు : ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మరొక గుర్తింపు పొందింది. పలు విభాగాల్లో ప్రతిష్టాత్మక ఇంటర్నేషనల్ "స్టాండెడ్ ఆర్గనైజేషన్ - అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ (ఐఎస్ఓ) నుంచి ఇటీవల గుర్తింపు పొందినట్టు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్ పేర్కొన్నారు. అత్యుత్తమ నాణ్యత, ప్రమాణాలతో అందిస్తున్న విద్యతోపాటు పలు అంశాల పై ఐఎస్ఓ బందం ఫిబ్రవరిలో కళాశాలలో 7 విభాగాలు, మెస్‌లలో తనిఖీలు చేసి సర్టిఫికెట్స్ జారీ చేసినట్టు వారు చెప్పారు. సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మైనింగ్ ఇంజినీరింగ్ ఇలా 7 విభాగాలతో పాటు గంగ, కిన్నెర బాలికల మెస్‌లు, కళాశాల క్యాంటీన్‌లకు కూడా ఐఎస్ఓ సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ గుర్తింపు 2026 మార్చి 12 వరకు ఉంటుంది. మళ్లీ ప్రతి ఏడాదీ రివ్యూ (ఆడిట్) మేరకు ఈ బృందం తనిఖీలు చేస్తుంది. గతంలో 22ఏండ్ల క్రితం ఈసీఈ, సీఎస్ఈ విభాగాలకు ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టు వచ్చినప్పుడు ఈ సర్టిఫికెట్స్ తప్పనిసరి కావడంతో ఆ రెండు విభాగాలు సర్టిఫికేట్స్ పొందాయి.

ఇటీవలే సాధించిన ప్రగతి

ఈ మధ్యకాలంలో యూజీ, పీజీ కోర్సులకు మూడేండ్ల పాటు 'ఎన్‌బీఏ' అక్రిడేషన్ రావడంతో పాటు నూతనంగా ప్రవేశ పెట్టిన యూజీ కోర్సులు మైనింగ్ ఇంజినీరింగ్‌కు ఏఐయంఎల్, పీజీ మైనింగ్ లాంటి కోర్సులకు "ఏపీసీటీఈ " గుర్తింపు కూడా లభించిన విషయం తెల్సిందే.

పొందిన సర్టిఫికెట్స్

ఐఎస్ఓ - 9001 సర్టిఫికెట్ సాధించింది. పర్యావరణ గ్రీన్ ఆడిట్‌లో ఐఎస్ఓ 14001, ఎనర్జీ ఆడిట్‌లో ఐఎస్ఓ 50001 ధ్రువీకరణ లభించింది. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందిస్తున్న గంగా, కిన్నెర, బాలికల హాస్టల్ మెస్‌లు, ఇంజినీరింగ్ కళాశాల క్యాంటీన్‌తో పాటు ఉస్మానియా విశ్వవిద్యాలయం యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లకు ఫుడ్ సెఫ్టీ ఐఎస్ఓ - 22000తో గుర్తించింది.

ఈ సర్టిఫికెట్స్‌తో అనేక ప్రయోజనాలు : ప్రిన్సిపాల్ ప్రొ.శ్రీరాం వెంకటేష్

ఐఎస్ఓ సర్టిఫికెట్స్‌తో న్యాక్, ఎన్‌బీఏ కొన్ని పాయింట్లు పొందవచ్చు. కళాశాలలో ఉన్న లోపాలను సరిదిద్దుకుంటూ ప్రమాణాలు పెంపొందించుకోవడానికి ఈ సర్టిఫికెట్స్ ఎంతో ఉపకరిస్తాయి. ఇది కళాశాలాల పూర్వ అధ్యాపకులు, ఉద్యోగులు, నేటి అధ్యాపకులు, ఉద్యోగుల, విద్యార్థుల కృషి అని చెప్పాలి.

విద్యా వికాసంలో విశేష కృషి

ఇంజినీరింగ్ కళాశాలలో 7 విభాగాల్లో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యూజీ, పీజీ విద్యను అందించటంలో భాగంగా ఫైల్స్, రికార్డ్స్, ఫైల్స్ సేఫ్టీ, నిర్వహణలో చొరవతో పాటు, వికలాంగులకు సౌకర్యాలు కల్పించడం, కరిక్యులము డిజైన్, అమలు కూడా క్వాలిటీ పాటించడం ఒక భాగమే.

గ్రీన్ ఆడిట్

ఇక ఇది కూడా ఒక భాగమే. కళాశాల లోపల ఆరుబయట, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, మొక్కలు నాటడం, ఆక్సిజన్ ఉత్పత్తి చేయడం, ప్రతిష్టాత్మకంగా వ్యర్థాల నిర్వహణ, ఆహ్లాదకరమైన వాతావరణం నిర్మాణంలో ప్రమాణాలు పాటించారు.

ఎనర్జీ ఆడిట్‌లో ముందు

విద్యుత్ పొదుపునకు తగిన చర్యలు, భవిష్యత్తు అవసరాలు దృష్టిలో ఉంచుకుని సోలార్ విద్యుత్ దిశగా ముమ్మరంగా ప్రయత్నాలు ఫలించడం. ఇవి కూడా దోహద పడ్డాయి సర్టిఫికెట్స్ జారీలో.

మున్నూరు కాపు ఐక్య పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కట్టెల సుభాష్



నవతెలంగాణ-అంబర్‌పేట

మున్నూరు కాపు ఐక్య పోరాట సమితి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తిలక్‌నగర్, నల్లకుంట ప్రాంతానికి చెందిన కట్టెల సుభాష్‌ని మున్నూరుకాపు ఐక్య పోరాట సమితి అధ్యక్షులు కొండూరు వినోద్ కుమార్ నియమించారు. గతంలో అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా 2018లో పోటీ చేశారు. 2020లో టీపీసీసీ ఓబీసీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్‌గా కొనసాగారు. 1972లో కెవికే హై స్కూల్ అజామాబాద్ విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం సందర్భంగా నిరాహార దీక్ష చేపట్టారు. నేతాజీ యూత్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా, నేతాజీ వ్యాయాంశాల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. నరసింహ బస్తీ, జవహర్‌లాల్ నెహ్రూ కమిటీకి వైస్ ప్రెసిడెంట్‌గా 30 ఏండ్ల నుంచి కొనసాగడం విశేషం. మల్లెపల్లి ఐటీఐలో 1974లో శిక్షణ పొంది, అదే శిక్షణ సంస్థలో టెక్నికల్ అసిస్టెంట్‌గా చేరి తదుపరి ట్రెనింగ్ ఆఫీసర్‌గా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా, మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్‌గా 39 ఏండ్ల సుదీర్ఘ సర్వీసును పూర్తి చేసుకున్నారు. టీఎన్జీవో స్టేట్ పబ్లి సిటీ సెక్రెటరీగా, జిల్లా అధ్యక్షులుగా, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా అనేక హెూదాల్లో పనిచేసి ఆ పదవులకే వన్నె తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సంఘం పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు ఏమైనా జరిగితే రాష్ట్రం అగ్నిగుండమే



నవతెలంగాణ-ఓయూ

బీఆర్ఎస్ ప్రభుత్వంతో డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రాణహాని ఉందనీ, వారికి ఏమైనా జరిగితే రాష్ట్రంను అగ్నిగుండం చేస్తానని బీఎస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేష్ చౌహన్ హెచ్చరించారు. బుధవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ అంశం పైన ఎవరు మాట్లాడిన వారిని అణచివేయడానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో ఆమరణ దీక్ష చేపడితే భగ్నం చేసి ఆయన్ను అరెస్టు చేయడాన్ని యావత్తు తెలంగాణ సమాజం చూసిందన్నారు. డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సెక్యూరిటీ పెంచాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో జనార్దన్ రెడ్డిని తొలగించి టీఎస్పీఎస్సీ అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపేంత పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. ఓయూ జేఏసీ చైర్మన్ బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ నిరుద్యోగ సమాజం ఉస్మానియా కాకతీయ యూనివర్సిటీలు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కి అండగా ఉన్నాయన్నారు. వారి పోరాటంలో 30 లక్షల మంది నిరుద్యోగులు భాగస్వామ్యం అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుండెల ధర్మేందర్, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయాకరన్ మౌర్య, ఐతరాజు అబేందర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు అంబేద్కర్, శ్రీనువాస్ నాయక్ పాల్గొన్నారు.

ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-అంబర్‌పేట

భారత్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆలిండియా అండర్-19, 20-20 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను అంబర్‌పేట్‌లోని వాటర్ వర్క్స్ గ్రౌండ్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ భారత్ జోడో, నఫరత్ తోడో అనే నినాదంతో ప్రజల మనసు గెలిచారనీ, అదే స్ఫూర్తితో వి.హనుమంతరావు భారత్ జోడో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నమెంట్ లో వివిధ రాష్ట్రాల నుంచి 8 జట్లు పాల్గొంటాయన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ పాదయాత్ర చేసి ప్రజలను కలుస్తూ వారి కష్ట సుఖాలను తెలుసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జేఎంహెచ్ హసన్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, జ్ఞానేశ్వర్ గౌడ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, సయ్యద్ సాదిక్ పాషా, అమర్ జీత్ కుమార్, ఆది అవినాష్, రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యాచకురాలు మృతి



నవతెలంగాణ-అడిక్‌మెట్

గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గుర్తు తెలియని మహిళా యాచకురాలు విద్యానగర్ దయానంద్‌నగర్ ప్రాంతంలో ఒక చెట్టు కింద యాచన చేస్తూ జీవితం సాగిస్తుంది. కొన్ని రోజులుగా క్షయ వ్యాధితో బాధపడుతున్న యాచకురాలు మృతి చెందిపడి ఉండటం గమనించిన స్థానికులు నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించి వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

బోనాల శ్రీనివాస్‌ను కలిసిన ధర్మేందర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఉగాది పండుగను పురస్కరించుకుని గౌలిగూడలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో ప్రజా ఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌ను కలిసి ఆయనకు పూల బొకే అందించి ఉగాది పండగ శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించిన జాతీయ కో-ఆర్డినేటర్ ధర్మేందర్ తివారి జీ మహారాజ్, గోషామహల్ నియోజకవర్గం కో-ఆర్డినేటర్ ఎం.పూజ తదితరులు.

పుణెలో వర్ల్‌పూల్ గ్లోబల్ టెక్నాలజీ ఇంజినీరింగ్ సెంటర్ మొదటి వార్షికోత్సవం

నవతెలంగాణ : ఒక ప్రముఖ గ్లోబల్ కిచెన్ లాండ్రీ కంపెనీ వర్ల్‌పూల్ కార్పొరేషన్ భారతదేశంలోని పుణెలో తన గ్లోబల్ టెక్నాలజీ & ఇంజినీరింగ్ సెంటర్ (GTEC) కొత్త కార్యాలయం మొదటి వార్షికోత్సవాన్ని ఆచరించుకుంది. జీటీఈసీ అనేది వర్ల్‌పూల్ కార్పొరేషన్‌కు యూఎస్ వెలుపల ఉన్న ఏకైక ఇంటిగ్రేటెడ్ టెక్ సెంటర్ కాగా, 850o ఇంజనీర్ల ప్రత్యేక బృందం ఒకే పైకప్పు క్రింద విభిన్న సాంకేతికత మరియు పరిష్కారాలపై పని చేస్తున్నారు. పుణెలోని వర్ల్‌పూల్ కార్పొరేషన్ కొత్త జీటీఈసీ కార్యాలయం కంపెనీకి "విన్నింగ్ వర్క్‌ప్లేస్" మార్గదర్శకాలలో భాగంగా చురుకుదనంతో, సహకారాన్ని పెంపొందించే స్ఫూర్తిదాయకమైన పని వాతావరణాన్ని అందిస్తుంది. జీటీఈసీలో కేఫ్, వ్యక్తిగత మరియు ఫ్లెక్స్ వర్క్‌స్పేస్‌లు, వినోదం మరియు సహకార ప్రాంతాలు, ఫోకస్ సీట్లు మరియు సీటింగ్ పాడ్‌లు, ల్యాబ్ సహకార ప్రాంతం, వెట్ ల్యాబ్, కాంపిటేటివ్ అనాలిసిస్ వర్క్‌స్పేస్, ఇన్నోవేషన్ గ్యారేజ్, వర్చువల్ రియాలిటీ ల్యాబ్, ఇతర స్టేట్ ఆఫ్ ఆర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తదితరాలు ఉన్నాయి.

'ప్రపంచ ప్రమాణాలతో ఆండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమం'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రపంచ ప్రమాణాలతో ఆయుర్వేద జీవన అవకాశం కల్పిస్తున్న ఆండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమమని ఆండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమం ఎండీ ఎస్ఎంఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఫౌండర్, చైర్మన్ మంజుల జూపల్లి అన్నారు. ప్రకాశవంతమైన జీవనయోగానికి శ్రీకారం, ప్రకృతితో మమేకమైన, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంభించేందుకు అతి సులువైన మార్గం ఆండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమం అని ఆమె పేర్కొన్నారు. బుధవారం ఉగాదిని పురస్కరించుకుని కంట్రీ క్లబ్ లో ఆండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమా బ్రోచర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతితో మమేకమౌతూ అందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఆయుర్వేద సేవలు అందించే ఇకో రియాలిటీ వెంచర్ అన్నారు. హెల్త్ టూరిజం కోసం ప్రపంచమే భారతదేశం వైపు చూస్తున్న తరుణంలో ఆండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమం వెల్ నెస్ ఒక గ్లోబల్ స్పటాలిటీ కేంద్రంగా ఎదగనుందని ఆమె పేర్కొన్నారు. మారిన జీవనశైలి తెచ్చే వేలాది సమస్యలకు భారతీయ ఆయుర్వేదం పరిష్కారాన్ని చూపిస్తుందనీ, అలాంటి ఆయుర్వేదానికి తెలంగాణాలో మొట్టమొదటి ఆరోగ్య క్షేత్రమన్నారు. దృష్టి విలువలను అంతర్గతంగా ప్రేరేపించే ప్రకృతి శక్తి జెన్ సెంటర్లు ఎంతో ప్రయోజనకారి అనీ, స్కూల్ పిల్లలకు ఫామ్ టూర్లు, కార్పొరేట్ వ్యవస్థల్లో పని చేస్తున్న వారికి ప్రకృతి చికిత్సలు, యోగా, పంచకర్మ, శతక్రమ శిరోధార, అభ్యంగనం, హైడ్రోథెరపీ, మడ్ ప్యాక్స్, నేచర్ వాక్, మెడిటేషన్ కోర్సులతో ఇతరేతర సాత్వికాహారాన్ని అందిస్తూ కార్పొరేట్ ప్యాకేజ్‌లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. కార్పొరేట్లకు ఇక్కడ ఫామ్ టూరిజం, హెల్త్ టూరిజం, స్పిరిట్యువల్ టూరిజం వినూత్నమైన కాంబినేషన్ కనిపిస్తుందనీ, వ్యవసాయ పర్యాటనలో పొలం గట్లపై నడుస్తూ, పశువులను, పక్షులనూ చూస్తూ, ఇక్కడ తయారయ్యే మూలికల తయారీ గురించి తెలుసుకుంటూ, తేనేటి విందు ఆస్వాదిస్తూ ఆయుర్వేదిక సేవలను అందుకోవచ్చన్నారు. కాలుష్య రహితమైన వైదిక, హరిత సమావేశ కేంద్రాలను వినియోగించుకుంటూ ఇకో ఫ్రెండ్లీ పద్ధతిలో సమీక్షా సమావేశాలు నిర్వహించుకునేలా ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆండాలు ఆయుర్వేదిక్ ఆశ్రమం డైరెక్టర్ మాడుగుల దీప్తి రెడ్డి, డైరెక్టర్స్ ముకుంద్, ప్రణీత, తదితరులు పాల్గొన్నారు.



చేనేత ఉత్పత్తులకు మరింత ఆదరణ

నవతెలంగాణ-బంజారాహిల్స్

గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో బంజారాహిల్స్ రోడ్డు నెంబర్ 12లోని కళింగ కల్చరల్ హాల్‌లో ఏర్పాటైన హ్యాండ్ లూమ్ ఇండియా 2023 వస్త్ర ప్రదర్శనను నగర సామాజిక వేత్త బినా మెహతా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందనీ, నేటికీ వాటపై వన్నె తగ్గలెదన్నారు. నేటితరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. డిజైనర్లు సైతం దేశంలో చేనేత కారులు నేస్తున్న ఈ హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను సృజనాత్మకంగా డిజైన్ చేస్తున్నారని తెలిపారు. నిర్వాహకులు జయేష్ మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశంలోని 14 నగరాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 50 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

మర్రి రాజశేఖర్‌రెడ్డికి పంచాంగం అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉగాది పండగను పురస్కరించుకుని బుధవారం కీసర శ్రీ రామలింగేశ్వర స్వామి అర్చకులు బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి, మమతారెడ్డి దంపతులకు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రసాదంతో పాటు నూతన సంవత్సర పంచాంగంను అందజేశారు. ఈ కార్యక్రమంలో కీసర గుట్ట చైర్మెన్ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, రమేష్ యాదవ్, నరేందర్‌రెడ్డి, సాయి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు కార్యాలయంలో ఘనంగా ఉగాది వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఉగాది పండుగ సందర్భంగా బోయిన్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆత్మీయసోదరులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగాది పచ్చడిని పంచుకుని, ప్రజలందరికీ నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముప్పిడి మధుకర్, బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్, నళినీ కిరణ్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

25న మా వైష్ణవ దేవి విశాల్ జాగరణ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

చైత్ర నవరాత్రుల సంద్రాభంగా మా వైష్ణవ దేవి విశాల్ జాగరణ్‌ను ఈ నెల 25వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్టు మా వైష్ణవ దేవి జాగరణ్ మండల్ చైర్మన్ అంజనీ కుమార్ అగర్వాల్ తెలిపారు. శనివారం వైష్ణవ దేవి విశాల్ జాగరణ్ ఏర్పాట్ల ప్రారంభ సూచికగా గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో మా వైష్ణవ దేవి జాగరణ్ మండల్ కోర్ వర్కింగ్ కమిటీ సభ్యులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఏర్పాట్లను పరిశీలించి అంజనీ కుమార్ అగర్వాల్ మీడియాతో మాట్లాడుతూ శాంతిని ప్రోత్సహించడానికి, మానవజాతి శ్రేయస్సు కోసంతో పాటు హిందూ ధర్మ పరిరక్షణ కర్తవ్యంలో భాగంగా శారదీయ నవరాత్రుల సంద్రాభంగా గోషామహల్ పోలీస్ గ్రౌండ్స్‌లో భారీఎత్తున మా వైష్ణవ దేవి విశాల్ జాగరణ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. జమ్మూలోని మా వైష్ణవ దేవి మాత ఆలయం పూజారి శ్రీ లోకేష్ జి పూజారి ఈ జాగరణ్ లో పూజలు నిర్వహిస్తారనీ, ప్రారంభానికి గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్, ఐపీఎస్, ప్రభుత్వ ఉన్నదికారులను ఆహ్వానించామన్నారు. దాదాపు 20 వేల మంది భక్తులు హాజరవుతారని చెప్పారు. ఉచిత ప్రవేశం, ఫలహారాలతో పాటు భోజనం సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రత్యేకంగా జమ్మూలోని మా వైష్ణవ దేవి మాత ఆలయం నుంచి తెప్పించిన ప్రసాదం, ఖజానాలను 5 వేల మంది భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ జాగరణ్‌లో టి.సిరీస్ ఫేమ్ గాయకుడు కుమార్ విషు, కలకత్తాకు చెందిన ప్రముఖ భక్తి పాటల గాయకుడు నవీన్ జోషితోపాటు స్థానిక గాయకులు పాల్గొంటారని తెలిపారు. 25న సాయంత్రం 7 గంటలకు జాగరణ్ ఆకాంధ్ జ్యోత్ వెలిగించడంతో ప్రారంభమౌతుందనీ, దేవి పూజల అనంతరం కళాకారులు భజనలు, పాటలతో భక్తి వాతావరణాన్ని సృష్టిస్తారనీ, భక్తులు 'మాతా కా జాగరణ్' సమయంలో అమ్మవారి ఉనికిని అనుభవిస్తారనీ, అన్ని చెడుల నుండి రక్షిస్తాయని, ప్రజల మధ్య బంధాలను బలోపేతం చేసే ఈ మా వైష్ణవ దేవి విశాల్ జాగరణ్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ జాగరణ్ మహా ఆరతిలో తెల్లవారు జామున ముగుస్తుందని అంజనీ కుమార్ అగర్వాల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మా వైష్ణవ దేవి జాగరణ్ మండల్ కోర్ వర్కింగ్ కమిటీ సభ్యులు రామ్ కిషన్ అగర్వాల్, రాకేష్ నర్సింగ్ పురియా, సంజయ్ అగర్వాల్, అంజనీ సర్వయోగి, రాకేష్ అగర్వాల్, మనీష్ అగర్వాల్, రాకేష్ జలన్, ధీరజ్ అగర్వాల్, సూర్య కమల్ గుప్తా, లలిత్ అగర్వాల్, హరి ఓం గార్గ్, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- స్లో లర్నర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాం
- ఏబీసీ గ్రూపులుగా విభజించి బోధిస్తున్నాం
- స్పెషల్ క్లాసుల సమయంలో స్నాక్స్ అందిస్తున్నాం
- ఒక నిమిషం ఆలస్యం నిబంధనలో సడలింపు
- హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి రోహిణి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి టి ఆర్.రోహిణి అన్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు నేర్చుకున్నది పరీక్షల్లో రాసేలా సంసిద్ధులను చేస్తున్నామని వివరించారు. దాదాపు రెండు నెలలుగా స్పెషల్ క్లాసులు నిర్వహించడంతోపాటు స్నాక్స్ అందజేస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. ఏప్రిల్ 3 నుంచి 13వరకు జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేశామన్నారు. సీసీ కెమెరాల నిఘా నీడలో మాస్ కాపీయింగ్, చూచిరాత ఘటనలకు తావులేకుండా పర్యవేక్షణకు సిద్ధం చేశామన్నారు. విధివిధానాలపై అధికారులు, సిబ్బందికి జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారనీ, ఎక్కడా పొరపాట్లకు తావివ్వొద్దనీ, సజావుగా పరీక్షలను పూర్తి చేయాలని ఆదేశించారని తెలిపారు. పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై మరిన్ని విషయాలను డీఈవో నవతెలంగాణకు వివరించారు.

నవతెలంగాణ : పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

డీఈవో : పదో తరగతి వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన ఆర్టీసీ, పోలీస్, పోస్టల్, విద్యుత్, వాటర్‌బోర్డు, వైద్య అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాం. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా అన్ని చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

నవతెలంగాణ : ఎన్ని పరీక్ష కేంద్రాల్లో.. ఎంతమంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు?

డీఈవో : మొత్తం 344 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. 68,744 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా.. 3,370 ప్రయివేటు విద్యార్థులతో కలిసి మొత్తం 72,114 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

నవతెలంగాణ : విధుల్లో ఎంతమందిని నియమిస్తున్నారు?

డీఈవో : జిల్లావ్యాప్తంగా 3వేల మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారు. ప్రతి సెంటర్‌లో ఒకరు చొప్పున 684 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు పని చేస్తారు. 38 కస్టోడియన్లు, 38 జాయింట్ కస్టోడియన్లు, 17 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశాం. వీరి పర్యవేక్షణలో సీసీ కెమెరాల వద్ద ప్రశ్నపత్రాలు తెరిచేలా చర్యలు తీసుకుంటాం.

నవతెలంగాణ : ఒక నిమిషం నిబంధన అమలులో ఉందా?

డీఈవో : ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుంది. 8.45 నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తాం. ఈ ఏడాది ఒక్క నిమిషం నిబంధనలో కొంత సడలింపు ఇచ్చాం. 9.35 గంటలకల్లా విద్యార్థులు పరీక్షా కేంద్రాల్లో ఉండాల్సిందే.

నవతెలంగాణ : పరీక్షలు సజావుగా జరిగేలా తీసుకున్న చర్యలేంటి?

డీఈవో : ప్రతి పరీక్ష కేంద్రంలో నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘా పెడతాం. సమస్యాత్మక సెంటర్లపై అదనపు నిఘా ఉంటుంది. మాల్ ప్రాక్టీస్, చూచిరాత వంటి ఘటనలు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. పరీక్ష జరిగే సమయాల్లో స్థానికంగా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీప జిరాక్స్ కేంద్రాలు తెరిచి ఉండకుండా చూస్తాం.

నవతెలంగాణ : పరీక్ష కేంద్రాల్లో కనీస వసతులు కల్పిస్తున్నారా?

డీఈవో : వేసవి నేపథ్యంలో పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఒక ఏఎన్ఎం, ఆశా వర్కర్ అందుబాటులో ఉండేలా వైద్యశాఖ చర్యలు తీసుకుంటుంది. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్తు శాఖ, మరుగుదొడ్ల సదుపాయం, పాఠశాల ప్రాంగణాల్లో పరిశుభ్రత జీహెచ్ఎంసీ చూసుకుంటుంది. పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడపనున్నారు.

నవతెలంగాణ : ఫలితాలపై ఎలాంటి దృష్టి సారిస్తున్నారు?

డీఈవో : ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. గతేడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాం. ముఖ్యంగా వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారిని సమాయత్తం చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో స్పెషల్ క్లాసులు నిర్వహించడంతో పాటు స్నాక్స్ అందజేస్తున్నాం. విద్యార్థులు సులువుగా నేర్చుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా మెటీరియల్‌ను సరఫరా చేశాం. కేవలం పాఠాలు బోధించి.. చదువుకోవాలని చెప్పి ఊరుకోకుండా.. విద్యార్థుల దృష్టి చదువుపై కేంద్రీకరించేలా.. ఉదయం 5గంటలకు వేకప్ కాల్స్ చేసి నిద్ర లేపుతున్నాం. నిరంతరం పేరెంట్స్‌తో మాట్లాడే బాధ్యతలను ఉపాధ్యాయులకు అప్పగించాం. డిప్యూటీ ఈవోలు, హెచ్ఎంలతో మీటింగ్‌లు నిర్వహించి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

గుడికి వెళ్లిన విద్యార్థిని అదృశ్యం



నవతెలంగాణ-బాలానగర్

గుడికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన విద్యార్థిని తిరిగిరాని సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. సీఐ కె. భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం బాలానగర్ రాజుకాలనీలో నివాసం ఉంటున్న బాలిక స్థానిక ప్రయివేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. బుధవారం ఉగాది పండుగ సందర్భంగా దుర్గమాత గుడికి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లి ఇప్పటివరకు తిరిగి ఇంటికి చేరుకోలేదు. తెలిసిన వారిని, బంధువులను, పరిసర ప్రాంతాలలో విచారించినా ఆమె ఆచూకీ తెలియరాలేదు. ఈ మేరకు బాలిక తండ్రి బాలానగర్ పోలీసులకు పిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'పలుకుబడి ప్రతిభను తోసిపుచ్చుతోంది'



నవతెలంగాణ-కల్చరల్

నేడు పలుకుబడి ప్రతిభను తోసిపుచ్చుతోందని ప్రముఖ కవి డాక్టర్ ఎం. కె.రాము అన్నారు. జ్ఞానేశ్వర్ తబల వాద్య విన్యాసం లో అత్యంత ప్రతిభ కల వారని కానీ ఆయనకు రావాల్సిన గుర్తింపు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై కథక్ కళా క్షేత్ర నిర్వహణలో తబల కళా కారుడు తోట జ్ఞానేశ్వర్ కు ఆత్మీయ సత్కార సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రాము పాల్గొని బాల భవన్ లో తబల కళాకారుడు గా జ్ఞానేశ్వర్ ఎందరికో శిక్షణ ఇచ్చారని తెలిపారు. ఆకాశ వాణి విశ్రాంత అధికారి కలగా కృష్ణ మోహన్ మాట్లాడుతూ జ్ఞానేశ్వర్ పలు ప్రభుత్వ కార్యక్రమలలో తబల విన్యాసంతో ప్రముఖుల ప్రశంస లందుకున్నారని కొనియాడారు. గాయకుడు త్రినాధ రావు అధ్యక్షత వహించిన సభలో కథక్ గురువు ఆంజి బాబు కథక్ నాట్యానికి తబల ప్రధాన సహ వాయిద్య మని జ్ఞానేశ్వర్ కథక్ నాట్యం రక్తి కట్టటానికి సహకారం గుర్తు చేశారు

సంగీతమే ఈ అంధుల జీవన విధానం

- ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అనే నినాదంతో పాటలు
- కండ్లు లేకపోయినా తల్లిదండ్రులకు భారం కాకుండా ఆర్కెస్ట్రాతో జీవనం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

పుట్టుకతోనే రెండు కండ్లు లేని వారు సంగీతంతో జీవనోపాధి పొందుతున్నారు. ప్రార్థించే పెదవుల కన్నా - సహాయం చేసే చేతులు మిన్న. అనే నినాదంతో పాటలు పాడుతున్నారు. ఆ నలుగురే మహమ్మద్ సమీర్, ఆంజనేయులు, ఉదయ్ కుమార్, ప్రమీల. వారు ఒక టీం గా ఏర్పడి ఒక యాప్ ద్వారా సినిమాలో పాడిన పాటలను విని జ్ఞాపకం ఉంచుకొని పాటలు పాడుతూ, హైదరాబాద్‌లో ప్రతిరోజు ఒక సెంటర్లో ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేసుకుని సినిమాలో పాడిన వారి వలె ఎలాంటి తప్పులు రాకుండా, గొంతులు కలుపుతూ అద్భు తంగా పాటలు పాడుతూ ఎంతో ఉన్నతంగా జీవిస్తున్నారు. వారితో పాటు వారి తల్లిదండ్రులను పోషిస్తున్నారు.

ప్రతిరోజు ఒక సెంటర్లో సాయంత్రం నాలుగు గంటల నుంచి 10 గంటల వరకు పాటలు పాడుతూ, దాతలు ఇచ్చిన ఆర్థిక సహాయంతో జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారు నవతెలంగాణతో మాట్లాడారు. తమ పాటలు విన్న దాతలు అనేక మంది పెద్ద మనసుతో ఆర్థికం సహాయం చేస్తున్నారని, వారికి తాము ఎల్లవేళలా రుణపడి ఉంటామని, వారిని ఆ దేవుడు చల్లగా చూడాలని కోరుకుంటున్నామని వారు అన్నారు. ముసారాంబాగ్ లోని అంధుల పాఠశాలలో పదో తరగతి వరకు బ్లైండ్ లిపితో చదువుకున్నామని, అక్కడ ఇప్పటికి 170 మంది బాల ,బాలికలు చదువుతున్నారని, కొంతమంది చదువు అయిపోయిన తర్వాత కూడా అక్కడే హాస్టల్లో ఉంటున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు రావని, నిరాశ చెందకుండా అదేవిధంగా కండ్లు లేని వారము ఏ పని చేయలేమని ఆత్మహత్యలు చేసుకోకుండా, సినిమాలో పాడిన పాటలు వింటూ, తెలుగు, హిందీ పాటలు నేర్చుకొని తమకు కావలసిన పరికరాలను తామే స్వయంగా, తమకు వచ్చే పెన్షన్ డబ్బులతో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. కొంతమంది వివాహాలు చేసుకున్నారని, తమ టీమ్ లో ఉన్న ఇద్దరు భార్యా ,భర్తలు అంధులే అన్నారు. అయితే వారికి ఇద్దరు పిల్లలు జన్మించారని ఇద్దరు పిల్లలు ఆరోగ్యంగా పుట్టారని, వారికి ఎలాంటి అవయవ దోషాలు లేవని వారిని చదివించుకుంటున్నామని చెప్పారు.

తమ పిల్లలే తమకు ఇంట్లో అన్ని సహాయ సహకారాలు అందిస్తారని అందువల్ల తాము చాలా సంతోషంగా ఉన్నామని భార్యాభర్తలు తెలిపారు . అన్ని అవయవాలు బాగా ఉండి, ఆరోగ్యంగా ఉండి, ఆర్థికంగా సహాయం చేసే వారు ఉన్నా కూడా, కేవలం చదువుకుంటే ప్రభుత్వ ఉద్యోగాలే చేయా లని, ఇక ఏ పని చేయలేమని అనేక మంది యువతీ, యువకులు ఆత్మహత్యలు చేసుకుంటూ చనిపో తున్నారని, తాము కూడా టీవీలలో వింటామని అది విన్నప్పుడు ఎంతో బాధగా అనిపిస్తుందన్నారు. కనీసం అలాంటివారు తమను చూసి అయినా, ఏ పని చేసి, అయినా గౌరవంగా జీవించాలని, ప్రభుత్వ ఉద్యోగాలు ఉంటేనే జీవితాలు కాదని, అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు రావని తెలుసుకొని జీవించాలన్నారు. మనకు జన్మ ఇచ్చిన తల్లిదండ్రులను దుఃఖ పరిచి, చనిపోవడం మంచి పద్ధతి కాదని యువతకు సూచించారు. రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆరోగ్యశ్రీ కార్డులు మాత్రమే కొంతమందికి ఉన్నాయని, తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత తమలో చాలామందికి ఆరోగ్యశ్రీ కార్డు లేవని, అదేవిధంగా డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎవరికి ఇవ్వలేదని, కండ్లు ఉన్న వారికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వటం లేదు, ఇక కండ్లు లేని మాకు కేసీఆర్ ఇండ్లు ఎప్పుడు ఇవ్వాలని ఆవేదన వెలిబుచ్చారు .ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం అంధులకు, వికలాంగులకు అందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని, అంధులకు ప్రభుత్వ వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తెలుగు, హిందీ పాటలు బాగానే పడతామని, అయినా ఇంత వరకు ఓల్డ్ సిటీలో ఎప్పుడు తాము పాటలు పాడే కార్యక్రమాలు పెట్టలేదని అన్నారు. తాము అందరము పరికరాలతో ఆటోలో వస్తామని ,పాటలు పాడిన అనంతరం తిరిగి ఆటోలో మా ఇండ్లకు చేరుకుంటామని అన్నారు. దాతలు ఎవరైనా తమకు సహాయం చేయాలనుకుంటే మా ఫోన్ నెంబర్లు 9703221525, 7337275371 కు కాల్ చేయవచ్చని, లేదా ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఆర్థిక సహాయం చేయవచ్చని కోరుతున్నారు.

శీతల పానీయాలు వద్దు.. సహజ పానీయాలు మేలు

- జేవీవీ రాష్ట్ర కోశాధికారి ఆర్ వర ప్రసాద్



నవతెలంగాణ-దుండిగల్

కూల్ డ్రింక్స్ ఎంతో నష్టం కలిగిస్తాయని వాటికి బదులుగా సహజ సిద్ధమైన కొబ్బరి నీళ్లు, మజ్జిగ, పండ్ల రసాలు, చెరుకు రసం, నిమ్మ రసం ఆరోగ్యానికి ఎంతో మేలు కలిగిస్తాయని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి ఆర్ వర ప్రసాద్ తెలిపారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతి నగర్‌లో బుధవారం జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో జేవీవీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లయ్య చారి అధ్యక్షతన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేవీవీ రాష్ట్ర కోశాధికారి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శీతల పానీయాలను సినీ నటులు ప్రోత్సహిస్తున్నారని తెలిపా రు.వారి స్వలాభం కోసం చేసే వాణిజ్య ప్రకటనలు ప్రజల ఆరోగ్యాన్ని నష్టపరిచేవిగా ఉన్నాయని జేవీవీ తీవ్రంగా గతం నుంచి వ్యతిరేకించిందని అన్నారు. వాటికి ప్రత్యామ్నాయంగా అందరూ సహజపానీయాల పై దృష్టి సారించాలని కోరారు. సహజపానీయ ఉత్పత్తులు ప్రోత్సహించడం వల్ల వ్యవసాయరంగాన్ని, రైతులను ప్రోత్సహించినట్టవుతుందని, ప్రజల ఆరోగ్యాలకు నష్టం జరుగదని తెలిపారు. పచ్చడి పంపిణీ కార్యక్రమంలో 180 మంది ప్రజలు పాల్గొన్నారు. ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అనంతరం కూల్ డ్రింక్స్ మానేద్దాం సహజ పానీయాలు తాగుదాం అనే కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లయ్య చారి, బాచుపల్లి మండల ప్రధాన కార్యదర్శి కె. శంకర్ రావు జేవీవీ నాయకులు సైంటిస్ట్, డాక్టర్ ప్రశాంత్, మునికష్ణ, క్రిష్ణశ్రీ, క్రిష్ణయ్య, నరేష్, అఖిల్, రాజ్ కుమార్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

కేపీ విశాల్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామంలో గల సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కే.పి. విశాల్ గౌడ్ ఆధ్వర్యంలో ఉగాది పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ సభ్యులను విశాల్ పట్టు కండువాలతో సత్కరించి ఉగాది పచ్చడి, బక్షాలను ప్రసాదంగా వారికి అందజేశారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ శోభ కత నామ సంవత్సరం ప్రజలందరికీ శుభాలను చేకూర్చాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సామల నర్సింహారెడ్డి, సలహాదారులు బలవంత రెడ్డి, నల్ల లింగం గౌడ్, ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి మురళి గౌడ్, ఉపాధ్యక్షులు నార్ల కంటి నాగేష్, బండి బిక్షపతి గౌడ్, నరహరి గౌడ్, లక్ష్మణాచారి, సత్యనారాయణ, సత్తయ్య ,పాండు చారి, కుల్ఫీ సత్తయ్య ,నర్సింగ్ రావు, శ్రీ రాములు, గొరిగే సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మేయర్ దంపతులకు ఉగాది శుభాకాంక్షలు



నవతెలంగాణ-దుండిగల్

మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. 8వ డివిజన్ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఎన్ఎంసీ బీఆర్ఎస్ బీసీ సెల్ ప్రెసిడెంట్ గోపాల్ కష్ణ ముదిరాజ్, 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 2 వాసులు, గాయత్రి గార్డెన్స్ వాసులు సుబ్బ రాజు, నవీన్ రెడ్డి,హరిప్రసాద్ రాజు, సత్య మధుసూధన్, మధు, ఎన్ఎంసీ బీఆర్ఎస్ యూత్ వైస్ ప్రెసిడెంట్ రాము, జనరల్ సెక్రెటరీ రాజా, తిమ్మయ్య, అంజి, రమేష్, బీఆర్ఎస్ 12వ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, జనరల్ సెక్రెటరీ బట్ట మురళి, జాయింట్ సెక్రటరీ ఎల్ఐసి శ్రీనివా స్, అనుబంధ కమిటీల సభ్యులు చంద్రమౌళి, బాల రాజు, గోల్కొండ శ్రీనివాస్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రాణాలు కాపాడిన ఎస్ఐకు ఘనంగా సన్మానం

- ప్రత్యేకంగా అభినందించిన సీపీ సీవీ ఆనంద్

నవతెలంగాణ-సిటీబ్యూరో

డీసీఎంలో ప్రయాణిస్తున్న 16మంది ప్రాణాలు కాపాడిన సీఐ, ఎస్ఐలను సీపీ సీవీ ఆనంద్ ఘనంగా సన్మానించారు. మంగళవారం ప్రగతీ భవన్ ముట్టడికి ప్రయత్నించిన ఏబీవీపీ విద్యార్థులను కట్టడి చేసిన పోలీసులు వారిని డీసీఎంలో తీసుకెళ్తున్నారు. దాదాపు 16 మంది డీసీఎంలో వెళ్తున్న సమయంలో డీసీఎం నడుపుతున్న హెూంగార్డు రమేష్‌కు ఆకస్మాత్తుగా ఫిట్స్‌రావడంతో ఆ వాహనం డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ప్రమాదాన్ని గమనించిన బంజారాహిల్స్‌లో పనిచేస్తున్న ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి హుటాహుటిన కిందకు దూకి వాహనాన్ని కంట్రోల్ చేసిన విషయం తెలిసిందే. ఎస్ఐ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 16 మంది ప్రాణాలే కాకుండా రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, పాదాచారుల ప్రాణాలను కాపాడిన ఎస్ఐ కరుణాకర్‌రెడ్డితోపాటు పంజాగుట్ట సీఐ హరిచంద్రా రెడ్డిని సీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం రవీంద్రాభారతిలో జరిగిన కార్యక్రమంలో సీఐ, ఎస్ఐని ఘనంగా సన్మానించిన సీపీ వారికి రివార్డులను అందజేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా ప్రతిభ కనబర్చినవారితో పాటు పోలీస్ ప్రతిష్టను మరింత పెంచేవిధంగా వ్యవహరించిన వారిని ప్రత్యేకంగా అభినందిస్తామని ఈ సందర్భంగా సీపీ తెలిపారు.

రాష్ట్రపతి నిలయానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బొల్లారంలోని రాష్ట్రపతి నిలయాన్ని సందర్శించేందుకు ప్రభుత్వం బుధవారం నుంచి సందర్శకులకు అనుమతి ఇవ్వడంతో అందుకనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేసినట్టు సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ సీహెచ్ వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రపతి నిలయం సందర్శనకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అనుమతి ఇవ్వడంతో సందర్శకులు సౌకర్యార్థం ప్రతీ 5 నుంచి 10 నిమిషాల వ్యవధిలో సికింద్రాబాద్ నుంచి బాలాజీనగర్, సీఆర్‌పీఎఫ్, ఘట్‌కేసర్‌కు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం మీదుగా బస్సులను నడపను న్నట్టు ఆయన పేర్కొన్నారు. కంటోన్మెం ట్ డిపోకు చెందిన బస్సు రూట్ నెం.24బి, సికింద్రాబాద్ నుంచి బాలాజీ నగర్, అదేవిధంగా హకీంపేట డిపో నుంచి రూట్ 211ఎమ్ సికింద్రాబాద్ నుంచి సీఆర్‌పీఎఫ్, 24బి/281 సికిం ద్రాబాద్ నుంచి ఘట్‌కేసర్‌కు ప్రతిరోజు 187 ట్రిప్పులతో ప్రతి 5నుంచి 10 నిమిషాలకు బస్సులు అందుబాటులో ఉంటా యన్నారు. ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియో గం చేసుకోవాలన్నారు. సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని ఆర్.ఎం వెంకన్న విజ్ఞప్తి చేశారు.

సత్య వేద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం, చలివేంద్రం



నవతెలంగాణ - కూకట్ పల్లి

కూకట్ పల్లి జాతీయ రహదారి పై ఉన్న రాందేవ్ రావు హాస్పటల్ దగ్గర సత్యవేద ఫౌండేషన్ ఫౌండర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అన్నదానం కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఇది మంచి కార్యక్రమం అని అభినందిస్తూ, జాతీయ రహదారి, అలాగే హాస్పిటల్ సమీపంలో ఉండటంవల్ల , చాలా మంది ఆకలి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ దంపతులు, మహేష్, నవీన్, ప్రవీణ్, ప్రసాద్, రమేష్ విద్యాసాగర్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీ శోభకృత్ నామ సంవత్సర పర్వదినాన్ని పురస్కరించుకొని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో సుప్రసిద్ధం అయిన శ్రీ సీతారమచంద్రస్వామి ఆలయంలో దుర్గా అమ్మవారి ఆలయంలో అలాగే శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు రాష్ట్ర సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి నిర్వహించారు.. ఉగాది సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. కొలను శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి పూల మాల వేసి అర్చకులు ఆశీర్వదించారు. నవతెలంగాణ-దుండిగల్

యాదాద్రిని సందర్శించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం అడ్వైజరీ కమిటీ సభ్యులు, బీజేపీ కూకట్ పల్లి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని, మంగళవారం యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామిని కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు, వడ్డేపల్లి కుటుంబ సభ్యులను ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం సత్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ శుభకత నామ ఉగాది పండుగ సందర్భంగా యాదాద్రిలో లక్ష్మీ నరసింహ స్వామి ప్రజలందరికీ చల్లని దీవెనలు అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలంతా సుఖ సంతోషాలతో, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని భగవంతున్ని కోరుకుంటున్నట్టు వడ్డేపల్లి రాజేశ్వరరావు స్పష్టం చేశారు.



ఘనంగా ఉగాది వేడుకలు

నవతెలంగాణ-శామీర్‌పేట

ఉమ్మడి శామీర్‌పేట మండల వ్యాప్తంగా బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కాగా మూడు చింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయంలో సర్పంచ్ సింగం ఆంజనేయులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్తములు శ్రీ గుండు వెంకటేశ్వర్లు శర్మ పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారమచంద్రస్వామి కల్యాణ వసంత మహెూత్సవము ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పారుపల్లి నాగరాజు, ఉపసర్పంచ్ కటికెల వైద్యనాథ్, వార్డు సభ్యులు సురేష్, బాలేష్, నాయకులు మడమైన సత్యనారాయణ, బండి జగన్నాథం, వీరేశం గుప్తా, క్యాతం మధుకృష్ణ, చినలచ్చ శ్రీనివాస్, మంద స్వామి, సింగం నర్సింగ్ రావు, చిత్తయ్య గౌడ్, రామరాజు, గోపాల్, కిసరి నర్సింలు, శావుకరి, సాయి శ్రీనివాస్ చారి, వెంకట స్వామి, హీరాలాల్, పూజారులు తమ్మలి రమేష్, ఉపేందర్ రావు , ప్రవీణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-హైదరాబాద్

ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని కార్యకర్తలు, నాయకులు కార్పొరేటర్లు పెద్ద ఎత్తున ఆయన నివాసానికి తరలి వెళ్లి ఘనంగా శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు వెళ్దామని ఆయన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి, బండా వెంక ట్రావు, వల్లపు జగన్ యాదవ్, రేపు నరసింహ, రేవెల్లి రాజు, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పంచాంగ శ్రవణం



నవతెలంగాణ-దుండిగల్

నిజాంపేట్‌లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు పంచాంగ శ్రవణం పఠనం చేసి ఈ ఏడాదిని గురించి, అదే విధంగా రాశి ఫలాల గురించి వివరించారు. ఈ వేడుకలో అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మెన్,డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, వైస్ చైర్మెన్ రాజ్మోహన్ రెడ్డి, ఇతర ముఖ్య కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు సురేష్ రెడ్డి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తలారి వీరేష్, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, వెంగయ్య చౌదరీ, బొర్రా చందు, కోలన్ సునీల్ రెడ్డి, గ్రామ పెద్దలు కోలన్ లీడర్ నరసింహ రెడ్డి, సాయిలు యాదవ్, రుక్మా రెడ్డి,జనార్ధన్ రెడ్డి,సురేందర్ రెడ్డి,సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జీతా చారీ, సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి,మాజీ సర్పంచ్ వడ్ల నాగేష్ చారీ, సీతారాం రెడ్డి,తులసి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లలితా మాతేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-హయత్‌నగర్

ఉగాది పండుగ సందర్భంగా హయత్ నగర్1 డిపోలో లలితా మాతేశ్వరి ఆలయంలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి తయారు చేసి ఉద్యోగులు అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంకు డిపో మేనేజర్ రఘు దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శోభకృత్ నామ నూతన సంవత్సరం ప్రతి ఒక్కరికీ సంతోషంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ కష్టపడి సంస్థను అభివృద్ధి బాటలో నడిపించాలని కోరారు. అంతేగాక డిపోలో జరిగే కార్యక్రమాలకు సహకరిస్తున్న హయత్‌నగర్ లయన్స్ క్లబ్ బాధ్యులకు ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోలా శ్రీనివాస్ దంపతులు, విజయకుమారి, షాలిని, మహిపాల్ రెడ్డి, నరేష్, వినయ్, వెంకటేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా ఉగాది వేడుకలు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

ఉగాది పర్వదినమును పురస్కరించుకొని గురువారం భక్తులు స్థానిక ఆలయానికి దర్శనార్థం విచ్చేశారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి, ధర్మకర్తల మండలి, సిబ్బంది ద్వారా భక్తులకు ఎండల నుంచి రక్షణకై చలువ పందిర్లు వేసి, ప్రసాదములు, దర్శనముల వద్ద ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి అవసరము మేరకు ప్రసాదములు, మంచినీరు అందించారు. అదేవిధంగా ఇటీవల దేవస్థానము స్వాధీనము చేసుకున్న ఆన్యాక్రాంతమైన భూమి చుట్టు రెవెన్యూ అధికారులు ఇచ్చిన పంచనామా, స్కెచ్‌లో చూపిన సరిహద్దుల ప్రకారముగా ప్రహరీ గోడ నిర్మాణము చేపట్టి పూర్తి చేయడం జరిగింది. సా.6.30ని.లకు వేద పండితులచే పంచాంగ శ్రవణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రములలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసశర్మ, పాలకమండలి చైర్మెన్ ఈశ్వరమ్మ యాదవ్, ధర్మకర్తలు చేగోని మల్లేష్ గౌడ్, చలమల యాదిరెడ్డి, సి.హెచ్. అనిత, నర్రె శ్రీనివాస్, అఖిల మధు సాగర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



శోభా కృత్ నామ వత్సరం అందరికీ శుభ దయకమని పంచాంగ ప్రవచన కర్త బాచం పల్లి సంతోష్ కుమార్ శర్మ చెప్పారు. రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై రాష్ట్ర దేవాదాయ శాఖ, భాషా సాంస్కృతిక శాఖ నిర్వహణ లో శోభాకృత్ నామవత్సర వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ శర్మ పంచాంగ పఠనం చెప్పారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో రాష్ట్ర రాజకీయాల్లో ప్రజలు అనూహ్య పరిణామాలు చూస్తారని అన్నారు. గంగానదీ పుష్కరాలు ఏప్రిల్ నెల 22 నుంచి ఆరంభ మవుతాయని తెలిపారు. దేవాదాయ శాఖా మంత్రి ఇంద్ర కరణ్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది ఉండదని ప్రజల కు శుభాలు జరుగతాయని పంచాగం చెప్పడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు వేదికపై మంత్రులు తలసాని శ్రీనివాస్, మల్ల రెడ్డి, డి జీ. పీ.అంజనీ కుమార్, వకుళా భరణం కృష్ణ మోహన రావు, దీపికా రెడ్డి, డాక్టర్ కే.వీ.రమణ పాల్గొన్నారు. డాక్టర్ మామిడి హరికృష్ణ స్వాగతం పలికగా దేవాదాయ శాఖ అధికారులు కార్యక్రమాలు నిర్వహించారు. నవతెలంగాణ-కల్చరల్

మంత్రికి సన్మానం

నవతెలంగాణ-బేగంపేట

ఉగాది పండుగ పురస్కరించుకొని రవీంద్ర భారతిలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గోషమాయిల్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు నందకిషోర్ వ్యాస్ బిలాల్ సన్మానించారు



ప్రజావ్యతిరేక, మతోన్మాద శక్తులను తరిమికొట్టండి

ఎమ్మెల్యే రాములు నాయక్

- సీపీఐ(ఎం) జన చైతన్య యాత్రకు వైరాలో సంఘీభావం
- ఎరుపెక్కిన వైరా పట్టణం





నవతెలంగాణ-వైరా/ వైరా టౌన్

ప్రజా వ్యతిరేక, మతోన్మాద శక్తులను తరిమికొట్టండని ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర బుధవారం ఖమ్మం జిల్లా వైరాకు చేరుకోగా.. ఎమ్మెల్యే సంఘీభావం తెలిపారు. వైరా పట్టణంలోని మధిర రింగ్ రోడ్డు సెంటర్లో ఏర్పాటు చేసిన సభకు ఎమ్మెల్యే హాజరై తమ్మినేని వీరభద్రంను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు, మతోన్మాద కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా గ్యాస్, పెట్రోలు, డీజిల్, కిరోసిన్, కరెంట్ ధరల పెంచుతూ సామాన్య మానవుడి నడ్డి విరుస్తోందన్నారు. వీటన్నింటినీ రాబోయే రోజుల్లో ప్రజలు చైతన్యవంతంగా, సమర్థవంతంగా అడ్డుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రతి ఒక్కరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా మార్కెట్ చైర్మెన్ బీడీకే రత్నం, మున్సిపల్ వైస్ చైర్మెన్ ముల్లపాటి సీతారాములు, పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, జిల్లా దిశా కమిటీ సభ్యులు కట్ట కృష్ణార్జున్‌రావు, మండల అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, జడ్పీ కో ఆప్షన్ సభ్యులు షేక్ లాల్ మొహమ్మద్, పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ మోటపోతుల సురేష్ పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

బీజేపీ మతోన్మాద, కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచడానికి, సంక్షేమం, మత సామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో మార్చి 17న ప్రారంభమైన జన చైతన్య యాత్ర బుధవారం వైరా పట్టణానికి చేరుకున్నది. అభ్యుదయ పాటలు, నృత్యాలు, వివిధ కళా రూపాలు, గిరిజన సంప్రదాయ నృత్యాలతో పట్టణం ఎరుపెక్కింది. వైరా మండలం స్టేజి పినపాక గ్రామం వద్ద సీపీఐ(ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో యాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఎర్రజెండాలు కట్టుకుని, ఎర్ర చొక్కాలు ధరించి పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైరా రింగ్ రోడ్డు సెంటరులో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ఎం.సాయిబాబా మాట్లాడారు.

సురక్షిత నీరు రావట్లేదు..

- నీటి నాణ్యతపై 97శాతం కుటుంబాలు ఆందోళన
- లోకల్ సర్కిల్స్ సర్వే వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలో 97శాతం కుటుంబాలకు సురక్షితమైన నీరు లభించటం లేదని 'లోకల్ సర్కిల్స్' సర్వే పేర్కొంది. మున్సిపాల్టీ, గ్రామపంచాయతీలు సరఫరా చేస్తున్న తాగునీటిని శుద్ధి చేయడానికి 'ఆర్వో వ్యవస్థ'ను ఏర్పాటు చేసుకున్నట్టు సర్వేలో పాల్గొన్న 44శాతం మంది చెప్పారు. నీటిశుద్ధి ప్రక్రియ చేపడుతున్న 'ఫిల్ట్రేషన్ ప్లాంట్ల' వద్ద నీటి నాణ్యత అత్యున్నతం కావొచ్చు, అక్కడ్నుంచీ నీరు ప్రయాణించాక...నాణ్యత తగ్గుతోందని అత్యధికశాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థలు సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను 97శాతం మంది విశ్వసించటం లేదని సర్వేలో తేలింది. దేశంలో ప్రముఖ సోషల్ మీడియా వేదికల్లో ఒకటైన 'లోకల్ సర్కిల్స్', 305 జిల్లాల్లో 26వేల మంది నుంచి వివరాలు సేకరించింది. స్థానికంగా సరఫరా చేస్తున్న నీటి నాణ్యత గతంతో పోల్చుకుంటే మెరుగుపడిందని 44శాతం మంది అభిప్రాయపడ్డారు. నీటి నాణ్యత అత్యంత పేలవంగా ఉందని 14శాతం కుటుంబాలు, 'సామాన్యం'గా ఉందని 32 శాతం కుటుంబాలు పేర్కొన్నాయి. తమకు సరఫరా అవుతున్న తాగునీటిని 97శాతం కుటుంబాలు వివిధ పద్ధతుల్లో శుద్ధి చేసుకుంటున్నాయి. ఎక్కువమంది ఆర్వో సిస్టమ్, వాటర్ ప్యూరిఫైర్స్..వాడుతుండగా, 5శాతం మంది మట్టిపాత్రలతో నీటిని వడకడుతున్నారు. మరో 5శాతం కుటుంబాలు నీటి బాటిల్స్‌ను కొనుగోలు చేస్తున్నాయని సర్వే పేర్కొంది.

పోరాడినా..

ఆస్ట్రేలియాకే దక్కిన సిరీస్

మూడో వన్డేలో 21 పరుగుల తేడాతో భారత్ పరాజయం



చెన్నై : ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగిన వన్డే సిరీస్‌ను భారత్ 1-2తో కోల్పోయింది. మూడో వన్డేలో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా 21 పరుగుల తేడాతో కంగారూల చేతిలో ఓడిపోయింది. స్వదేశంలో 26 సిరీస్‌ల తర్వాత ఏ ఫార్మాట్‌లోనైనా ద్వైపాక్షిక సిరీస్‌ను టీమిండియా కోల్పోయింది. ఈ సమయంలో, భారత జట్టు 24 సిరీస్‌లను గెలుచుకుంది . రెండు మ్యాచులు డ్రా అయ్యాయి.

టాస్ ఓడి ఆస్ట్రేలియా బ్యాటింగ్

చెపాక్ మైదానంలో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా జట్టు 49 ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. దీంతో భారత బ్యాట్స్‌మెన్ 49.1 ఓవర్లలో 248 పరుగులకే ఆలౌటైంది. చివరి బ్యాట్స్‌మెన్‌గా కుల్దీప్ ఔట్ కాగా, మహ్మద్ సిరాజ్ నాటౌట్‌గా నిలిచాడు.

భారత బ్యాటింగ్ వెన్ను విరిచిన జంపా

ఆస్ట్రేలియా ఆటగాడు ఆడమ్ జంపా రెండో ఇన్నింగ్స్‌లో ప్రతిసారీ భారత బ్యాట్స్‌మెన్‌ను ఇబ్బంది పెట్టాడు. ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో శుభమన్ గిల్ (37)ను జంపా ఎల్బీడబ్ల్యూ చేశాడు. ఆ తర్వాత 27వ ఓవర్లో సెట్ బ్యాట్స్ మెన్ కేఎల్ రాహుల్ (32) కూడా క్యాచ్ ఔట్ అయ్యాడు. దీని తర్వాత, అతను సెట్ బ్యాట్స్‌మెన్ హార్దిక్ పాండ్యా (40), రవీంద్ర జడేజా (18) క్యాచ్‌లను అవుట్ చేయడం ద్వారా టీమిండియాకు 8వ దెబ్బ కూడా ఇచ్చాడు. ఆ తర్వాత టీం ఇండియా కోలుకోలేక మ్యాచ్‌లో ఓడిపోయింది.



బ్యాటింగ్‌లో హ్యాట్రిక్ సాధించిన తొలి భారతీయుడు సూర్య

సూర్యకుమార్ యాదవ్ వరుసగా మూడో వన్డేలో గోల్డెన్ డక్‌కి గురయ్యాడు. అతను మొదటి , రెండవ మ్యాచులలో మిచెల్ స్టార్క్ వేసిన బంతికి(ఎల్‌బీడబ్ల్యూ) ఔటయ్యాడు. బ్యాటింగ్‌లో హ్యాట్రిక్ సాధించిన 13వ అంతర్జాతీయ ఆటగాడు సూర్య. ఒక బ్యాట్స్‌మన్ మూడు వరుస ఇన్నింగ్స్‌లలో మొదటి బంతికి సున్నాకి ఔట్ అయినప్పుడు, దానిని బ్యాటింగ్ హ్యాట్రిక్ అంటారు.

సూర్యకుమార్ కంటే ముందు, భారత ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, అనిల్ కుంబ్లే, జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మ , జస్ప్రీత్ బుమ్రా కూడా వరుసగా 3 వన్డేల్లో సున్నాపై పెవిలియన్‌కు చేరుకున్నారు, అయితే ముగ్గురూ వరుసగా మొదటి బంతికి ఔట్ కాలేదు.

రోహిత్ బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చాడు, సూర్య స్థానంలో అక్షర్‌ను భర్తీ చేశాడు.

వన్డే సిరీస్‌లో తొలి 2 మ్యాచ్‌ల్లో గోల్డెన్ డక్‌తో పెవిలియన్‌కు చేరుకున్న సూర్యకుమార్ యాదవ్ మూడో మ్యాచ్‌లో నంబర్-4 వద్ద బ్యాటింగ్‌కు రాలేదు. ఈసారి వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ నంబర్-4కి వచ్చాడు. రాహుల్ తర్వాత నంబర్-5లో అక్షర్ పటేల్, నంబర్-6లో హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌కు దిగారు.

కోహ్లి-రాహుల్ భారత్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు

13వ ఓవర్‌లో శుభ్‌మన్ గిల్ అవుట్ అయిన తర్వాత, రాహుల్ నంబర్-4 వద్ద బ్యాటింగ్‌కు వచ్చాడు. విరాట్ కోహ్లితో కలిసి రాహుల్ భారత ఇన్నింగ్స్‌ను చేజిక్కించుకున్నాడు. వీరిద్దరూ 93 బంతుల్లో 69 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 28వ ఓవర్‌లో 32 పరుగులు చేసిన తర్వాత రాహుల్ ఆడమ్ జంపాకు బలయ్యాడు . ఈ బలమైన భాగస్వామ్యానికి బ్రేక్ పడింది.

షూటింగ్‌లో భారత్‌కు తొలిస్వర్ణం

ప్రపంచకప్‌లో 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సరబ్‌జోత్‌కు స్వర్ణం , వరుణ్‌కు కాంస్యం

హర్యానాకు చెందిన సరబ్‌జోత్ సింగ్ (ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్) ప్రపంచకప్‌లో స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరుగుతున్న షూటింగ్ విభాగంలో.. బుధవారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. ధిన్ గ్రామానికి చెందిన రైతు కుమారుడు సరబ్‌జోత్ 16-0తో అజర్‌బైజాన్‌కు చెందిన రుస్లాన్ లునెవ్‌ను ఓడించాడు. 2023 ప్రపంచకప్‌లో భారత్‌కు ఇదే తొలి బంగారు పతకం. అలాగే భారత్‌కు చెందిన వరుణ్





తోమర్‌కు కూడా కాంస్య పతకం లభించింది.క్వాలిఫికేషన్ సిరీస్‌లో అతను 98, 97, 99, 97, 97, 97 స్కోరు చేశాడు. క్వాలిఫికేషన్ సిరీస్‌లో చైనాకు చెందిన లియు జిన్యావో 584 స్కోరుతో రెండో స్థానంలో నిలిచాడు. చివరి రౌండ్‌లో సరబ్‌జోత్ 253.2, రుస్లాన్ 251.9 షాట్‌లు కొట్టారు. వరుణ్ 250.3 స్కోరుతో మూడో స్థానంలో నిలిచాడు.

నవచిత్రం

పక్కా కామెడీ సినిమా

అల్లరి నరేష్, ఫరియా అబ్దుల్లా జంటగా మల్లి అంకం దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. చిలక ప్రొడక్షన్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.2గా ఈ సినిమా ఉగాది రోజున ఘనంగా ఆరంభమైంది. పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా దీన్ని రాజీవ్ చిలక నిర్మిస్తున్నారు. సినిమా ప్రారంభోత్సవంలో దర్శకుడు తరుణ్ భాస్కర్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, నిర్మాత సురేష్ బాబు క్లాప్ కొట్టారు. ఫస్ట్ షాట్ డైరెక్షన్ నాగ్ అశ్విన్ చేశారు. నిర్మాతలు జెమినీ కిరణ్, శరత్ మరార్ స్క్రిప్ట్ అందజేశారు. ఈ సందర్భంగా అల్లరి నరేష్ మాట్లాడుతూ,'ఇది చాలా మంచి కామెడీ ఎంటర్‌టైనర్. ప్రేక్షకులు నా నుంచి కోరుకునే ఫన్, ఫ్యామిలీ, ఎమోషన్ డ్రామా అన్నీ ఇందులో ఉంటాయి. ఏప్రిల్ 10 నుంచి షెడ్యూల్ స్టార్ట్ అవుతుంది' అని తెలిపారు. 'నరేష్‌తో పని చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. సినిమా అదిరిపోతుందనే నమ్మకం ఉంది' అని నాయిక ఫరియా అబ్దుల్లా చెప్పారు. నిర్మాత రాజీవ్ చిలక మాట్లాడుతూ,'దర్శకుడు మల్లి ఈ కథ చెప్పినపుడు ఈ కథకు నరేష్ గారు మాత్రమే న్యాయం చేయగలరనిపించింది. నరేష్‌తో సినిమా చేయడం ఆనందంగా ఉంది' అని అన్నారు. దర్శకుడు మల్లి మాట్లాడుతూ,'ఇది ఫ్యామిలీ ఎంటర్ టైనర్. నన్ను నమ్మి ఈ ప్రాజెక్ట్ ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు. అబ్బూరి రవి నా కథని మరో స్థాయికి తీసుకెళ్ళారు. అందరూ గర్వపడే సినిమా చేస్తాను' అని తెలిపారు.



నరేష్, ఫరియా అబ్దుల్లా

మెగా పవర్ మొదలైంది

నిర్మాత అల్లు అరవింద్ ఆశీస్సులతో సత్య ఆర్ట్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం.1గా 'మెగా పవర్' చిత్రం ఉగాది సందర్భంగా అన్నపూర్ణ స్టూడియోలో వైభవంగా ప్రారంభమైంది. శ్రీ కల్యాణ్, శశి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి గేదెల రవిచంద్ర దర్శకుడు. అడబాల నాగబాబు, సాయి నిర్మల, ఇల్లా అభిషేక్, సత్యమూర్తి గేదెల నిర్మాతలు. పూజా కార్యక్రమాల అనంతరం తొలి సన్నివేశానికి రఘుబాబు క్లాప్ ఇచ్చారు. హీరో కిరణ్ అబ్బవరం కెమెరా స్విచ్చాన్ చేశారు. పృథ్వీరాజ్ గౌరవ దర్శకత్వం వహించారు. ఇదే వేడుకలో సినిమా టైటిల్‌ను కూడా ఆవిష్కరించారు. హీరో శ్రీ కళ్యాణ్ మాట్లాడుతూ, 'హీరోగా తొలి చిత్రమిది. లైన్ చాలా బావుంది. నా మీద నమ్మకంతో మా బాబాయ్ నిర్మాతగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వచ్చే నెలలో రెగ్యులర్ షూటింగ్‌కి వెళ్తాం' అని తెలిపారు. 'తెలుగులో నాకు తొలి చిత్రమిది. హీరోయిన్ పరిచయానికి చక్కని కథ ఇది' అని నాయిక శశి చెప్పారు.దర్శకుడు రవిచంద్ర మాట్లాడుతూ, 'మదర్ సెంటిమెంట్‌తో సాగే యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. త్వరలో ఒక్కో క్యారెక్టర్‌ను రివీల్ చేస్తాం' అని అన్నారు.



శశి, శ్రీ కళ్యాణ్

స్లమ్‌డాగ్ హజ్బెండా మజాకా..



సంజయ్‌రావు, ప్రణవి

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటిస్తున్న చిత్రం 'స్లమ్ డాగ్ హజ్బెండ్'. చిన్న సినిమాగా మొదలైన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్ టైన్‌మెంట్ లాంటి పెద్ద సంస్థ రిలీజ్ చేయనుండటం విశేషం. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర మోషన్ పోస్టర్‌ను హీరో విజయ్ దేవరకొండ విడుదల చేశారు. గతంలోనే అనౌన్స్ చేసిన ఈ చిత్ర టైటిల్‌కు, అలాగే డైరెక్టర్ అనిల్ రావిపూడి రిలీజ్ చేసిన ఫ్రస్టేషన్ సాంగ్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పెళ్లితో వచ్చే ఫ్రస్టేషన్ పై సాగే ఈ పాటలో సునీల్ స్పెషల్ అప్పీయరెన్స్ సర్‌ప్రైజ్ చేసింది. కంప్లీట్ కామికల్ ఎంటర్టైనర్‌గా వస్తోన్న ఈ సినిమాలో బ్రహ్మాజీ, సప్తగిరి కీలకపాత్రల్లో నటిస్తున్నారు. 'ఓ పిట్టకథ' చిత్రంతో నటుడుగా మంచి పేరు తెచ్చుకున్న సంజయ్ రావుకు ఈ సినిమా పెద్ద బ్రేక్ ఇస్తుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే ఈ చిత్రాన్ని ఈ వేసవిలోనే విడుదలకు చేస్తామని మేకర్స్ తెలిపారు.

ఈసారి మీ ఊహలకు మించి..



బాలకృష్ణ

బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఎన్‌బికె108 అభిమానులు, కుటుంబ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది.
ఈ సినిమాలో బాలకృష్ణ మార్క్ మాస్, అనిల్ రావిపూడి మార్క్ కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి.
క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ను షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు.
ఉగాది కానుకగా బాలకృష్ణ ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసి అందరికి మాస్ ఫీస్ట్ అందించారు మేకర్స్. బాలకృష్ణ రెండు విభిన్నమైన అవతారాల్లో కనిపిస్తున్న రెండు పోస్టర్లను రిలీజ్ చేశారు. రెండు పోస్టర్లలో బాలకృష్ణ మునుపెన్నడూ చూడని గెటప్‌లలో కనిపిస్తున్నారు. అంతేకాదు వీటిపై 'ఈసారి మీ ఊహలకు మించి..' అంటూ క్యాప్షన్ ఉండటం అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో బాలకృష్ణ సరసన కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శ్రీలీల కీలక పాత్రలో నటిస్తోంది.

అన్నీ మంచి శకునములే..

సంతోష్ శోభన్, మాళవిక నాయర్, రాజేంద్ర ప్రసాద్, గౌతమి, రావు రమేష్, నరేష్ వికె నటీనటులుగా బివి నందిని రెడ్డి దర్శకత్వంలో స్వప్న సినిమా పతాకంపై రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్ర టైటిల్ ట్రాక్ లాంచింగ్ ఈవెంట్‌ని ఉగాది పండగ వాతావరణంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా నిర్వహించింది. ఈ పాటని కార్తీక్ పాడగా, రెహమాన్ సాహిత్యం అందించారు. 'రెండు కుటుంబాల మధ్య జరిగే కథ. వేసవిలో మన అమ్మమ్మ ఇంటికి వెళితే ఎంత హాయిగా ఉంటుందో అలాంటి కథ ఇది. ఈ వేసవికి చల్లని చిరుగాలి లాంటి సినిమా' అని దర్శకురాలు నందినిరెడ్డి అన్నారు. 'మంచి కథ, సంగీతంతో ఒక సినిమా చూస్తుంటే ఆ హాయి, ఆనందం వేరు. అంత హాయిగా సాగే సినిమా ఇది. గౌతమి, వాసుకి చాలా రోజుల తర్వాత ఈ చిత్రంలో నటిస్తున్నారు. నందిని రెడ్డి అద్భుతంగా తీసింది' అని నిర్మాత అశ్వినీదత్ చెప్పారు. 'టైటిల్‌కి తగ్గట్టుగానే ఇక నుంచి నాకు అన్నీ మంచి శకునములే' అని హీరో సంతోష్ శోభన్ చెప్పారు. ఈ చిత్రాన్ని మే 18న విడుదల చేస్తున్నారు.



సంతోష్‌శోభన్, మాళవిక నాయర్

30న పరారీ రిలీజ్



యోగేశ్వర్

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో జివివి గిరి నిర్మించిన చిత్రం 'పరారీ'. శ్రీ శంకర ఆర్ట్స్ బ్యానర్‌పై గాలి ప్రత్యూష సమర్పణలో నిర్మితమవుతున్న ఈ చిత్రంలోని 'ఏమో ఏమో సాంగ్'ని విజయశాంతి విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'యోగిశ్వర్‌కి మొదటి సినిమా అయినా డాన్స్ బాగా చేసాడు. సక్సెస్ అవుతాడు. ఈ సినిమాను కూడా అందరూ ఆదరించి పెద్ద సక్సెస్ చేయాలని కోరుతున్నాను' అని చెప్పారు. 'మార్చి 30న గ్రాండ్‌గా మా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం' అని నిర్మాత జి.వి.వి.గిరి తెలిపారు. సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్ మాట్లాడుతూ,'పాటలు అన్ని బాగా వచ్చాయి. మార్కెట్లోకి రిలీజైన మా పాటలకు మంచి ఆదరణ లభిస్తోంది' అని అన్నారు. 'విజయశాంతి నా డాన్స్‌లను మెచ్చుకోవడం చాలా హ్యాపీగా ఉంది. డిఫరెంట్ పాయింట్‌తో వస్తున్న ఈ సినిమా కచ్చితంగా అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని హీరో యోగేశ్వర్ అన్నారు.

ఆ మహిళల జీవితంలో ఏం జరిగింది?

తెలంగాణలో 20 ఏండ్ల క్రితం ముగ్గురు మహిళల జీవితాల్లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా లవ్ అండ్ క్రైమ్ కథతో ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వి.యఫ్.సి క్రియేషన్స్ పతాకంపై హరి మేఘూమ్స్, రవితేజ, హనీ నటీటులుగా కొప్పుల చిన్నయ్యని దర్శకుడిగా పరిచయం చేస్తూ, తునికి హరికృష్ణ నిర్మిస్తున్న చిత్రమిది. ఈ నూతన చిత్ర పూజా కార్యక్రమాలు ఇటీవల ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ఘనంగా జరిగాయి. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి రఘుబాబు క్లాప్ కొట్టగా, నిర్మాత శ్రీ రంగం శ్రీనివాసులు కెమెరా స్విచాన్ చేసారు. టి.యన్.జి.ఓ ప్రెసిడెంట్ ప్రభాకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు కొప్పుల చిన్నయ్య మాట్లాడుతూ,'అభ్యుదయంగా ఎదగాలనుకున్న స్త్రీకి పురుషుడు ప్రతిసారి ఏదో రకంగా అడ్డు పడుతూనే ఉంటాడు. అలాంటి సమయంలో వారు ఎలాంటి అవస్థలకు గురవుతున్నారనే కథే ఈ సినిమా. సినిమాలో బాల్యం, కౌమారం, యవ్వన దశలలో ముగ్గురు మహిళలు వారి జీవితాలలో ఎదుర్కొన్న యదార్థ కథలను ఈ సినిమాలో చూపిస్తున్నాం. తెలంగాణలోని నిర్మల్, ఖానాపూర్, జిన్నారం పరిసర ప్రాంతాల్లోనే ఈ సినిమా షూటింగ్ మొత్తం చేస్తాం' అని తెలిపారు.

'తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా ఉండే ఈ సినిమా ఎక్కువగా తెలంగాణ స్లాంగ్‌లోనే ఉంటుంది. రెండు షెడ్యూల్స్‌లో పూర్తి చేస్తాం' అని చిత్ర నిర్మాత తునికి హరికృష్ణ అన్నారు. పాటల రచయిత దాసండ్ల అంజయ్య మాట్లాడుతూ, 'ఈ సినిమాకి ఐదు పాటలు రాశాను. పాటలు చాలా బాగా వచ్చాయి. అందరికీ నచ్చే కథాంశమిది' అని చెప్పారు.



హీరో హరి మేఘూమ్స్‌తో ముఖ్య పాత్రధారులు

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.